
25 నయాపైసలు
9-11-60

ఆంధ్ర సచిత్ర వారపత్రిక




30 ఏళ్లనుంచి డాల్డా
శ్రేష్ఠతను మెచ్చినవారు వేనకువేలు
మీకుటుంబము ఎందుకు
వెనుక బడాలి ?
DALDA
CONTAINS VITAMINS A AND D
డాల్డా శుద్ధ మైనది. అది అతి శుద్ధమైన కాయగూరల నూనెలనుంచి తయారు చేయబడినది. డాల్డా పుష్టికరమైనది! అది ఆరోగ్యము కోసం విటమిన్‌లు చేర్చబడి నట్టిది.
డాల్డాతో వండిన కూరలు, వేపుళ్లు, పోపు వేసిన పచ్చళ్లు చాలా రుచికరంగా నుండును. వేనకు వేలు గృహిణులు తమ వంటలన్నిటికీ డాల్డాను ఎన్నుకొంటున్నారు, ఆశ్చర్యం కాదు. మీ కుటుంబమునకు కూడా అట్టి దివ్యమైనది అక్కర్లేదా ?
డాల్డా
వనస్పతి
హిందుస్థాన్ లీవర్
DL. 34-X52 TB

ఆంధ్రసచిత్ర వారపత్రిక

ఉత్తరాలు

"మనము-మన దేహస్థితి"

26-10-60 తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో డాక్టరు గారి బాలసుందరరావు వ్రాసిన "మనము-మన దేహస్థితి" చాలా బాగున్నది. ఇంకా మరిరెండు పేజీలైనా ప్రచురిస్తే చాలా బాగుంటుందనుకుంటాను. డాక్టర్ గారి బాలసుందరరావు గారికీ, సంపాదకులైన మీకును నా ధన్యవాదములు.

కొల్లా నరసింహస్వామి (గజపతినగరం)

* * *

26-10-60 తేదీవారపత్రికలో "మనము-మన దేహస్థితి"ని గురించి డాక్టర్ గారి బాలసుందరరావుగారు వ్రాసిన మొదటివ్యాసము చాల బాగుంది. ఆరోగ్యాన్ని గురించి పాఠకుల ప్రశ్నలకు మీపత్రిక ద్వారా ... డాక్టర్ గారు ... చున్నాను. వారికి నాధన్యవాదాలు. అన్నిటికన్న ముఖ్యమయిన ఆరోగ్యాన్నిగురించిన శీర్షికను మీరు ప్రవేశపెట్టినందులకు చాల సంతోషము.

ఎస్. నాదముని (పూనా)

* * *

నివారణకూడా ముఖ్యం

'మనము - మనదేహస్థితి' అను క్రొత్త శీర్షిక వ్రాస్తున్నందుకు చాలసంతోషము. వ్యాధులనుగురించి మాత్రమే వ్రాయక, వ్యాధుల నివారణకు ఏమిచేయవలెనో వ్రాయవలెననికూడా, సుందరరావుగారిని కోరుచున్నాను.

భట్లపెనుమర్తి రాజ, రాణి (వాల్తేర్)

* * *

"మనము-మనదేహస్థితి" వ్యాసరచన చాలాబాగుంది. కేవలం ప్రజలకేగాక వైద్యులకు కూడా ఎంతైనా సహకారి అని చెప్పవచ్చు. పల్లెలమాట అటుంచి ముఖ్యంగా పట్టణవాసుల్లోనే ఈ అజ్ఞానము ఎక్కువ. అంతదాకా ఎందుకు? బాగా చదివినవాళ్ళు కూడా రెండురోజుల్లోనే రోగం నయం కావాలంటారు. లేకపోతే డాక్టర్ని మారుస్తారు. చివరికి ఏ దారినపోయే భూతవైద్యుణ్ణో పిల్చి వాడి మాయ మాటలు నమ్మి మంత్రం పెట్టిస్తారు. అవసరమైనచోట్ల ప్రథమచికిత్సలు చిట్కాలుకూడా వ్రాస్తే మరింత లాభదాయకంగా ఉంటుందేమో. సామాన్యులకూడా అర్థమయ్యేలా సరళంగా

వ్రాసి అందిస్తూ ఆంధ్రలోకానికి సహాయం చేస్తున్న డా॥ జి. బి. ఎస్. రావ్ గారికీ, అమూల్యాన్ని ప్రచురించిన ఈ పత్రికా సంపాదకులకూ నాజోహారులు.

అన్నవరపు కోటేశ్వరరావు (గుంటూరు)

* * *

చిన్నారి పాప

26-10-60 తేదీ ఆంధ్ర పత్రిక వారపత్రికలో 'కవితా కింకిణి' పోటీలో బహుమతి పొందిన గేయం 'చిన్నారిపాప' ఎంతయు తగియున్నది. రచయితగారికి పత్రికద్వారా హృదయపూర్వక అభినందనలు తెలియజేయుచున్నాను.

ఎస్. వేణుగోపాల్ (బృందావన్)

* * *

తెలుగు వెలుగులు పుస్తకరూపం!

"తెలుగు వెలుగులు" 1వ భాగంగా- ఇంతవరకు వెలువడిన వ్యక్తుల స్కెచెస్ పుస్తకరూపంలో ప్రచురిస్తే మాబోటి పాఠకులకు ఉపయోగపడ గదా!

'రాగాల చె... పరాగాల చలం' అయాడనీ — [illegible] మచ్చు తునకలు తూచి [illegible] కూర్చినవి ...రచిపోగలమా?

ఉప్పలూరి సుబ్బరాయ శర్మ (విజయవాడ—2)

* * *

తెలుగు వెలుగుల కొక వింతశోభను చేకూర్చిన శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి రచనలు, "తెలుగు తల్లి శ్రీపాద రేణువులు" అన్న వాక్యం నన్ను పరవశుణ్ణి చేసింది. రచయితకు నా ధన్యవాదములు.

ఆల్లూరు దాశరధి (కొత్తగూడెం)

* * *

"తెలుగు వెలుగులు" శీర్షికలో "భారతజాతీయతకన్న ఆంధ్రజాతీయతే పరమారాధ్యం మొదలయిన చిత్ర విచిత్ర భావ ప్రాయాలు ఘనీభవించిన మూర్తి" అయిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని గురించి వ్రాసిన దెంతో సమంజసంగా ఉంది.

విది ఏమైనా తెలుగువెలుగుల రచయిత ఉన్నది ఉన్నట్లు వ్రాయుచున్నారు.

కే. వి. స్వామి (అనంతపురం)

* * *

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారిని మీ "తెలుగు వెలుగులు" శీర్షికలో ఎన్నుకొని వారిలోని విశేషాలను సునిశితమయిన ధోరణిలో తెలియ జేసినందుకు నా అభివందనములు. "తెలుగు – వెలుగుల" వ్యాసకర్తను ఎప్పుడు పరిచయము చేస్తారు?

ఎ. చంద్రశేఖర రెడ్డి (పిడుగురాళ్ళ)

* * *

ఒక సలహా

అక్టోబరు 19 తేదీగల మీ దీపావళి విశేష సంచికలో శ్రీ "రామచంద్ర" గారి 'దీపావళి-నాడు నేడు' వ్యాసము, రచయిత విస్తృత సంస్కృత జ్ఞానమును, పరిశోధనా శక్తిని చాటుచు, సంచికకు శోభాయమానముగా ఉన్నది.

ఆ వ్యాసమును చదవినపిమ్మట మీకు ఒక సలహా ఇవ్వదగునని తోచినది. మనము ప్రతిరాత్రి ఆకాశమును, అందలి అసంఖ్యాకమైన నక్షత్రములను చూచుచున్నాము. ఆకాశమునుగూర్చి తెలుసుకొనుట ఎంతో ఆనందముగా యుండును. దాని విషయమై మీ పత్రికలో శాస్త్రోక్తముగా, అందరికి అర్థమగునట్లుగా, ఖగోళ శాస్త్రమునుగూర్చి ఒక సీరియల్ ప్రచురించదగును.

రాధాకృష్ణ (వారణాసి)

* * *

శోచనీయం!

పత్రికను పొగడుతూ వ్రాసిన ఉత్తరాలు వెంట వెంటనే ప్రచురింపబడటం బహుశోచనీయం. పెదకథలు తప్ప పొట్టి కథలు, కథ కానికథలు 1/4 వంతులు కాపీకొట్టినవే. ఎవరూ కాదనలేరు. 26-10-60 వారపత్రికలో 37వ పేజీలో వ్రాసిన "జపానికి" అన్నటువంటిది, మరియు ఆఖరు పేజీలోని పొట్టికథలలో "మేస్త్రీ కూలీ" అన్నటువంటిది కాపీ కొట్టినవిగాక మరేమిటి?

సియ్యాద్రి గురుమూర్తి (ఖర్గపూరు)

* * *

మీ ఆంధ్ర సచిత్రవారపత్రిక (26-10-60 తేది) మమ్మల్ని అందర్నీ ఆనందసాగరంలో ఓలలాడించింది. "ఊమెన్ గారి కార్టూనులు" ఉత్సాహాన్ని కలిగించాయి. "న్యాధిలీలేఖ" చదవంగానే నూతనానందం కలిగింది. "కవితాకింకిణి" "నువ్వుకూడా పద్యాలు వ్రాయి" అని పురిగొల్పింది. "పొట్టికథలు" చాలా నవ్వు తెప్పించాయి.

కం. ఈ వారము మీపత్రిక
కావాలని యక్క నన్ను కమ్మగయడుగన్
"చాకాలిగాని యిటుకని?
కౌకాలంబే కొను మొక కాపీ"
యంటిన్.

కొల్లూరు వెంకట మల్లిఖార్జునరావు (కాకినాడ)

* * *

ఏది సరి అయినది?

26-10-60 తేది సంచికలో మొట్టమొదట ప్రచురించిన కార్టూనులో ఒకపక్క రాజాజీ 'అజమాయిషీ ప్రభుత్వం కావాల'ని రాసి ఉన్న అట్టపట్టుకొని ఉన్నట్లు, అతని వెనుక ఇంకొకరు 'రాజాజీ చెప్పింది వేదం మాకు, అజమాయిషీ ప్రభుత్వము కావాలి' అనిరాసి ఉన్న అట్టనుపట్టుకున్నట్లు చిత్రించారు. వేరొకపక్క ఒక కార్మికుడు నెహ్రూ గారితో 'ఇంటలేనిశాంతి ఇలనెట్లు నెలకొల్పసాధ్యమౌను!' అని అంటున్నట్లు చిత్రీకరించారు. ఈ కార్మికునిమాటలు నెహ్రూ గారిని సంబోధించి అన్నవో లేక రాజాజీని సంబోధించి అన్నవో తెలియలేదు. ఎందుచేతనంటే మనదేశములో అనేక అల్లరులు, తిరుగుబాట్లు ఉన్నప్పటికీ నెహ్రూగారు పెద్దగావెళ్ళి న్యూయార్కులో మొన్న నిరాయుధీకరణం గురించి ప్రపంచశాంతిని గురించి పెద్ద లెక్చరిచ్చివచ్చారు. దీనివలన ఆ కార్మికుడు నెహ్రూగారిని ముందుదేశము పరిస్థితి బాగుచేసుకొని తరువాత ప్రపంచ శాంతిని గూర్చి ఆలోచించమని చెప్పుతున్నట్లుంది. ఇక రెండోది రాజాజీగారి పార్టీలోనే ఐకమత్యము సరిగాలేదు. అటువంటి సమయాలలో 'అజమాయిషీ ప్రభుత్వం కావాలని' తీగా తమపార్టీ అధికారంలోకవస్తే దేశంలో ఏమిశాంతి స్థాపించగలరు అని వ్యంగ్యముగా అంటున్నట్లున్నది. దీనిలో ఏది సరిఅయినదో తెలియజేస్తారా?

కే. రామారావు (కరీంనగరము)

* మొదటిదే సరి అయినది.

* * *

హరివంశము

మీరు ప్రచురించుచున్న కథలలో "హరివంశము" చాల బాగుగా ఉంది; చదువుతూ ఉన్నంతసేపు కన్నులు ఆనందబాష్పాలతో నిండిపోతూన్నాయి; మొన్న దీపాలు (ఎలక్ట్రిక్ లైట్లు) ఆరిపోయాయి; మ్యునిసిపలు లైటు కాంతిలో చదివాను; దీపము అంటించడాని కయ్యే ఆలస్యాన్ని భరించలేక—

జానకీరామకుమార్ (హైదరాబాదు)

* * *

ఉషాకన్య కథ

"ఉషాకన్య కథ" రసవత్తరంగా మంచి పంథాలో సాగుతూంది. రచయితకు నా ధన్యవాదాలు. ఇకమీదట కూడ ఇలాంటి కథలే ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

ఎస్. లక్ష్మీనారాయణ (కాళహస్తి)

* * *

మీ (మా) పత్రికలో ప్రతివారం ప్రత్యేక శీర్షిక ఉంటుంది. ప్రస్తుతము పత్రికలో ప్రచురిస్తున్న "ఉషాకన్య" కథ సీరియలు చాలా బాగుంది. రచయితకు నా ధన్యవాదాలు.

పొరుపూడి సుబ్బారాయుడు (రాజోలు)

* * *

కార్టూనులు

మీరు వారవారము పత్రికలో ప్రకటించుచున్న కార్టూనులు చాలా బాగుంటున్నాయి.

ముఖ్యంగా - ఎప్పుడూ ఇంతే — శంకర్ గారి కార్టూన్ నన్ను పొట్ట చెక్కలయేలా నవ్విస్తూంది. వారికి పత్రికద్వారా కృతజ్ఞత తెల్పుకొనుచున్నాను.

పి. మల్లికార్జునరెడ్డి (బెలగల్)

* * *

26-10-60 వ తేదీ సంచికలో వేసిన "లేడీస్ ఫస్ట్" అను చిత్రము ఈ కాలమునకు

ఉత్తరాలు

తగినట్లు సహజభావగర్భితముగా నుండి, నా కానందము కల్గించినది. ఆ చిత్రకారునికి నా హృదయపూర్వకాభివందనములు.

ఎస్. రమ (ఏలూరు)

బహుమతి పొందిన కథ

దీపావళి కథల పోటీలో నేను వ్రాసిన "ప్రేమకు కత్తిపోట్లు" అనే కథకు ప్రథమ బహుమతి నొసగిన ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంపాదకులకును, ముచ్చట గొలిపే బొమ్మను చిత్రించి కథకు అందాన్ని కూర్చిన వారికిని వందనము లర్పిస్తున్నాను.

ఎమ్. అంజిరెడ్డి (గొరవరం)

* * *

2-11-60 వ తేది ఆంధ్రసచిత్రవారపత్రికలో శ్రీ ప్రభుగారు వ్రాసిన 'వంకర బ్రతుకులు' చివరికొచ్చేకొడికి నాకండ్లలో రెండు నీటి బిందువులు రాలాయి. వారికి నా అభినందనలు తెలియజేయండి.

వై. రామస్వామినాయుడు (తిరుపతి)

* * *

2-11-60 సంచికలో ప్రచురించిన "వంకర బ్రతుకులు" కథ ఎంతబాగుందంటే, కథముగిసినవెంటనే ఉత్తరంద్వారా మీకు నా అభినందనలను తెల్పకుండా ఉండలేకపోతున్నాను. రచయిత 'ప్రభు' గార్కి నా అభినందలను తెలుపగోరుచున్నాను.

పి. ఎస్. భాస్కర్ కుమార్ (మద్రాసు)

* * *

26-10-60 వ తేది సంచికలో వెలువడిన కథానిక 'మారెమ్మగుడి' శ్లాఘనీయంగా ఉంది. రచయిత శ్రీ సి. వేణు పల్లెజీవితాన్ని పరిసరాలను ఉన్నవున్నట్లు ప్రతిబింబింపజేశారు తమకథలో. సహజమైన భావాలతో భావాలకుతగిన భాషతో సాగింది రచన. రచయితకు నా అభినందనాలు.

రాగూరి నాగిరెడ్డి (మద్రాసు)

* * *

మీరు 26-10-60 తేది ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించిన 'సౌందర్య దేవత' అనేకథ చాలాబాగుంది. ఇటువంటి కథలు మా వంటి బాలలకు అలుకతీర్చుటకై మీరు మా (మీ) ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురించి మమ్ములను ధన్యులను గావించితిరి. ఆ కథ రచయితకు నా ధన్యవాదాలు మీ పత్రికద్వారా తెలుపుచున్నాను.

డి. బదరీనారాయణరావు (రాయచోటి)

* * *

26-10-60 వ తేది పత్రికలో ఖండవిల్లి సాంబశివరావు వ్రాసిన 'శ్రీమతి - శ్రీవారు' అన్న వ్యాసము ప్రతివాక్యము, ప్రతిమాట కూడా చదువుతూఉంటే నవ్వు ఆపుకొనలేక చచ్చాము. ఈ వ్యాసములోనిధోరణి మొదటి నుంచి చివరివరకు ఒకేవిధముగా నడిపించి, గుమాస్తా జీవితమును కళ్ళముందు నిలిపినట్లు చూసేటట్టుగా చిత్రీకరించినందుకు ఈపత్రిక ద్వారా అతనికి నా ధన్యవాదాలు అందజేస్తూ ఉన్నాను.

పి. వి. చలపతిరావు (ఢిల్లీ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక. శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 60

9.11.60
బుధవారం

శార్వరి కార్తిక బహుళ షష్ఠి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, శంబుచెట్టివీధి,
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

విఠల్ ప్రొడక్షన్స్‌వారి 'కనకదుర్గ'లో

కృష్ణకుమారి

అనివార్యమైన కారణాలచేత ఈ వారం ఊమెన్ వ్యంగచిత్రం ప్రచురించలేక పోయాము.

—సం.

ఆంధ్రసచిత్రవారపత్రిక నిర్వహిస్తున్న పోటీలు

'కథకానికథ', 'కార్టూన్‌పోటీ', 'గళ్ళనుడికట్టు ఆధారాలపోటీ', 'కవితాకింకిణి' మున్నగు పోటీలలో పాల్గొనేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలుగమనించాలని కోరుతున్నాము:


ఆయాపోటీలలో పాల్గొనడానికి ప్రత్యేకమైన నిబంధనలు ఏమీలేవు. ప్రవేశరుసుము లేదు. ఎవరు అయినా పాల్గొనవచ్చు. పోస్టుకార్డులమీద వ్రాసి పంపినా, 'ఇన్‌లాండ్ లెటర్'లలోను, కవర్లలోను పంపినా ఏపోటీకి సంబంధించినది స్పష్టంగా వాటిమీద వ్రాయవలసి ఉన్నది. అవిధంగా వ్రాసి పంపని వాటిని పరిశీలించడం జరుగదు. అన్ని పోటీలకు కలిపి ఒకే కార్డుమీదగాని, ఇన్‌లాండ్ లెటర్‌లోగాని, కవరులో కాని పంపినా వాటిని పరిశీలించడం జరుగదు.

ఆయా పోటీలకు పంపినవాటిని తిప్పిపంపడం జరుగదు. కనుక స్టాంపులుకాని, స్టాంపులు అతికించిన చిరునామాలు కల కవర్లుకాని జతచేసి పంపరాదు.

కార్టూన్‌లు ఏ కాగితంమీద అయినా వేయవచ్చు. కాని 'ఇండియన్ ఇంక్'తో వేయవలసి ఉన్నది.

ఏసందర్భంలోను ఆయాపోటీలలో పాల్గొనేవారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం సంభవంకాదు.

—సంపాదకుడు



ఆకాశవాణి సంగీతం పోటీలలో మృదంగవాద్యనైపుణ్యానికి శ్రీ కల్లూరి కృష్ణమోహనరావు, కేంద్రదేశీయ వ్యవహారాలమంత్రి శ్రీ గోవిందవల్లభపంత్ ద్వారా బహుమతి స్వీకరిస్తున్న దృశ్యం.

న్యూఢిల్లీ లేఖ — **శ్రీ కృష్ణ**

ఐక్యరాజ్యసమితిలో నీతిబోధ

కాంగ్రెసులో గుట్టు విదేశాలకేమి ఎరుక?

ప్రపంచంలో ఉద్రిక్తతను తగ్గించడానికి మన ప్రధానమంత్రి, రక్షణ మంత్రి ఐక్యరాజ్య సమితిలో కాయకష్టం పాటు పడ్డారు. ఈ విధానాన్ని అనుసరించి శ్రీ కృష్ణ మీనన్ సమితి సర్వసభ్య సమావేశంలో 20 రాజ్యాల మద్దతుతో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు.

దురదృష్టవశాత్తు శ్రీ కృష్ణ మీనన్ దేశంలో లేకపోయినందువల్ల కాబోలు, అంతరంగికంగా ఉద్రిక్తత పెరిగింది. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకో మన్న శ్రీ సంపూర్ణానంద్ కు, ప్రదేశ్ కాంగ్రెసు నూతన అధ్యక్షుడు శ్రీ చంద్రభాను గుప్తకు మధ్య ఏర్పడిన వైమనస్యాలను ఉపశమింపజేయడానికి ప్రయత్నించి, ప్రధానమంత్రి విఫలులయ్యారని ఇదివరకే తెలియజేశాను. సమితిలో శ్రీ కృష్ణమీనన్ చేసిన ప్రసంగం పూర్తి పాఠాన్ని వారిముందు (శ్రీయుతులు సంపూర్ణానంద్, చంద్రభానుగుప్తలముందు) ఉంచినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రపంచ శాంతికోసం నడుం కట్టిన భారతదేశం సంక్షేమం దృష్ట్యా, కనీసం ప్రధానమంత్రి స్వరాష్ట్రంలోనైనా శాంతి నెలకొని ఉండటం అవసరమనే భావం వారికి కలుగలేదు.

ఇంతటితో కథ కంచికి వెళ్ళలేదు. మంత్రివర్గంలో మార్పు రావాలని మళ్ళీ మైనారిటీలో ఆందోళన జరుగుతోంది. కను లకు వ్యక్తి చెప్పాలని తీర్మానించుకున్నా ఆంధ్రలో పాడనూ పిన గొడవలు సమసిపోలేదు. ఒరిస్సా మిశ్రమమంత్రివర్గం పదున్న అపరిష్కృతంగానే ఉండిపోయింది. మధ్యప్రదేశ్ శాసనసభలో ఆరోగ్యమంత్రిపై విమర్శ రావటంతో, తను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇవ్వగలనని డా॥ కట్జూ బెదరించారు. అస్సాంలో వైమనస్యాలు అల్లాగే ఉన్నాయి. పంజాబ్ గొడవలు రెచ్చిపోతున్నాయి. ఇది ఈ నాటి భారతదేశం స్థితి.

దేశం కల్లోలంపాలౌతుండా కాపాడాలంటే ప్రధాన సమస్యలను ఎదుర్కొని, పరిష్కరించాలి. గాంధీజీ సిద్ధాంతాలపట్ల అభిమానం వెల్లడిస్తూ, ఆచరణలోమాత్రం వాటిని అనుసరించని నాయకులు కాంగ్రెసులో కొల్లలుగా ఉన్నారు. పరిపాలనా వ్యవహారాలలో పోక్యం కలిగించుకునేందుకు తమ పార్టీ సభ్యులను కాంగ్రెసు పరిపాలకులు అనుమతించారు. పెక్కు సందర్భాలలో పరిపాలనా వ్యవస్థపై కాంగ్రెసు వాదుల ఆధిపత్యం సాగుతోంది. భారతరాజధానిలో కాంగ్రెసు రాజకీయవాదులు పరిపాలనను దుస్సాధ్యం చేశారు. ఢిల్లీలో అసలు పరిపాలన జరుగుతోందా అని ఆశ్చర్యం కలుగుతుంది.

* * *

చక్కెర పరిశ్రమతో వెనుక కలిగిన అనుభవాన్ని విస్మరించి కొంబోలు, ఆహారశాఖ చక్కెర ఎగుమతి కోటాను నిర్ణయించింది. చక్కెర ధరను పెంచిగాని, లేక ప్రత్యక్షంగా డబ్బు ఇచ్చిగాని సహాయం చెయ్యాలని ఈ పరిశ్రమ కోరింది. సహాయం మొత్తం రు. 1 కోటి 25 లక్షలు- రు. 1 కోటి 30 లక్షలలోపు ఉంటే చాలునని మనవి చేసింది. దేశంలో చక్కెర ధరను నిర్ణయించినందువల్ల కలుగుతున్న ఈ నష్టాన్ని భరించలేకపోతున్నట్లు మొరపెట్టుకున్నది.

1957-58 లో ప్రభుత్వం మణుగు రు. 36 లకు చక్కెర ధరను నిర్ణయించి, ఎగుమతి చేసే చక్కెరపై మణుగు ఒకటింటికి అర్ధరూపాయి చొప్పున మిగిలే వీలు కల్పించింది. మొత్తం 36 వేల టన్నుల చక్కెర ఎగుమతి అయింది.

1958-59 లో సైతం ఈ ప్రకారంగానే జరిగింది. క్రితం ఏడాది ఎగుమతి కావలసిన 4 వేల టన్నులతో సహా, మొత్తం 11 వేల టన్నుల చక్కెర ఈ ఏడు ఎగుమతి అయింది.

ధరల సమస్యను 1958-59 లో టారిఫ్ కమిషన్‌కు కూడా నివేదించడమైనది. కాని, కమిషన్ ఏ విధమైన సవరణలు సిఫార్సు చేయలేదు. చక్కెర ఎగుమతులలో వచ్చేనష్టాన్ని పూడ్చుకునేందుకే మణుగుకు అర్ధరూపాయి చొప్పున మిగులు చూపినట్లు భావించాలని కమీషన్ పేర్కొన్నది.

1959-60 లో మణుగుకు 3 అణాలు చొప్పున చెరకుధర పెంచారు. చక్కెరధరను మణుగు ఒకటింటికి రూ. 37-85 లకు హెచ్చించి, దీనిని (3 అణాలను) ప్రజలపై రుద్దారు.

ఉత్పత్తి ఖర్చులు మణుగుకు 39 నయే పైసలు చొప్పున పెరిగినట్లు పరిశ్రమ పేర్కొంటోంది.

ధరలు నిర్ణయింపబడినప్పుడు 20 లక్షల టన్నుల చక్కెర మాత్రమే ఉత్పత్తి అయిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇప్పుడీ ఉత్పత్తి 24 లక్షల టన్నులకు పెరిగింది. నిజానికి ఉత్పత్తి పెరిగినప్పుడు ఖర్చులు తగ్గాలి. అంతేకాక 1959-60 సీజనునుంచి ఎగుమతులులేవు. మణుగుకు 11 నయేపైసలు చొప్పున పరిశ్రమకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. ఈవిధంగా పరిశ్రమకు సుమారు రు 72 లక్షలు లాభించింది. అదనంగా ఉత్పత్తి అయిన చక్కెరపై ఎక్సైజ్ సుంకం ముదరా ఇచ్చికూడా ప్రభుత్వం మరో 6½ కోట్లు సమకూర్చిపెట్టింది.

చక్కెర పరిశ్రమను ఆదరించి, వృద్ధిలోకి తీసుకొనివచ్చిన ప్రజల సంగతి మాత్రం ఎవ్వరికీ పట్టదు. దీపావళి పండుగ ముందుగా ఎగు

(62-వ పేజీ చూడండి)



"ఓ ప్రభూ"

బృందావనం రంగాచార్యులు

కోమల పుష్పరాజములకున్ మకరందము బొజ్జలందు నే
జామున బోసిపోవుదో! లసన్నవమోహన రూపవైభవ
శ్రీ మహితమ్ములై పరవశించి మనోజ్ఞ పరిమళాలతో
భూమి నలంకరించె నవి; పుష్కల కాంతియుతమ్ములై ప్రభూ!
గిరిశిఖర్వాలనుండి పులకించిన పూవుల నావ రీతిగా
స్మరదరహాస రాశివలె చంద్రుని వెన్నెలవాక పోల్కి ను
ద్ధురతర మంగళధ్వనుల దూకెడి యా సెలయేటి కన్నె సుం
దర గమనమ్మునన్ తళుకు దాచితివేమొకో! తప్పకన్ ప్రభూ!
చంచలముల్ మహారుచిర సాంద్రము లద్భుత పూర్ణ దివ్యరే
ఖాంచితముల్ మహోజ్జ్వలము లవ్యయ నవ్య కళావికాసముల్
పంచెడి దివ్వెలీ భువన భాండములన్ వెలిగించు రవ్వలా
మించు మెఱుంగు మాలలుసుమీ! విరజిమ్ము భవత్ప్రభల్ ప్రభూ!
కారణ జన్మలౌ ఘనుల కౌశలమున్ గమనించు నేర్పు సం
స్కార విదూర భావజలజమ్ముల నూత్నసుగంధ పంక్తులన్
గోరి రహింప జేయగల గుప్త మహామహిమమ్ము, శాశ్వత
శ్రీ రుచిరమ్ముగా భవదశేష విశిష్టతఁ దెల్పునో ప్రభూ!
అకలుష భావబోధనలకై జగమెల్ల నిరీక్షసేయు నో
పిక గలిగించి విశ్వహిత విస్తృత తాత్త్విక వాదనాసుమ
ప్రకర సువాసనల్ ధరణిపై వెదజల్లి జనావళినము
త్సుకతకు సౌఖ్యభావికిని శోభవెలార్చిన దీవెగా ప్రభూ!
సౌందర్యామృత సాగరమ్ములు శరత్సౌదామినీ మూర్తిలో
చిందించున్ రమణీయవైఖరుల రాశీభూతమైయున్న ఆ
మందారమ్ముల మధ్య గుల్కి వచియింపన్ రాని యే తేజమో
క్రొందళ్కుల్ జగమెల్ల నద్దుకొను నిగ్గుల్ దిద్దె దీవో ప్రభూ!

కవితాకింకిణి

బహుమతి పొందిన కవిత

బాల్యమిత్రుడు రాజేశ్వరరావు ఆగమనం రమణారావు కెంతో ఆనందం కలిగించింది. ఉభయులు కుశల ప్రశ్నలైనతరువాత కాఫీ టిఫిన్ తీసుకొని కాసేపు అట్లా షికారువెళ్లి వద్దామనుకుంటూ ఉండగా రమణారావు కొమారుడు శ్యాం వక్కపొడి డబ్బా చేతిలో పట్టుకొని 'ఇదో నాన్నా అమ్మ యిచ్చిందం'టూ తండ్రికివ్వవచ్చాడు.

'వాడుగాదు మామయ్యకివ్వు' అన్నాడు రమణారావు రాజును చూపిస్తూ. శ్యాం కొత్తమామయ్యను చూచి సిగ్గుపడి ఓర చూపులు చూస్తూ అట్లాగే నిలబడి పోయినాడు. రాజేశ్వరరావు శ్యాంను దగ్గరకు తీసుకొని ముద్దాడుతూ 'బాబూ! నీ పేరేమిటిరా?' అన్నాడు వక్కపొడిని నోట్లో వేసుకుంటూ. 'శ్యాము' అన్నాడు బాబు.

'మీ నాన్న పేరో?'


'రమణారావు.'

మీ అమ్మపేరు?

'లతి.'

నాలతి ఏమిటి బాగా చెప్పు? అన్నాడు రాజు. మాలతి అని చెప్పుబాబు అన్నాడు రమణారావు.

'ఇదేమిట్రా! మామయ్య కూతురు జానకి కాబోలునే?' అన్నాడు రాజు ఏదో స్ఫురణకు వచ్చినట్లై.



'అవును' అంటూనే రమణారావు కూర్చున్నావేమిరా అట్లా! పద, నువ్వు లేచి ముఖం కడుక్కొని డ్రెస్ చేసుకో. కాసేపట్లా అట్లా షికారు వెళ్ళివద్దామన్నాడు. రాజు వెంటనే లేచి ముఖం కడుక్కొని తలదువ్వుకొని దుస్తులు వేసుకొని షికారుకు సిద్ధమైనాడు. ఇంతలో రమణారావుగూడా డ్రెస్ చేసుకున్నాడు. అమ్మను తలుపు వేసుకోమని చెప్పు అని బాబును లోపలికి పంపించి తలుపు దగ్గరకులాగి రమణారావు రాజుతోగూడా షికారుకు బయలుదేరాడు. త్రోవలో ఎక్కువ మాట్లాడుకోకుండానే స్టేషన్ సమీపంగా రైలుకట్ట ప్రక్కనున్న తెల్లని యినుకతిప్పల వద్దకు చేరుకున్నారు మిత్రులిద్దరు. సూర్యుడు పశ్చిమాంబుధిలో క్రుంకబోతూ సంధ్యారుణ కాంతులతో లోకానికి వింతశోభ కలిగిస్తూ ఉన్నాడు. దక్షిణ దిశనుండి వచ్చే చల్లని పిల్ల తెమ్మెరలు దేహానికి, మనస్సుకు గూడా హాయిని ఇస్తూ ఉన్నవి. రమణీయమైన ఆ సంధ్యాసమయంలో మూడుసంవత్సరాలకు పిమ్మట కలుసుకున్న ఆ మిత్రు లుభయులు పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. మాలతిపేరు విన్నప్పటి నుంచి జానకిని పెండ్లెందుకు చేసుకోలేదో అని ఆలోచనలో ఉన్న రాజు "అయితే నీవు మా మామయ్య కూతుర్ని పెండ్లి చేసుకోలేదా ఏమిట్రా! ఆ అమ్మాయి పేరు జానకి గాదో యునే' అన్నాడు మళ్ళీ.

'చేసుకోలేదు' అన్నాడు రమణారావు సిగ్గుతో విచారంతో తలవంచుకొని.

'పాపము మీ మామయ్య నిన్ను చిన్నప్పటినుంచి తనవద్దనే ఉంచుకొని చదువు చెప్పించాడుగా.'

'అవును ఆయన ఉన్నన్నాళ్ళు ఆయన సొమ్ము బాగానే తిన్నాము.'

'అయితే మీ మామయ్య?' అని సంకోచంతో చూచాడు.

'మా మామయ్య పోయి నాలుగేండ్లయింది'.

'పాపము కొమార్తె వివాహం చేయకుండానే?'

'ఆ! అకస్మాత్తుగా పోయినాడు.'

'మరి జానకి వివాహం ఇప్పుడైందా.'

'అయింది.'

'మంచి సంబంధమేనా?'

'ఏ సంబంధమయితేనేం. అంతా పోయిందిగా.'

'అయిపోవడమేమిటిరా రమణా! నీ మాటలన్నీ ఆశ్చర్యంగా ఉన్నాయి.'

'అవును. ఆయనిప్పుడు లేడు'.

'అయ్యో యెంత చక్కని పిల్ల! ఎంత అణకువున్నది! ఎంత మంచిది! నీవు వివాహం



చేసుకున్నట్లయితే ఇంత కష్టం సంభవించక పొయ్యేదేమో! నీవు జానకిని చాలా అన్యాయం చేశావు. మీ మామయ్య నిన్ను పెంచిన పెంచడానికి నీకు చేసిన ఉపకారానికి నీవు జానకిని కాదనవలసింది గాదు.'

'ఒరే! పాశ్చాత్యదేశాల్లో మూడు ఏళ్ళు ఉన్నందుకు అక్కడి నడవళ్లు నేర్చుకొని మన కుటుంబ వ్యవస్థ, మన ఆచారాలు మర్యాదలు మరచిపోయినట్లున్నావు.'

'నేను జానకిని కాదనలేదు. కావలెనని పోరాడి పోరాడి విఫలుడనైనాను.' అంటూ ఉండగా రమణారావు కంఠము దుఃఖంతో గాద్గదికమైంది. కళ్ళ నీళ్లు జొట జొటా కారాయి.

రాజు అతని దుఃఖం చూచి తెల్లబోయాడు. అయ్యో నిష్కారణంగా రమణ మనస్సు నొప్పించానే అని బాధపడ్డాడు. కాని జానకి వివాహం విషయం పూర్తిగా తెలుసుకోవలెననే వాంఛనుమాత్రం వదలలేక పోయినాడు. 'నీవు పోరాడిగూడా జానకిని పెండ్లాడలేకపోయినావా? అవునులే మనదేశంలో వరకట్న దురాచార మొకటి కన్నెలపాలిటి ప్రబల శత్రువై బాధిస్తున్నది గా. కట్నము లేకుండా మీ తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు కాబోలు.'

'మా అమ్మ దేమీలేదు.'

మీ నాన్నగారే పట్టుపట్టారన్నమాట.'

'పట్టేమిటి గావు పట్టు. మా మామయ్య పోయిన తరువాత వాళ్ళ కాపురం బాగా చితికిపోయింది. అప్పుల వాళ్ళు ఎగబడి ఉన్నది మన్నది కట్టుకు పోయినారు. ఇల్లు గడవడమే కష్టమైపోయింది. జానకి పెళ్ళెలా జరుగుతుంది. వారి పరిస్థితి యిట్లా ఉంటే. అటు నేను ఎం.బి.బి.యస్ చదువుతున్నాననీ, కొంచెమో గొప్పో ఆస్తిపాస్తి కలవాళ్ళమనీ నాకు సంబంధాల రావంధాళీ యెక్కువైంది. రోజురోజుకూ నాకిస్తామంటున్న కట్నం అయిదు వేలు, పదివేలు, పదిహేను వేలు, యావదాస్తీ అంటూ వేలం పాటలాగా పెరిగిపోవడం మొదలుపెట్టింది. మా నాన్న ఈ ద్రవ్యవ్యామోహంలో బాగా పడ్డాడు. ఈ కట్నం ఎంత యెక్కువ పుచ్చుకుంటే అంత గొప్ప వాళ్ళమనీ అనుకున్నాడు. మనం ఎంత గొప్పవాళ్ళం కాకపోతే మన కింత రొక్కమిస్తామంటున్నారన్న గర్వం కూడా కలిగింది. ఏంజెప్పను మా కొంప సంతబజారై పోయింది. నేను సంతకోడెనైనాను. వాళ్ళ తస్సాదియ్యా ఆ ఆడపిల్లల తండ్రులు మా నాన్న చుట్టూ తిరిగి ఆశ పుట్టించడమే కాకుండా రైలుచార్జీలు పెట్టుకొని విశాఖపట్నందాకా వచ్చి హాస్టలువద్దనో, కాలేజిగేటువద్దనో కాపలావేసి కూర్చుండే వాళ్లు. నా దగున నదాకా పెండ్లి చేసుకోననో, నాకు పరీక్షలు జరుగుచున్నాయి చూడటానికీ మాట్లాడటానికీ వీలుగాదనో ఏవో సాకులు చెప్పి ఎందరినో వెళ్ళగొట్టా. ఏంచేస్తేనేం తుదకు రిటైర్డు డి. యస్. పి. ఒకడు వచ్చి జిడ్డులాగా పట్టుకున్నాడు. ఒక్కతే కూతురుట. వరకట్నం ముందు ఇరవై వేలిస్తాడుట తరువాత యావదాస్తి నాదేనుట. ఈ యెర వేశాడన్నాడు, రమణ.

'పోలీసు సూపరెండెంటు చేసి బాగా దోచాడు కాబోలు' అన్నాడు రాజు నవ్వుతూ.

'ఆ డి. యస్. పని మూసే నాకళ్ళు తిరిగి పోయినాయ్. ఇక ఆ కొమార్తె ఎట్లా ఉన్నదో! ఇక ఆయన నన్ను చూచినతక్షణమే మా నాన్న వద్దకు వెళ్లి పెళ్ళి ఖరారుచేసుకొని మా నాన్న చేత ఉత్తరం వ్రాయించాడు. మా నాన్న ఈ పెండ్లి నిశ్చయవార్త తెలుపుతూ పెండ్లి పదిరోజులున్నది. నీకు ఈరోజున నే అయిదువందలు టి. యమ్. ఓ. పంపుతున్నాను. దానితో నీకు కావలసిన సూట్లు ఉంగరం వాచి వగైరాలు కొనుక్కోమని వ్రాశాడు. దానితోపాటు జానకికి వాళ్ళ ఊళ్ళోనే పెండ్లి నిశ్చయమైనదనీ, పెండ్లి మూడురోజులున్నదనీ ఎవరో రెండో పెండ్లివాడికిస్తున్నారనీ గూడా వ్రాశాడు. ఆ ఉత్తరం చూచి

నేనెంత వేదనపొందానో, ఎంత దుఃఖించానో ఆ పరమాత్మునికెఱుక. జానకి! చిన్నతనం నుంచి నాదే అనుకున్న జానకి! నన్ను చేసుకొనే తాహతులేక ఏ ముసలిముండాకొడుకునో చేసుకొని అఘోరిస్తుంటే నేను పోలీసు సూపరెండెంటు కొమారైను చేసుకొని సుఖపడమా. ఆ మాటతలుచుకుంటే కాళ్ల క్రింద కంపపెట్టినట్లయింది. గుండెల్లో మంట పెట్టినట్లయింది. ఎంతసేపో కుమిలి కుమిలి ఏడ్చా. ఏమిటి కర్తవ్యమని ఆరోజల్లా కాలేజీకి పోకుండా కూర్చొని ఆలోచించా. సమయానికి డబ్బుకూడా చేతికందింది. ఎందుకైనా మంచిదని ఆ డబ్బు తీసుకున్నా. ఏమయినా సరే మానాన్న నన్ను ఏమిచేసినా సరే తక్షణం బయలుదేరివెళ్లి ఆ సుముహూర్తవేళకు నేనే జానకిని పెండ్లాడుదామనే వెఱ్ఱి నిశ్చయానికి వచ్చా. పెండ్లి ఎక్కడో తెలియదు. ఎప్పుడో తెలియదు. తక్షణమే స్టేషనుకు వచ్చి బాపట్లకు టిక్కట్టు కొనుక్కొని మేలెక్కి కూర్చున్నా. మెయిల్ శరవేగంతో బయలుదేరి పోతున్నది. ఎన్నో స్టేషన్లు వస్తున్నాయి పోతున్నాయి. రాత్రి భోజనంవేళయింది. అన్నం నీళ్లు ఆగమనికేలేదు. బెజవాడలో ఓఅరగంట రెస్టుతీసుకుని మెయిల్ ట్రైన్ మళ్లీ పరుగు సాగించింది. తెనాలి వచ్చింది. ఎవరో ఒకాయన నా పెట్టెలో కెక్కాడు. కొంతసేపయిన తరువాత ఆయన "అబ్బాయి యెక్కడికెళ్ళుతున్నా"వన్నాడు. బాపట్లండీ అన్నా. బాపట్లలో ఎవరింటికన్నాడు. గోపాలకృష్ణమూర్తిగారి యింటికన్నాను. ఆయనిప్పుడు లేరుగా అన్నాడు. లేరు అన్నాను. రాత్రి వాళ్ళమ్మాయి పెళ్లయిందిగా, పెళ్లయినతరువాత ఇప్పుడు వెళ్ళుతున్నావేమిటి, పెళ్లికేనా అన్నాడు. నేను నిలువున నీరైపోయినా. కాసేపుదాకా నోట మాట రాలా. కాసేపు ఆగి మీకు సరిగా తెలుసునా అండీ పెళ్ళయినమాట నిజమేనా అన్నా. 'అయ్యో తెలియకేమయ్యా! వట్టి పీనాశి ముండాకొడుకు. ఉండటానికి బోలెడున్నది కాని కడుపునిండా అన్నము, ఒంటినిండా బట్ట యెఱుగడు. ఇటువంటివాడిని చేసుకోడానికి ఆఅమ్మాయి ఎట్లా ఒప్పుకున్నదో అని ఊరందఱు ఒక్కటే ఆశ్చర్య పోతున్నారు. అయినా ఏమిజేస్తుంది. తండ్రిపోయినాడు. ఇంచిమంచి చూచే దిక్కులేదు. పెళ్లయ్యేదారి లేదు. మేనత్తకొడుక్కు చేసుకోమన్నారట ఏమి చేస్తుంది. ఈ బ్రహ్మానందం పాలపడ్డది. పదేళ్ళయింది ఈయన పెళ్లాం పోయి. వంటచేసిపెట్టే ముసలమ్మ చచ్చిపోతే కాచిపోసే దిక్కులేక ఈ పెళ్ళికి తలపడ్డాడుట. అన్నాడాయన. అప్పటి నాస్థితి చెప్పలేను. ఆ ఒక్కొక్కమాట వింటూ ఉంటే ఎవరో కూనీచేయడానికి బల్లెంతో పొడుస్తున్నారా అనిపించింది. ఇంతకు జానకి

కన్యాశ్రమం

దురదృష్టవంతురాలు. అటు తండ్రిని ఒప్పించి పెండ్లాడలేకపోయినాను. ఇటు దొంగచాటుగా పెండ్లాడవలెనని సాహసించీ కృతార్థుడనుకాలేకపోయినాను. ఇక అక్కడదాకా పోవడమెందుకు. త్రోవలో ఏ స్టేషనులోనైనా రైలుదిగి వెనక్కు వెళ్లి పోదామనుకున్నాను. కాని చిన్నస్టేషన్లలో మెయిలు ఆగదుగనుక విధి లేక బాపట్లపోకతప్పలేదు. స్టేషనులో రైలు దిగానన్నమాటే గాని ఊళ్ళోకి పోవడానికి బుద్ధిపుట్టలేదు. కనుక మద్రాసునుండి కలకత్తా మెయిలు వచ్చేవఱకు స్టేషనులోనే ఉండి తిరిగి వైజాగ్ వచ్చేశా అన్నాడు, రామణారావు పుట్టెడు దుఃఖంతో కళ్ళు తుడుచుకుంటూ—రాజుకు గూడా కళ్ళ నీళ్లు వచ్చాయి, ఆ గాథ వింటే.

సరే ఏమి చేద్దాము, నీ ప్రయత్నం నీవు చేశావు. దైవం అనుకూలించకపోతే ఏమి చేస్తావు. అయితే ఆ డి. యస్. పి సంబంధం ఏమయింది.! ఈ మాలతి వాళ్లమ్మాయా ఏమిటన్నాడు రాజు.

ఛీ నీవింత తెలివితక్కువ వాడ వనుకోలేదు రాజూ అన్నాడు రమణారావు.

'నాకేదో అయోమయంగా ఉన్నదిరా బాబూ నీగాథ' అన్నాడు రాజు.

'వైజాగ్ వచ్చానే కాని కాలేజీకి పోవడానికి బుద్ధి పుట్టలేదు. కాఫీ నీళ్ళయినా త్రాగాలనిపించలేదు. జానకికి చేసిన అపచారానికి. పరిహారంగా ఏమిచేయను?అని ఆలోచిస్తూ రూములో పడుకున్నా. మనస్సు పరిపరివిధాల పోయింది. ప్రాణత్యాగం చేయవలెనని గూడా బుద్ధిపుట్టింది. ఛీ ఇది గాదు మార్గమనుకొని సాయంత్రానికి ఒక నిశ్చయానికి వచ్చి నా క్లాసుమేటూ, స్నేహితుడూ అయిన సూర్యారావు యింటికెళ్లా. సూర్యారావు చాలా మంచివాడు. అతనికి తెలివితేటలున్నంతగా సిరిసంపదలు లేవు. మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. అతని చెల్లెలు మాలతి. స్కాలరుషిప్పులతోనే బియ్యేదాకా చదివి ఫస్టున ప్యాసైంది. ఆమెకు పెండ్లి చేసే శక్తి లేక తలిదండ్రులు అల్లాడిపోతున్నారు. వాళ్ళ యింటికి వెళ్ళి సూర్యం మీ చెల్లెలిని పెండ్లాడవలెనని ఉన్నది. ఆవలెల్లుండి పెండ్లి. తంతేమీ లేదు రిజిష్టరు మ్యారేజీ జరగాలె. మీ తలిదండ్రులకు మీ చెల్లెలికి సమ్మతమేమో కనుక్కొని వచ్చి చెప్పు అని చెప్పి నా రూముకు వచ్చేశా. చదువుండి, చక్కదనముండి, సంప్రదాయముండి యోగ్యత ఉండి యీ వరకట్న దురాచారానికి బలైపోతున్న ఒక్క అభాగ్యకన్నెనైనా ఉద్ధరించి నా జీవితాన్ని సార్థకం చేసుకోవాలెననే పట్టుదలతో ఇట్లా చేయడానికి సాహసించా. మరునా ఉదయమే వచ్చి సూర్యారావు మా వాళ్ళు అంగీకరించారోయి అని చెప్పాడు. అనుకున్న ప్రకారం రిజిష్ట్రారువారి సమక్షంలో ఉభయపక్షాల సాక్షుల చేవ్రాలుతో మా వివాహం జరిగిపోయింది. వివాహం కాగానే, నా వివాహం జరిగిపోయింది. మీ పెండ్లి ప్రయత్నాలు విరమించుకోండని మా నాన్నకు, డి. యస్. పి గారికి చెరో తంతి గొట్టాను. జానకికి గల్గిన ఆశాభంగానికి ఈ విధంగా పరిహారం చెల్లించి, ఒకవిధంగా తృప్తి పొందానే కాని ఆ ఆఘాతం అప్పటికి ఇప్పటికి మానని గాయంగానే ఉండి హృదయవేదన కలిగిస్తూనే ఉన్నదన్నాడు రమణారావు.

'మఱి మీ నాన్నగారికి నీ పెండ్లివార్త చాలా ఆగ్రహాన్ని, అవమానాన్ని కలిగించి ఉండాలనే. దానికెట్లా తట్టుకున్నావు' అన్నాడు రాజు.

ఆఁ! చాలా ఆగ్రహమే కలిగించింది. ఇక నీ ముఖం చూడననీ, నా ఆస్తిలో ఒక్క పూరి పుడక నీకు చెందనీయననీ, చాలా కటువుగా నానా తిట్లూ తిట్టుతూ ఉత్తరం వ్రాశాడు. కాని యీ పరిస్థితి అనుకున్నదే గనుక ఏమీ అనుకోలేదు. కాని ఒక్కదానికి విచారించా. మా అమ్మ అమాయకురాలు. మహాసాధ్వి. నా పెండ్లి మాట విని మా నాన్న చేసిన ధూముధాములకు మా అమ్మ ఎంత బాధపడి ఎంత క్షోభిల్లిపోయిందో అని చాలా బాధపడ్డాను. ఏమయినా ఎంత కష్టమైనా జానకికి గల్గిన హృదయక్షోభకంటె, దుఃఖంకంటె ఎక్కువై ఉండదుగా అని ఊరడిల్లానన్నాడు రమణారావు.

నిజమే. ఇక మీ నాన్నగారు డబ్బు పంపి ఉండరుగదా, పాపము ఫైనలియరెట్లాలాగేశా

బైరాగి: (మనిషి పుర్రె పట్టుకొని సింహాళము నుండి రావణాసురుని పుర్రె తీసుకొచ్చితినని రోడ్డుమీద పోయేవారికి చూపించుచుండెను.)

కొంటెకుర్రవాడు: రావణాసురుని బుర్ర చాలా పెద్దది అంటారే ఇదేం ఇంత చిన్నదిగా ఉంది.

బైరాగి: ఇది రావణాసురుని చిన్నతనములోనిది.

—ధనేశ్ (జయపురం)

పురా! ఇంతకటకట వస్తే నాకైనా ఉత్తరం వ్రాశావు గాదేమన్నాడు రాజు.

ఆ సప్తసముద్రాల అవతలఉన్న నిన్ను గూడా ఏమి వేధించను? దానికి నీవంటి మిత్రుడొకడు తోడ్పడ్డాడు. దానికి తోడుగా మాలతి తన కాలేజీలోనే ట్యూటర్ గా చేరి కొంత సర్దుబాటు చేసింది. అన్నాడు రమణారావు.

అయితే మీ అబ్బాయిని మీ అమ్మగారు మీ నాన్నగారు ఇంతవరకు చూడలేదన్న మాట. అయితే శ్యాం నీవు పోయి మీ తాతగారిని బామ్మగారిని చేయిపట్టుకొని లాక్కురారా అని చెప్పుతా ఉండు అన్నాడు రాజు.

నీవు చెప్పినదాక ఆగలేదు. ఆ పనీ జరిగిపోయిందన్నాడు రమణారావు కొద్దిగా నవ్వుతూ.

అదెప్పుడు? అన్నాడు రాజు ఆశ్చర్యంగా.

నా వివాహ వార్త విని మా నాన్న కోపంతో మండిపడుతూ నానా తిట్లు తిట్టుతూ ఉత్తరాలు వ్రాసినా నేనవేవీ పట్టించుకోకుండా ఎప్పటికప్పుడు మా క్షేమసమాచారాలు తెలుపుతూ విడవకుండా ఉత్తరాలు వ్రాస్తునే ఉన్నా. మనుమడు పుట్టడం వాని శైశవ క్రీడలు, వాడి రూపురేఖలు, వాడి ముద్దులు మురిపాలు తెలుపుతునే ఉన్నా. మా నాన్న కొన్నాళ్లు నా ఉత్తరాలు చూడకుండానే బల్లమీద పారేశాగుట. తరువాత తరువాత తిన్నగా చదవడం ప్రారంభించారుట. మనుమడి ముచ్చట్లు విని మురుసకోడం మొదలుపెట్టారుట. ఇంతిలో పూర్తి పరివర్తనకు ఒక సంఘటన కారణమైంది. జానకి పెనిమిటి ఆమెకు కూడుగుడ్డ యివ్వకుండా అష్టకష్టాలు పెట్టి పుట్టింటికి పంపివేశాడనీ వాళ్లు ఉన్న ఫూళ్ళో బ్రతకలేక హైద్రాబాదు చేరారని ఆయన చెవినిపడ్డది. ఇది ఆయన కెంతో మనస్తాప కారణమైంది. నేనెట్లాగూ కట్నం తీసుకొని పెండ్లి చేసుకోలేదు. ఇందులకు మారుగా తాను సహృదయంతో జానకినే కోడలుగా చేసుకున్నట్లయితే ఆమె కిన్ని కష్టాలు వచ్చేవికావుగా అని ఆయన మనసులో వేదన ప్రారంభమైంది. అదే కొరకగా, దగుగా, ఇంకా ఏవేవో బాధలుగా తయారైనాయి. మనిషి బాగా నీరసించి మంచమెక్కడం సంభవించింది. ఒకనాడు మా నాన్నకు జబ్బు ఎక్కువజేస్తే మా నాన్నకు చెప్పకుండానే మా తమ్ముడు నాకు వైర్ ఇచ్చాడు. ఆ టెలిగ్రాం చూచుకొని నేను తక్షణం సకుటుంబంగా గుంటూరు వచ్చాను. మా నాన్న ఎదుట పడటమంటె నాగుండెలు దడదడకొట్టుకోడం మొదలుపెట్టాయి. మా నాన్నగారు ఏమైనా కోపపడినా నీవు ఓర్పు వహించాలెనని మాలతితో ముందుగానే చెప్పి ఉంచా. నాకు తెలియదండీ అన్నది. మాలతి మేము వస్తామని యిచ్చిన టెలిగ్రాం చూచుకొని మా తమ్ముడు రైలువద్దకు వచ్చాడు. అందరం రిక్షాలు చేసుకొని యింటికి వచ్చాము. మా నాన్నకు ఉపచర్యలు చేస్తూ మా అమ్మ మా నాన్న మంచమువద్దనే ఉన్నది. మా నాన్న బాగా కృషించి పాలిపోయి కళాహీనమైన ముఖంతో కళ్ళు మూసుకొని మంచంమీద పడుకొని ఉన్నారు. మా తమ్ముడు మాకంటె ముందుగా రిక్షా దిగి శ్యాంను చంకపెట్టుకొని మా నాన్న వద్దకు వెళ్ళి నాన్నా! 'అన్నయ్య వచ్చాడు. ఇదుగో అన్నయ్య కొడుకు'ని పిల్లవాడిని చూపించాడు. పిల్లవాడు తాతగారి మీదికి దూకపోతున్నాడు. ఇంతలో నేను మాలతి వెళ్ళి మా నాన్నగారికి నమస్కరించాము. మా నాన్న ఏమీ మాట్లాడకుండా చూచి చూడనట్టుగా ఫూరుకొని మనుమణి ఆప్యాయంగా చూస్తూ ఉండిపోయినారు. పిమ్మట మా అమ్మకు గూడా నమస్కరించాము. మా అమ్మ మమ్మలను చూచి కళ్ళనీళ్లు పెట్టుకోడం మొదలుపెట్టింది. 'ఎందుకమ్మా ఏడ్వడం. నాన్నగారికి నయమవుతుంది. ఆయనకు పెద్ద జబ్బేమీ లేద'న్నాను. అదేమి చిత్రమో మేము వెళ్ళిన మరుక్షణంనుంచి మా నాన్న జబ్బు తిరుగుముఖం పట్టింది. క్రమంగా మాతో మాట్లాడటం మొదలుపెట్టాగు. పొద్దస్తమానం బాబును తన పక్కలోనే కూర్చోపెట్టుకొని వానితో కాలక్షేపం చేయడం సాగించారు.

నేనుగూడ మా నాన్నగారికి అవసరమైన మందులు యింజెక్షన్లూ క్రమంగా డాక్టరుతో చెప్పి యిప్పిస్తూ పథ్యపానాదులు జాగ్రత్తగా చూస్తూ వారివద్దనే ఉంటూవచ్చాను. మాలతి గూడా పనిపాటలలో అత్తగారికి తోడ్పడ్డంలోను, మామగారికి కావలసిన ఉపచారాలు చేయడంలోను శ్రద్ధాభక్తులతో మెలగి అత్తమామల మనస్సు చూరగొన్నది. వారం రోజులున్నాము. మా యిద్దరికి సెలవు



చిత్రకారుడు - జక్కంశెట్టి నరసింహారావు పడపతి మంగళం)

కన్యాశ్రమం

లైపోయినాయి. జబ్బు కొంచెం ఉపశమించి మా నాన్న మంచంమీద లేచి కూర్చోడం మొదలుపెట్టారు. మేము వెళ్లుతామంటే ఆయన ఎంతో బాధపడ్డారు. ముఖ్యంగా మనుమణ్ణి వదలలేక ఆయన ఒకటే కళ్ళ నీళ్లు కార్చుకోడం చూస్తే జాలి వేసింది. మేము వచ్చేటప్పుడు కోడలికి చీరె రవికలు, మనుమడికి పట్టుచొక్కాలు యిచ్చి, పిల్లవాడికి మురుగులు, ఉంగరము, మొలత్రాడు చేయించమని ఆరు సవర్నుల బంగారం చేతిలో పెట్టి రైలుచార్జీలకు వేరే యాభై రూపాయలిచ్చి పంపలేక పంపలేక పంపించారు. నిజంగా మా నాన్నలో యింత దయ యింత ప్రేమ ఉన్నదని నేను కలలోనైనా ఊహించలేదన్నాడు రమణారావు.

'తలిదండ్రులకు కాకపోతే ఎవరి కుంటుందిరా ప్రేమ! అది అవిచ్ఛిన్నమైన అమృతధార. అది ఒకప్పుడు సన్నగిలినట్టు యింకిపోయినట్టు అనిపిస్తుందేగాని అది అంతర్వాహినిగా అవుతుందేగాని నశించదు. వారి ప్రేమే లేకపోతే మనంమనగలమా' అన్నాడు రాజు.

నిజమేరా. అప్పటినుండి మా రాకపోకలు యథాప్రకారంగా నడుస్తున్నాయి. మొన్న మా శ్యాం పుట్టినరోజుకు మా అమ్మా నాన్నా వచ్చి పదిరోజులుండి పోయినారు. 'ఇక్కడ ఉండిపొండని నేను, మాలతి బలవంతంచేశాం గాని అవసరమైనపనులున్నవని వెళ్లారు' అన్నాడు రమణారావు. 'అదృష్టవంతుడివిరా రమణా! ఇష్టమైన పెండ్లి చేసుకున్నావు. నాన్నగారి అనుగ్రహము సంపాదించావన్నాడు రాజు.

'అంతా భగవంతుని దయ' అన్నాడు రమణారావు.

'అన్నీ బాగానే ఉన్నాయి. పాపం జానకి పనే అన్యాయమైపోయింది' అన్నాడు రాజు.

"అవును. ఇంతటి సంతోషంలోను నా హృదయాన్ని కాల్చివేస్తున్నదదే" అన్నాడు రమణారావు బాధతో.

"మరి నీవిక్కడెందుకున్నావు. జానకి సహాయార్థమేనా?"

"అంతే లేకపోతే నాకీ ఊళ్లో పనేమున్నది? జానకి కాపురం మూన్నాళ్ళ ముచ్చటైంది. ఎవరో స్నేహితురాలి సహాయంతో హైద్రాబాదులో ఒక చెట్టిగారి పిల్లలకు ట్యూషన్ చెప్పితే వాళ్లు నెలకు నూరురూపాయలిచ్చి ఉండటానికి ఇల్లిచ్చి ఎన్నో విధాల కనిపెట్టి ఉండేవాళ్లట. అట్లాగైనా జీవించకుండా ఆయన, వెనుక ఉన్న శూలవ్యాధి ఏదో అకస్మాత్తుగా పైకి వచ్చి గంటలమీద

(53-వ పేజీ చూడండి)

మానవ దేహ స్థితి

పెదవులపై జీర్ణకోశ వ్యాధుల ప్రభావం

డాక్టర్ గాలి బాలసుందరరావు

జీర్ణకోశంలో మొదటిభాగం నోరు. నోటికి ముందు ప్రక్క మూతివల్ల బహిః ప్రపంచంతో సంబంధం ఏర్పడింది. వెనుకప్రక్క పారింక్సులో వెనుక భాగమైన యీసాఫెగస్ ద్వారా ప్రేగులతో సంబంధం ఉన్నది. ముందు వెనుక రెండు ద్వారములు ఉన్న ఒక చిన్న కర్మాగారంతో నోటిని పోల్చవచ్చును.

నోటియొక్క ముందు ద్వారం పెదవులు అనే రెండు శరీర భాగములతో మూయబడి ఉన్నది. ఈ రెండు పెదవులను రెండు తలుపులతో పోల్చవచ్చును. ఆరోగ్యస్థితిలో ఈ రెండు పెదవులు ఒకదానితో వొకటి హత్తుకుని ఉండి, గాలికూడా నోటిలోకి పోవడానికి వీలులేకుండా వుంటుంది. పెదవుల ఉపరిభాగం సాధారణ చర్మంతోను, లోపలి భాగం మ్యూకస్ మెంబ్రేనుతోను, మధ్య భాగము కండరములతోనూ యేర్పడి ఉంటుంది. ఈ కండరములు చిన్నవీ పెద్దవీ అయినప్పుడు పెదవుల ఆకారం మారుతూ ఉంటుంది. పురుషుల్లో పెదవులమీదదట్టంగా వెంట్రుకలు పెరుగుతవి. ఈ వెంట్రుకలను మీసం అంటారు. సాధారణంగా 16 వ సంవత్సరం ప్రాంతంలో నూనూగుగా ఆరంభించి 21 వ సంవత్సరంనాటికి యివి దట్టంగా నల్లగా పెరిగిపోతవి. మీసముల స్థితినిబట్టి వయస్సును ఊహించవచ్చును.

పెదవులలో ఒక శరీరశాస్త్ర విశేషం ఉన్నది. దేహోపరిభాగంలోఉండే చర్మము దేహాంతరాళములను కప్పివుండే మ్యూకస్ మెంబ్రేనుతో కలిసిపోయినచోట ప్రత్యేక ప్రవృద్ధికలిగి అధికతర స్పర్శానుభూతిని కలిగించగల కొన్ని నెర్వ్ సెల్సు విరివిగావుంటవి. ఇంగ్లీషులో చర్మానికి క్యూటేనియం అని పేరు. ఇల్లా చర్మానికీ-మ్యూకస్ మెంబ్రేనుకూ సంధి ఏర్పడ్డచోటును మ్యూకోక్యూటేనియస్ జంక్షన్ అంటారు. ఈ ప్రదేశములు శరీరంలో అతి ముఖ్యమైనవి. ఇటువంటి ప్రదేశములు ఇతరులలో యిటువంటి ప్రదేశములను స్పృశించినప్పుడు వ్యక్తికి ప్రత్యేక స్పర్శసుఖానందం కలుగుతుంది. ఈ సంధి ప్రదేశములవద్ద శరీరాంతరాళములు, బహిః ప్రపంచంతో సంబంధం కలిగివుంటవి. వీటినే మనవారు నవరంధ్రములు అన్నారు. మగవారిలో మాత్రమే యీ రంధ్రముల సంఖ్య తొమ్మిది. స్త్రీలలో మరొక మూడు రంధ్రము లుంటవి. ఈ సంధి ప్రదేశములు జాత్యజీవితంలో (Sex Life) చాలా ముఖ్యమైనవి. ఈసంధినిర్మాణ భేదములనుబట్టి అన్ని సంధులు ఇతరులలో సమాన ప్రదేశములను సంధించలేవు. ఆ సంయోగం కొన్నిచోట్ల మాత్రమే సాధ్యము. ఒకే జాతికి చెందిన వారిలోనే యీప్రదేశ సంయోగం ఆనందం కలిగిస్తుంది. వయస్కులైన స్త్రీపురుషులలో యీ సంధి ప్రదేశముల సంయోగం మహానందానికి హేతువౌతుంది. ఆ విషయం జాత్యవ్యాధులు (Sex disordrs) చర్చించినప్పుడు విపులంగా చర్చిస్తాను.

నీగ్రోవంటి కొరుగల్లని జాతులలో తప్ప పెదవుల మ్యూకస్ మెంబ్రేను ఎర్రగా వుంటుంది. మంచి చాయగలవారిలో ఈ సంధి రేఖ ధనురాకారం కలిగి ముఖానికి అందాన్నియిస్తుంది. ఈ సౌందర్యాన్ని కవులు విశేషంగా వర్ణిస్తారు. పెదవులు ఒకదానితో ఒకటి కలసి వుంటాన్ని బట్టి మానవ స్వభావాన్ని గ్రహించవచ్చును. జాతి ఆహార విధానములను అభ్యాసములనుబట్టి పెదవుల మందం ఆకృతీ ఏర్పడుతవి.

ఇక రోగస్థితిలో పెదవుల స్థితిలో చాలా మార్పులు వస్తవి. ఈ మార్పులు తెలుసుకోడం వైద్యంలో చాలా సహాయంచేస్తుంది. ఈ మార్పులు అందరికీ తెలిసివుండాలి. కొన్ని మార్పులు ఆసన్నమృత్యువు సూచించేవి. అటువంటి మార్పులు ఏర్పడ్డప్పుడు వెంటనే వైద్యసహాయం పొందవలసి వుంటుంది.

సాధారణంగా పెదవులు తడిగానూ మృదువుగానూ నున్నగానూ వుంటవి. పెదవులు పగలడం, ఎండడం, పెరడుకట్టి వుండడం ఆరోగ్యానికి లక్షణంకాదు. పైగా కొన్ని వ్యాధుల్లో యివి ప్రత్యేకార్థం కలిగి వుండవచ్చును. కడుపు, ప్రేగులు వ్యాధిగ్రస్తములైనప్పుడు పెదవులు పొడి ఆరిపోవచ్చును. కొన్ని మందులు తిన్నప్పుడు ఇలా కావచ్చును. ఇందులో బెల్లడోనా ఉన్న మందులు చాలా ముఖ్యమైనవి. మధుమేహం ముదిరిపోయినప్పుడు, దాహామూ మ్యూకస్ మెంబ్రేను పొడి ఆరిపోవడం జరగవచ్చును. అనేక కారణములవల్ల పెదవులు వాయవచ్చును ఆ వాపును కైలైటిస్ అంటారు. ఇది క్రిమిదోషంవల్లగాని, కొన్ని పడని వస్తువులు తినడంవల్లగాని ఏర్పడవచ్చును. ఇప్పుడు సాధారణంగా వైద్యంలో వాడుతున్న సల్ఫానిలమైడ్ మాత్రలు (సిబాజాల్ ఎల్కోసిన్ మొదలైనవి) శరీరానికి పడకపోతే మూతి వాచి పగిలిపోతుంది. అల్లాగే పురుగులు కుట్టినప్పుడు, శరీరానికి పడని వస్తువులు సేవించినప్పుడు, యూర్టికేరియా అనే వ్యాధి వచ్చినప్పుడు పెదవులు ముఖ్యంగా ఉబ్బిపోతవి. పొరపాటున మందనుకొని డెట్టాల్ లాంటి వస్తువులు త్రాగేవారున్నారు. ఆత్మహత్య చేసుకొనటానికి ద్రావకాలు త్రాగేవారున్నారు. అల్లా జరిగినప్పుడు పెదవులు కాలి వాచిపోతవి. అది వెంటనే గుర్తించడం ప్రాణరక్షణకు హేతువు కావచ్చును.

కొంతమందిలో చలికాలంలో పెదవుల చర్మము పగులుతుంది. ఇది రక్తస్రావంలో లోటువల్ల జరుగుతుంది. ఈ పగలడం లోతుగా జరిగినప్పుడు పుళ్లు ఏర్పడి బాధ కలుగుతుంది. అప్పుడు వెన్నపూస, నెయ్యి, ఆలివ్ ఆయిల్, గ్లిసరిన్ వంటి వస్తువులను రాచి పెదవులను మృదువుగా వుంచుకోవాలి. పుండయితే నోట్లోకిపోయినా ప్రమాదం లేని ఆయింటుమెంటు పట్టించాలి. కంటికి ఉపయోగించే యీ క్రోమైసిడ్ ఆయింటుమెంటు, బోరిక్ ఏసిడ్ కలిపిన గ్లిసరిన్ చాలా ఉపయోగకరములైనవి. ఇవి యింట్లో వుంటం చాలా అవసరం.

కొన్ని విషజ్వరాల్లో పెదవులు అతి శీఘ్రంగా ఎండి, పెరడు కట్టి, మ్యూకస్ మెంబ్రేను పై పొరలు నశించి పెచ్చుఊడిపోతుంది. ఈ స్థితిని 'సార్డిస్' అంటారు. నోటి పరిశుభ్రత విషయంలో శ్రద్ధతీసుకోనందున సాధారణంగా యీ స్థితి ఏర్పడుతుంది. రోగిస్మృతిలో వుంటే నాలుకతోనే తన పెదవులను శుభ్రంచేసుకొంటాడు. సాధారణంగా స్మారకం లేనప్పుడే యీ స్థితి యేర్పడుతుంది. ఏమయినా సార్డిస్ ప్రమాదాన్ని సూచించే లక్షణం. సాధారణంగా


టైఫాయిడ్, న్యూమోనియా మెనింజైటిస్ వంటి విషజ్వరాల్లో యిది విధిగా ఏర్పడుతుంది. కొన్ని జ్వరాల్లో ఇది గంటల్లో ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితిలో "ఆ! మామూలు జ్వరమేలే, ఉపవాసం చేయిస్తే అదేపోతుంది" అనుకోడం మృత్యువుని ఆహ్వానించడం. ఇంట్లో వారు దీనిని గుర్తించి వెంటనే వైద్యసహాయం పొందాలి.

మంచి ఛాయవున్న వారిలో పెదవులరంగు చాలా ముఖ్యమైనది. పాటలాధరం — ఎర్రని పెదవి రక్త పుష్కలత్వాన్ని సూచిస్తుంది. అది కవుల కవితావేశానికి ఎంత అవసరమో ఆరోగ్యానికీ అంతే అవసరం. పాలిపోయిన పెదవులు రక్తక్షీణతను సూచిస్తవి. ఆ రక్తక్షీణతకు చాలా కారణాలు వుండవచ్చు కాని యిది ప్రతివారూ గుర్తించగలిగిన చిహ్నం. ఇది గుర్తించినందున తరవాత పాండురోగం వంటి ప్రమాదాలు రాకుండా, రక్తం ఎక్కిస్తే

మనమూ మనదేహస్థితి

గాని ప్రాణాలు నిలవని స్థితిరాకుండా జాగ్రత్తపడవచ్చును. ప్రసవించే స్త్రీలో యీ పెదవుల పరీక్ష చాలా అవసరం. రక్తస్రావం బయటికి రాకుండా యుటెరస్‌లోనే జరిగిపోతున్నప్పుడు పెదవి రంగుమారిపోతుంది. అది త్వరగా గమనించడం ప్రాణాన్ని రక్షించడానికి కారణమౌతుంది. ఇలాగే పెదవులలో నీలచ్ఛాయలు ఏర్పడడం మృత్యువు సమీపించడాన్ని తెలియజేస్తవి. ఈ నీలచ్ఛాయలు అతి త్వరగా ఏర్పడవచ్చు. క్రమంగానూ ఏర్పడవచ్చు. క్షయ, బ్రాంకైటిస్, బ్రాంకయెక్టసిస్ వంటి శ్వాసకోశ వ్యాధుల్లో యీ నీలచ్ఛాయలు క్రమంగా యేర్పడవచ్చు. తగినంత ఆక్సిజన్ ధాతువులకు అందక యీ స్థితి యేర్పడుతుంది. అలాగే ప్రమాదం జరిగినప్పుడు షాక్ తిన్నప్పుడు శ్వాసకోశం స్తంభించి ఏర్పడుతుంది. విషజ్వరములలో హృదయం క్షీణించి పని చేయనప్పుడు ఏర్పడుతుంది. అప్పుడు అతిత్వరితంగా చికిత్స చేయకపోతే ప్రాణాపాయం సంభవిస్తుంది. గుండె జబ్బు వున్న వారిలో చరమావస్థలో పెదవులు నల్లబడిపోతవి. ఒకరకమైన లేత నీలివర్ణం బహుకాలంగా వున్న మలబద్ధకానికీ, ప్రేగులవ్యాధికీ చిహ్నం కావచ్చు.

ఇక పెదవులమీద పుళ్లుపడడం చాలముఖ్యమైనది. ఏ కారణంచేతనైనా చర్మంలో గానీ మ్యూకస్ మెంబ్రేనులో గాని గండి పడ్డప్పుడు ఆస్థితిని 'అల్సర్' అంటారు. అల్సర్ ఏర్పడటాన్ని అల్సరేషన్ అంటారు. అల్సర్లు చాలా రకములు. గట్టిగా గుండ్రంగా వుండి, అట్టే బాధ కలిగించని అల్సరు, సిఫిలిస్ అనే వ్యాధిలో కలుగుతుంది. సిఫిలిస్ మ్యూకస్ మెంబ్రే



"నాకు టిక్కెట్టు లేదండి. నన్ను బయటికి పంపడానికి కొంచెం సహాయపడరూ"
చిత్రకారుడు—ఎగ్గోని శ్యామసుందర్ (గుత్తి)

మును త్వరగా వ్యాధిగ్రస్తం చేస్తుంది. నోటి లోపల తెల్లని ప్రదేశాలు ఏర్పడి అందులో నుంచి సిఫిలిస్ క్రిములు విరివిగా ఉమ్మినీరు లో బయటికి వస్తూవుంటవి. ముద్దు పెట్టుకున్నప్పుడు ఆ క్రిములు శరీరంలో ప్రవేశించి యీ అల్సర్ కలిగించవచ్చును. కాని యీ మధ్య వచ్చిన పెన్సిలిన్, ఆక్రోమైసిన్ టెర్రమైసిన్ వంటి ఔషధములవల్ల సిఫిలిస్ కనిపించకుండా పోయింది. 'ఒకప్పుడీవిధమైనఅల్సరు వ్యభిచార వృత్తితో జీవించేవారిలో తరుచు కనిపిస్తూఉండేది. గట్టిగా గుండీలాగా వుండి నొక్కితే బాధ కలిగించే అల్సరు అంకురిస్తున్న కేన్సరు. మ్యూకస్ మెంబ్రేను ఉన్న చోటవచ్చే విషధాతువృద్ధికి కేన్సరుఅంటారు. శరీరంలో ఏధాతువైనావిపరీతంగా,ఒకేచోట వృద్ధి చెందడం నియోప్లాజం అంటారు. ఆ వృద్ధి శీఘ్రంగా ఇతర అవయవములలోకి చొచ్చుకుపోయి, ఆ వృద్ధినుంచి జీవాణువులు రక్తంద్వారా ఇతర అంగములలో ప్రవేశించి ఆవ్యాధిని అక్కడా ఏర్పరుస్తున్నప్పుడు ఆ వ్యాధి 'మేలిగ్నంటు' వ్యాధి అంటారు. తక్కినవి సాధారణ గ్రంథులు తెలుగులో కణుతులు అంటారు. ఒకొక్క ధాతువులలో ఏర్పడ్డ మేలిగ్నంటు స్థితికి ఒక్కొక్క పేరు ఉంది. కండల్లో ఏర్పడితే సార్కోమా శ్లేష్మికల్లో ఏర్పడితే ఆగ్జియోమా మ్యూకస్ మెంబ్రేనులో ఏర్పడితే, కేన్సరు లేక కార్సినోమా అంటారు. పెదవుల మీదనో, నోటిలోనో పుండు ఏర్పడగానే స్వల్పచిత్సలతో అది నయం కానప్పుడు కేన్సరును అనుమానించి వైద్యసహాయం వెంటనే పొందడం ప్రాణరక్షణకు హేతువౌతుంది.

కేన్సరు కాకపోయినా కేన్సరులాగే చికిత్సకు అందని పెదవులవ్యాధి ఒకటి వున్నది. అది కేక్రమ్ఓరిస్ (Caciommoris) అది పెదవులకొనలలో ఏర్పడుతుంది. ఆప్రదేశంలో మ్యూకస్ మెంబ్రేను చచ్చిపోయి క్రిమిదోషం పొంది ఈఅల్సరు ఏర్పడుతుంది. ఇది ఒకప్పుడు దుర్నివారంగానే వుండేది. మంచి ఆహారంలేక, దీర్ఘవ్యాధులతోనూ ఆరోగ్యం చెడి దేహం దుర్బలంగా వున్నప్పుడు ఇది ఏర్పడుతుంది. ఇది గృహవైద్యంతో పోయేదికాదు. కాని పెన్సిలిన్, ఆక్రోమైసిన్ వంటి ఔషధములు, విటమినులు వచ్చేక యీ వ్యాధి తరచు కనిపించడంలేదు.

ఇక సాధారణంగా నంజుపురుపులు అని మనం అనుకునే అల్సర్లు వున్నవి. వీటికి కారణం చాలా స్వల్పం కావచ్చు. చాలాప్రమాదకరం కావచ్చు. ఇందుకు ముఖ్య కారణం మలబద్ధకం. సున్నం వంటి ఘాటయిన పదార్థం అతి వగరుగా వుండే మామిడిసొన, వక్కలాంటి వస్తువులు కాకి యీ అల్సర్లు ఏర్పడవచ్చును. కాని యీ మధ్య నోటిపూత చాలా తరుచుగా చాలామందిలో వస్తున్నది. ఇందుకు కారణం ఆహారంలో విటమిన్ బికాంప్లెక్సు, అందులోను ముఖ్యంగా రిబోఫ్లేవిన్, నికోటెనిక్ ఏసిడ్ ఫాలిక్ ఏసిడ్ అనే భాగములు లోపించినందున యీ స్థితి ఏర్పడుతుంది. ఈ అల్సర్లు పెదవులమీదనే కాదు, నోటిలో ప్రేగుల్లో కూడా ఏర్పడుతవి. ముందివి వస్తూపోతూ వుంటవి. తరవాత పోవు. పైగా దోమువిరేచనములుఆరంభిస్తవి. కొవ్వు పదార్థములు అరగక ఆహారించబడక శరీరంలో కొవ్వు క్షీణించి శరీరం శుష్కించి ముసలిరూపం ఏర్పడుతుంది. ఈ స్థితిని స్ప్రూ అంటారు (Sprue) ఇది చాలా భయంకరవ్యాధి. క్షయకంటే భయంకరమైంది. తరుచు నంజు పురుపులు లేస్తున్నయ్యంటే యీ వ్యాధి అంకురించిందన్నమాటే. వెంటనే మేలుకోకపోతే జీవితమే నరకమైపోతుంది. వెంటనే వైద్యసహాయం పొందడం ఎంత అవసరమో, ఆహారం విషయంలో శ్రద్ధ వహించడం అంతే అవసరం, రంగున్న కాయకూరలు—పొట్లకాయలు పచ్చని వంకాయలు, అతి ముఖ్యంగా బీట్‌రూట్, కేరట్, పుష్కలంగా తినాలి. ఇవి విరివిగా ఉపయోగించే వారికి యీ వ్యాధి రాదు. ఈ వ్యాధిని గురించి ప్రేగులవ్యాధులు చర్చించేటప్పుడు పూర్తిగా మళ్లీ చర్చిస్తాను. ప్రజల అజ్ఞానం, అంతకన్నా అజ్ఞానంతో కూడుకున్న ప్రభుత్వ వ్యవసాయిక విధానం వల్ల రంగున్న కూరగాయలు సాధారణప్రజకు నగరవాసులకు చౌకగానూ విరివిగానూ లభించక యీ వ్యాధి విపరీతంగా వ్యాపించిపోతున్నది.

వ్యాధిగానే కాక జన్మలోపంగా "కుందేలు పెదవి"శిశువుల్లో ఏర్పడుతుంది.మూడవ మాసంలోగా యీలోటు పూర్తిగా సవరించవచ్చు.

పెదవులు నోటిలోకి అనవసరపదార్థములు పోకుండా కాపాడే కవాటములు. ఆనందం కలిగించే, అవయవ విశేషాలు. ఆహారం తీసుకోడంలో సహాకరించే అంగభాగములు. మాటలను ఉచ్చరించడంలోనూ, భ భ ౦ భ ము లలవంటి శబ్దములను ఉత్పత్తి చేయడంలోనూ, వాటి రూపం మార్చి అనేక భంగిమములు చూపి నటనా వైదుష్యం ప్రదర్శించడంలోనూ, సహాకరించే అవయవములు. సౌందర్యానికి నిధానాలు. పెదవులు కదలకపోవడం, వాటి ఆకృతి మారిపోవడం వ్యాధికి ప్రథమ లక్షణములు. ★



తెలుగు వెలుగులు 58

తలా తోకా చటుక్కున పోల్చుకుందుకు వీల్లేనివాటిలో నిత్యశంకితుని భావాలూ, నూలుపోగూ, వానపామూ, రెండు జడల పిల్లా, కొత్త కార్లూ వగైరా చరాచర పదార్థాలతోపాటు చెప్పుకోతగ్గ మరో జడపదార్థం తెలుగు సినిమా కథ అంటారు. అలాగే మిథ్యావాదాన్ని బలపరిచే ఉదాహరణలలో ప్రబంధ నాయికల నడుమూ, ఎన్నికల వాగ్దానాలలో నిజాయితీ, అవకాశవాది నిశ్చితాభిప్రాయం, తెలుగు సినీమాలో కథ చెప్పుకోతగ్గవంటారు.

ఇటువంటి తెలుగు సినిమా కథను వెనకేసుకొచ్చి నిలబెట్టగలవారిలో, ఇదీ కథేను అని కథగా చెప్పగల గొప్పగలవారిలో శ్రీ వెంపటి సదాశివబ్రహ్మం ముఖ్యులు. తెలుగు సినిమా చిన్నతనం రోజులలో (అవే గొప్పతనం రోజులూను) ప్రవేశించి నేటివరకూ, 'ఇదిగో సినిమా కొక కథ చెబుతా విను' అని చెప్పి, 'కథా రచయితగా' (చాలామంది మాటల పాటల రచయితలే) నిలబడి నెగ్గుకొస్తున్న ఒకేఒక్క వ్యక్తి ఈయనే. కాలంనాడు హిందీలోనూ బెంగాలీలోనూ సినిమాకి గురిఅయి చనిపోయిన కథల్ని తవ్వితీసి బ్రతికించి తెలుగు ప్రాణం పోస్తాడని విమర్శించే గిట్టనివాళ్ళు ఉన్నా నేటి సినిమాల కథల విలువ తెలిసినవారూ, ఆయన వాగ్ధాటిని ఎరిగినవారూ సగౌరవంగా 'కథాశివ బ్రహ్మం' అంటారు.

సదాశివ బ్రహ్మంగారు ఒక రకంగా ఆశుకవి. ఒకేఒక కథావస్తువు దొరకబుచ్చుకుని ఒకరోజు పొద్దుటనుంచి సాయంకాలంలోపల పదేనమండుగురు నిర్మాతలకు నలభయ్యేడు కథలు—చెప్పింది చెప్పకుండా చెప్పగలడు. గుడ్లు తిప్పుకుంటూ, పొడుగుపాటి సిగరెట్లు పీల్చేస్తూ చేతు లెగరేస్తూ 'విశాపట్నం' యాసలో 'ఆయనలాఘ కథ లల్లీసుకుపోతూ, వాటిలో సన్నివేశాలు కళ్ళకట్టేలా', ఉద్వేగంతో ఉత్సాహంతో చెప్పుకుపోతూ ఉంటే నిర్మాతలు దర్శకులు కూడా ముగ్ధులైపోయి వింటూ ఉండిపోతారు. అంతా విన్నాక వారు ఆ విన్నదేమిటో చెప్పుకోలేరన్నది వేరు విషయం. ఇంద్రజాలికుడు సదాశివబ్రహ్మం చెప్పినపుడు కళ్లకట్టినట్లు అద్భుతంగా కనిపించిన సన్నివేశాలు తీరా తెరకెక్కాక తలా తోకా తెలియకుండా తయారైతే అది ఆయన తప్పు కాదు. అసూర్యంపశ్యలలో అతిలోక సౌందర్యవతు లున్నారని ఒప్పుకుంటే ప్రేక్షకులదాకా సాగిరాని ప్రతిభగలవారిలో (కథకీ తెరకీ మధ్య లక్ష గండాలు) సదాశివ బ్రహ్మం ఘనుడనే చెప్పుకోవాలి. పద్యంలో ఆశుకవిత ఘనమైతే గద్యంలో జీవితంమీద అనర్గళంగా ఆశువు చెప్పగలగడం ఈయన ప్రజ్ఞ (పద్యాలుకూడా బాగా చెప్పగలడు). ఎటొచ్చీ ఆశుకవులు ఒక యాసలో వర్ణనకే తిరగా మరగవేసి రకరకాలుగా చెప్పినట్టు ఈ 'ఆశుకథకుడు' కూడా ఒకే కథను ఒక్క పూటలో ఇరవై నాలుగు మోస్తర్లలో అల్లుకుపోతాడు. మధ్యలో అతుకులూ, టంకాలూ, పాత్రలూ, తీరులూ సర్వంగాకుదరకపోయినా, అప్పుడు తెలియవు. తెలిసేసరికి కాలాతీతం అయిపోతుంది. అందుకే సినిమాలైన ఆయనకథలు కొన్నిటిలో ఏనుగుతల పాముకీ, చీమతల ఏనుక్కీ, దానితోక పిచిక్కీ ఉన్నట్టు కనబడతాయి.

ఇరవయ్యేళ్ళ సినీ జీవితంలో సదాశివ బ్రహ్మంగారి కథలతో సినిమాలై కండపుష్టితో రూపొంది బ్రహ్మాండమైన విజయం సాధించిన చిత్రాలలో ఘరానా దొంగ, సంసారం, చరణదాసి, భలేరాముడు, సువర్ణసుందరి, ఇంటిగుట్టూ, ఇల్లరికం, అన్నపూర్ణ మొదలైనవెన్నో ఉన్నాయి. వీటిలో కొన్నిటికాయన మాటలు పాటలు కూడా వ్రాశాడు. ఇవేకాక ఆ మధ్య నటనలోను దర్శకత్వంలోను కూడా చేతిగాచేయి కాల్చుకుని మళ్ళీ తన 'కథాస్థలానికి' వెళ్ళిపోయొచ్చాడు. ఇప్పటికీ చిన్ననటులతో కొత్తవాళ్ళతో అద్భుతమైన చిత్రంతీసి స్టార్ వాల్యూ అనేది అపోహ అని నిరూపించాలని, దర్శకుడుగా మంచికథలు చిత్రించాలనీ ఆయనకు చాలా మోజుఉంది.

హెచ్. ఎం. రెడ్డిగారి 'తెనాలి రామకృష్ణ'నుంచి నేటివరకు సినిమాకథలతో కలిసి అడుగులు వేస్తున్నవాడు కాబట్టి, తన అనుభవం, పలుకుబడి ఉపయోగించి కథకు కొత్తదారులు పట్టించడం బాధ్యతగా స్వీకరించగల హక్కు అధికారం ఈయనకు ఉన్నవి. ప్రేక్షకుల తరఫున నిర్మాతలకు మంచికథలను, కొత్తవాటిని సిఫార్సు చేసి ఒప్పించగల సామర్థ్యమూ ఉంది. మంచివాడన్న మంచిపేరూ ఉంది. వీటన్నిటినీ మంచిలక్ష్యాలు సాధించడానికి ప్రయోగించి సాధించిననాడు ఆయనకు తెలుగుసినిమాకథ కథలో కథాశివబ్రహ్మం అన్న పేరు స్థిరపడితీరుతుంది. ★

విచ్చిపోయిన మబ్బు

హరిబాబు

శ్రవంతం వెళ్ళిపోతుంది

వస్తోంది మరో గంటలో - ప్రతి గంటకు ఒక లెక్క—.

ముకుందరావు నడుస్తున్నాడు.

వీధి దీపాల వెలుగు తన మీద పడకుండ నీడలలోనే నడుస్తున్నాడు. అయినా వెలుగుకొంత మీద పడక తప్పటంలేదు. ఒక దీపం తన వెలుగును కొంత పరిధిలోనే వ్యాప్తం చేస్తున్నది. మరో దీపం చేరేలోపున చీకటి.

జీవితంలా వెలుగుచీకట్లు- చీకటి వెలుగులు

ఇల్లు చేరకూడదనుకొని ఎక్కడెక్కడో తిరిగినా అప్రయత్నంగా ఇంటివైపే నడిచాడు. ఇంటి గుమ్మంలో అడుగుపెట్టి తలుపుతట్టకుండా అలానే కొంతసేపు నిలబడ్డాడు.

గుమ్మంముందు అలికిడి విని తలుపు తెరచింది-ముకుందరావు అలానే నిలబడి చూస్తున్నాడు శకుంతలవైపు.

నీడలో అతని ముఖకవళికలు గుర్తించలేదు-"అదేమిటి అలానేనిలబడిపోయారేం?"-అని అడ్డు తొలగింది.

ఇంటిదీపపు వెలుగు అతనిమీద ఒక్కసారిగ ప్రసరించింది. వెలుగు భరించలేనట్లు ముఖం ప్రక్కకు తిప్పుకొని లోపలికి నడిచాడు.

కుర్చీలో మాట మంతిలేకుండ కూర్చున్న ముకుందరావు దగ్గరగా వచ్చి-"అలా ఉన్నారేం!"-అంది.

శకుంతలదృష్టి తప్పించుకొని "అబ్బే! బాగానే ఉన్నా"-అని లేని హుషారుతో గబగబా షర్టువిప్పి భార్య చేతిలో పెట్టాడు.

"వేన్నీళ్ళున్నాయి - స్నానం చేయరూ!" -అన్నది.

"ఓ-" అన్నాడు. తన బాధ ఆమెకు తెలియకూడదు.

స్నానానికని వెళ్లిన తానేమి చేస్తున్నాడో తెలియక ముఖం, కాళ్ళూ చేతులూ కడుక్కొని తిరిగి వచ్చేశాడు.

శకుంతల కిదేం అర్థం కానట్లు చూస్తూ "స్నానంచేస్తానన్నారు"- అన్నది.

రాని చిర్నవ్వును ముఖంపైకి తెచ్చుకొని - "చెయ్య బుద్ధికాలేదు" అన్నాడు.

'వడ్డించనా'-అనడిగింది.

'ఊఁ-' అన్నాడు.

ప్రక్కనకూర్చొని వడ్డిస్తున్నది శకుంతల. అతనెంత పరధ్యానంగా ఉన్నాడో అప్పుడే గ్రహించింది. రోజూ ఇంటికి రాగానే మొదటి ప్రశ్న - శేఖరు ఏడి-అనికొడుకు గూర్చి. ఇవాళ అసలా ప్రసక్తే



లేలేదు. అయినా తాను గుర్తించినట్లు బహిర్గతం కాలేదు.

చేతితో పూర్తిగా చేయితడవనిదే తినని వాడు పచ్చడి కలుపుకొని నెయ్యి అడగకుండానే తినివేస్తున్నాడు-శకుంతల ఏమీ మాట్లాడకుండా నెయ్యి వేసింది.

"మజ్జిగ"-అన్నాడు.

"చారు కలపండి" అంది.

చారన్నం తిని చెయ్యి కంచంలోనే కడిగివేశాడు.

"మజ్జిగ వేసుకోలేదు, చెయ్యి కడిగేశారు"-అంటూ ప్రక్కనున్న మట్టు గిన్నెలో అన్నంవేసి మజ్జిగపోసింది.

శకుంతల ముఖంలోకి చూశాడు. ఆమె నిండు నవ్వులో దైన్యం రేఖగా స్ఫురించింది. ఆమె తనను తరచి తరచి చూస్తున్నట్లు భావించాడు. ఏదో జాలిపడుతుంది. బాధపడుతుంది అనుకొని-ఒక్కసారి అంతా నటన అనుకొంటూ-'ఆకలిలేదు' అని లేచిపోయాడు.

ఆమె అలానే కంచంవైపు, గిన్నెలవైపూ చూస్తూ కూర్చుండిపోయింది.

భోజనం చేసిందో లేదో అన్నట్లు-ముకుందరావు పట్టెమంచపు కోడుపట్టెకు దిండు వేసుకొని ఆనుకొనేలోపునే వచ్చింది. చేతిలో పళ్లెంనిండా ఆకులు, వక్కపొడి కున్న పొడిసీసాలున్నాయి.

భర్తప్రక్కనే తానూ కూర్చుని వక్కపొడిసీసా అందించింది-ముకుందరావు ముక్తసరిగా 'వద్దు' అన్నాడు. అసలామాట వినిపించుకోనట్లు వక్కపొడి చేతిలో వేసుకొని-'నోరు తెరవండి'—అన్నది.

వక్కపొడి నోట్లో ఎలావేసిందో అలాగే ఆకులకు సున్నం రాసి నోటికందించింది. తానూ రెండు ఆకులు నోట వేసుకొని పళ్లెం అవతల బల్లమీద పెట్టి భర్త దగ్గరగా జరిగింది.

శకుంతల ముఖంలోకి ఎలానో చూశాడు. ఆమె నిండుగా నవ్వింది. ఎర్రని పెదాలు తనని వెక్కిరిస్తున్నట్లుగా తోచింది. భరించలేని తన చూపులు దించివేశాడు.

భర్త భుజంపై చేతులేసి తనవైపు కొద్దిగా లాక్కొని "ఏమండీ! మీరెందుకో బాధపడుతున్నట్లున్నారు. నాకు చెప్పకూడదా"—అన్నది.

ముకుందరావులో కలుషం కప్పుకొని, నిద్రాణమై ఉన్న అనుమానం, భయం, బాధ ఒక్కసారి రెచ్చగొట్టబడినట్లు విజృంభించాయి. అతనిలోని ప్రతి అణువణువును కదల్చివేశాయి.

ఒక్కసారిగా శకుంతలను తనకెదురుగా తీసుకున్నాడు. సూటిగా కళ్లలోకి చూస్తూ-"శకూ! నేనే ప్రశ్న వేసినా సమాధానం చెబుతావా?" అనడిగాడు కంపిత కంఠస్వరంతో

విచ్చిపోయిన మబ్బు

శకుంతల నివ్వెరబోయింది. తనని గూర్చి నా ఈ ఆలోచనంతా. తనను ఇలా ఎందుకు శంకించాడో అర్థంగాక దీనంగా "ఎప్పుడైనా-మీకు అబద్ధం చెబుతానండీ" అన్నది.

"చెప్పలేవు శకూ—చెప్పలేవు. ఏ ఆడదీ తన భర్త నేవేసే ప్రశ్న వేస్తే సమాధానం నిజంగా చెప్పదు. చెప్పినా-అది అబద్ధం" అన్నాడు దిగజారి పోతున్నట్లు.

శకుంతల అతని గుండెలపైన తల పెట్టుకుని రుద్ధకంఠంతో—"నన్ను మీరు నమ్మరా—నేను మీకు అబద్ధం చెబుతానని ఎందుకనుకుంటారు" అన్నది.

తన ఎదపై ప్రాలిన శకుంతల కణతలకు చెంపలాన్చి ముకుందరావు మెల్లగా "శకూ!

> ఉపాధ్యాయుడు : ఒరేయి కృష్ణా, రామునెందుకుకొట్టావ్?
>
> కృష్ణా : వాడు నన్ను తిట్టాడండి.
>
> ఉపా : నువ్వు తిట్టక పోయావా?
>
> కృష్ణా : వాడికి పుట్టెడు చెముడండి!
>
> — రాజరావు (పిల్లుట్ల)

నేనంటే నీకిష్టమేనా! నీకు నామీద గౌరవముందా!" అనడగాడు.

శకుంతల అలానే భర్తవంక చూస్తూ—"నన్నెందుకిలా అడుగుతారు?-మీరు నేనేం లోటు చేశాను? ఎప్పుడైనా మిమ్మల్ని నేను చిన్నమాటైనా అన్నానా" అంటూనే సన్నటి ఏడుపుజీరస్వరంలో కలిపింది.

ఆమె చెంపలని రెండు చేతుల్లోకి తీసుకొని "ఏడవకు శకూ- ఏడవకు. నువ్వేడుస్తుంటే నేనసలడగదలచింది అడగలేను" అన్నాడు.

శకుంతల ఏడుపు దిగమ్రింగింది. ఇటుపై తనమీద పడే ప్రశ్న ఏదాన్నట్లు చూస్తూ భర్తకు హామీగా అతడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని గాద్గదికంగా-"దైవసాక్షిగా నాకు తెలిసినవి తెలిసినట్లే చెబుతాను—మీవద్ద ఏదీ దాచను" అన్నది.

తిరిగి ఉద్రిక్తుడైపోయాడు ముకుందరావు. భార్య భుజాలు పట్టుకొని ముఖంలోకి చూస్తూ—"నువ్వు నిజం చెబుతావా దైవసాక్షిగా—శకూ" అంటూ ఆమె మెడలోని హారాల మధ్య ఉన్న మంగళసూత్రం ఆమె చేతిలోపెట్టి—తన చేతులతో బంధించిపెట్టి—"దీని సాక్షిగా నిజం చెప్పు శకూ—ఏ స్త్రీకూడ తన తాళి తెగాలనుకోదు. దీనిమీద ఒట్టువేసి చెప్పు నిజం" అన్నాడు.

శకుంతల వణికిపోయింది. అలానే—"దీని సాక్షిగా నిజం చెబుతాను" అన్నది.

"శకూ! ప్రశ్న వేసేముందు నేనెందుకీ ప్రశ్న వేస్తున్నానో—ఎందుకు వేయాల్సి వచ్చిందో చెబుతాను. నువ్వు కాదనలేవు. నేనేవీ కల్పించి చెప్పడంలేదు. చూశాను" అన్నాడు.

ఏం చెబుతాడోనని శకుంతల ఉచ్ఛ్వాస నిశ్వాసలకు స్వల్ప అవరోధాలు కల్పిస్తూ అతడి ముఖంలోకి చూస్తున్నది. ముకుందరావుతనమనోభావాలలో తులకుదిగిపోయాడు. అతని కంఠ మొక మాస్టరు గంభీర ధ్వనిగా మ్రోగింది-

"శకూ! నేను రెండవ పెండ్లి చేసుకోవడం తప్పని చేసుకొనేప్పు డనుకోలేదు. నిన్ను చేసుకోవడం నాకోసం కన్న శేఖరుడి కోసం చేసుకున్నాను—వాడికి తల్లిలా నేను పరిచర్య చేయలేనేమోనని. వాడి అదృష్టం—వాడిని కన్నతల్లి కన్నా ఎక్కువగా చూసుకొనే నువ్వు దొరికావు. నేనే స్వార్థంతో నిన్ను చేసుకున్నానో అది నెరవేరింది-కాని నీకు అన్యాయం చేస్తున్నాననుకోలేదు. నేను వట్టి అల్పుడినని, నిర్భాగ్యుడినని పెండ్లికి పూర్వమే నువ్వు గ్రహించి ఉండాలి. కాకపోతే....—"అని ఆగాడు.

శకుంతల రుద్ధకంఠంతో "ఎందుకలా అంటారు-మీరు..."—అని ఇంకా ఏదో చెప్పబోయింది.

ముకుందరావు ఆమెను చెప్పనివ్వలేదు.

"శకూ—నా మాటకు అడ్డురాకు. నేనొక్కటిగిని చెప్పలేక పోతున్నాను.—లేదు చెబుతాను విను.. నీకు జ్ఞాపకం రావచ్చు. నిన్నింకా కాపురానికి తీసుకురాలేదు. నేను రెండవ పెండ్లివాడినైనా ముసలివాడిని మాత్రం కాను. నీ వెక్కడున్నా నా మన సక్కడే ఉండేది. నీదగ్గరకు వచ్చిఉండాలని-నా మనసు కొట్టుకులాడిపోయేది."

ఒక్కక్షణం ఆగాడు.

"ఖమ్మంమెట్టు వరంగల్లులో నువ్వు మీ అక్క మామలదగ్గర ఉన్నావని విని దిగాను. నువ్వక్కడున్నావని తెలీనట్లు మీ మామతో మాట్లాడాను వాళ్ల ఆఫీసుకెళ్లి. ఏదో ఆఫీసు పనిమీద వచ్చానన్నాను. నువ్వూ అక్కడే ఉన్నావని చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు. నా కన్న నీ మామ చిన్నవాడు. నీకు మామే గాక అక్కమగడు గనుక చనువు హెచ్చు. అందుకే వాళ్లింటి కెళ్లావనుకున్నాను."

"నన్ను ఇంటికి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు. నేను కూర్చొనిఉన్న పడకకుర్చీ ఎదురుగా గోడకిపైన వెంకటేశ్వరస్వామి పటం ఉన్నది. నా వెనుకగదిలో నువ్వు మంచంమీద కూర్చొనిఉన్నావు. నేననుకోలేదు నువ్వు. నీ మామ ఆ గదిలోకి వచ్చాడు.

నాకు ఆ గదిలో ఏం జరిగినా కనబడ దను కున్నాడు. నేనక్కడ కూర్చొని ఉన్నా నన్న జ్ఞానంకూడ లేకుండా - నీ దగ్గరకువచ్చి గుచ్చిఎత్తి కౌగిలించుకున్నాడు. నువ్వు అతడికి ప్రతిగా చుట్టుకుపోయావు. నేను న వ్వా న ని గట్టిగా నాకు వినబడేటట్లు చెప్పాడు. నువ్వతడిని విదల్చుకొని భయంగా బయటకొచ్చావు. నేను-లోపల దహించుకు పోతున్నా - నేను తిరిగి చిన్న నవ్వు నవ్వాను. నువ్వు స్థిమితపడ్డావు - నేను కనుగొనలేదని. జ్ఞాపకం వచ్చిందా శకూ!"—అంటూ శకుం తల ముఖంలోకి చూశాడు.

శకుంతల కళ్లు విప్పార్చి దిగ్భ్రమచెంది అలా చూస్తూ కళ్లవెంట నీరు కారుస్తున్నది.

"అబద్ధమా అని అడగడంలేదు శకూ— నిజం. నేను చూశాను. అది నిజం. అందుకే —అరోజే నావెంట నిన్ను మీ ఊరు తీసు కెళ్లి కాపురానికి పంపమని అక్కడనుండి మరునాడే ఇక్కడకు తీసుకొచ్చాను. నువ్వు చాల బాధపడ్డావు అలా అందర్నీ వదలి రావ టానికి. తరువాతనైనా నీ మామను మరచి పోతావనుకున్నాను."

"గోవిందరాజోత్సవాని కెళ్లినప్పుడు నీ మామా వచ్చాడు మీ ఊరు. నీకెంతో సంబ్ర మయింది. నేను నీకు వచ్చికోవా ఇష్టమని ఉత్సవంనుండి తెచ్చాను. నా ఎదుట తిన లేదు. నేనటు వెళ్ళగానే సగం నీ మామ నోట పెట్టావు. నేను బయటకువెళ్తూ కిటికీ గుండా చూశాను. అబద్ధమంటావా శకూ!- కాదు. నేను చూశాను. అంతే ఆనాటినుండి ఈనాటివరకు నిన్ను మీ ఇంటికి పంపలేదు. సంవత్సరమైందని గిజగిజ లాడినా పంప లేదు."

"ఈవాడు తప్పదు. ఇవాళ కాకపోయినా తొమ్మిదోనెలనైనా పంపాల్సిందే— తప్పదు. కాని నిన్ను పంపుతుంటే నీ మామకు ఎరగా పంపుతున్నట్లుంది నాకు. అందుకే మొన్న నీ మామవచ్చి తాను వెంట పెట్టుకెళ్తానంటే చాల మొరటుగా పంపను పొమ్మన్నాను. రేపు ప్రొద్దుట నువ్వు వెళ్లి పోతావు"—అని శకుంతల చేతుల్ని వదలి ఆమె భుజాలచుట్టూ చేయివేసి—"శకూ! ఇవి నిజం—అబద్ధం అని చెప్పమనడంలేదు. ఒక్క విషయం నీ మాంగళ్యం సాక్షిగా చెప్పు. ఇకపై నీ మామతో అలా సంచరిం చవు కదూ—అను శకూ!—నా ఆత్మతృప్తి కన్నా—నా ఆత్మశాంతికోసం అను..." అన్నాడు దీనంగా ఉద్రేకంగా—

ఇప్పటివరకు రాపడి కూర్చున్న శకుంతల ఒక్కసారి గట్టిగా ఏడుస్తూ భర్త పాదాలపై పడింది. మంగళసూత్రం చేతిలో ఉంచుకొని అలానే ఏడుస్తూ "నన్ను క్షమించండి— నేనెప్పుడూ ఇక అలా చెయ్యను. ప్రమాణం చేసి చెబుతున్నాను. నా పసుపు కుంకుమల సాక్షిగా నేనలా చెయ్యను. అలా ప్రవర్తిం చను"—అంటూ ఆయాసంతో స్పృహతప్పి పోయింది.

ప్రొద్దుట శకుంతలను బండికి పంపె ఎ ళి యింది.

కేశవుడు అమ్మతో వెళ్తానని తండ్రి చేయి పట్టుకొని లాగుతూ మారాము చేస్తున్నాడు. రిక్షాలో సామానులు పెట్టించి నడవలో నిల బడ్డాడు కొడుకు గారవాన్నంత పట్టించుకో కుండా.

శకుంతల దగ్గరగావచ్చి దీనంగా భీతితో చూసింది. వంగి పాదాలనంటి కండ్ల నద్దు కొంది. శకుంతలను లేవదీశాడు.

"శకూ!-సుఖంగా వెళ్ళిరా" అన్నాడు.

ఆ మాటలు తేలికగా పలకలేదు. నాభి నుండి వచ్చినట్లున్నాయి. భర్తను చూసింది. కన్నీళ్లు చెక్కిళ్లపైకి దొర్లాయి.

"ఛ!-అదేమిటి. వెళ్లు - నిన్న రాత్రే నా మనసులోని చెడుగునంతా కడిగి వేసు కున్నా. వచ్చేటప్పుడు పండంటిపిల్ల నెత్తు కురా"—అన్నాడు.

ఒక్కక్షణముండి బొంగురుపోయిన కంఠం తో- "కేశవుడిని నాతో పంపకూడదూ-" అన్నది.

శకుంతలను గట్టిగా పట్టుకొనున్న కేశవుడి తల నిమురుతూ "వద్దు- వీడిని ఉండనీ, చదువు చెడటమే గాక నువ్వూ వీడులేకుండా నేనొంటరిగా ఉండలేను"- అన్నాడు.

ముకుందరావు బయటికెళ్లాడు. శకుం తల ఒకసారి ఇంటినంతా కలయజూచి బయ టకు వచ్చేసింది కేశవుడితో.

రైలు కదలిన తరువాత కేశవుడిని పట్టు కోవడం కష్టమైంది. వెళ్తున్న రైలునుండి శకుంతల కేశవుడి ఏడుపుచూసి తను దుఃఖా న్నాపుకోలేక చెంగు నోట కుక్కుకుంది.

పెద్దపెట్టున ఏడుస్తున్న కొడుకుని తీసు కొని ఇంటికొచ్చాడు. ఇల్లంతా బోసిపోయి నట్లనిపించింది. కేశవుడిని ఒడిలో పెట్టు కొని అలానే మధ్యాహ్నం వరకు కూర్చుండి పోయాడు.

శకుంతల వెళ్తూ ఆనాటికి వంట చేసి పెట్టి వెళ్లింది. కొడుక్కి వెళ్లేముందు తన చేతుల్తో తినిపించాలని వేళ కాకపోయినా తినిపిం చింది. వాడూ అన్నం పెట్టమని అడగలేదు. తనకు ఆకలి కాలేదు.

ఏడ్చిఏడ్చి నిద్రపోయిన కేశవుడు లేచి తిరిగి ఏడవసాగాడు. వాడిని భయపెట్టి బ్రతిమాలి ఊరుకోబెట్టాడు. ఆకలంటే, ఇప్పుడు అన్న మేమిటని హోటల్‌కు తీసుకెళ్లాడు.

రాత్రి భోజనం పెట్టినప్పుడు కేశవుడితో బాధ పడలేకపోయాడు.

కేశవుడి కన్నతల్లి చనిపోయేప్పటికి వాడికి నాలేళ్లు. జబ్బుతో తీసుకు చనిపోయింది కాబట్టి తాతగారింట్లో పెరిగాడు. కాని ఎంతకాలం చూస్తారు. ఒక ఏడు దాటగానే పెళ్ళిచేసుకోమన్నారు ముకుందరావును.

తనకోసం కాదు కేశవుడి కోసమనుకొని చేసుకున్నాడు. కన్నతల్లివద్ద కరవైన ప్రేమ శకుంతల దగ్గర లభించింది. తన కడుపునకల్గిన బిడ్డడిని చూసుకున్నట్లు చూసుకొంటుంది. అందుకే శకుంతలను వదలి ఉండలేడు కేశవుడు. కేశవుడిని చూసుకోలేదు ముకుందరావు.

విచ్చిపోయిన మబ్బు

రాత్రి మూడు పొర్లు మంచినీళ్ళకని లేచాడు. వీపు గోకమని—గాలిలేదు విసరమని వేధించాడు. విసుక్కుంటే తల్లికోసం తిరిగి ఎక్కడ ఏడుస్తాడోనని భయం.

ప్రొద్దుట లేచేసరికి ఏడయింది.

వాడితో ముఖం కడిగించటం ఒక ప్రళయమయింది. పళ్లు తోమమంటాడు. వాడిచే తోముకోమంటాడు ముకుందరావు. ఎలా తోముకోవాలో చూపాడు. కేశవుడు వ్రేలితో పొడి తీసుకొని పళ్లపై పూత పూస్తుంటే

విసుగ్గా తనే తోమాడు. కేశవుడు ఒక్కటే ఏడుపు గోరు బుగలో గుచ్చుకుందని. రక్తం వస్తుంటే వాడిని సముదాయించలేక బాధపడ్డాడు.

ప్రొద్దుటే కాఫీ తాగించి పదింటికల్లా హోటల్ నుండి భోజనంతెచ్చి కేశవుడికి తినిపించి తాను తిని ఆఫీసుకి బయలుదేరాడు. వాడి బడికీ, తన ఆఫీసుకీ ఆలస్యమయింది.

సాయంత్రం వచ్చేసరికి వీధి అరుగుమీద కూర్చొని ఏడుస్తున్నాడు కేశవుడు. తండ్రిని చూసి ఇంకా ఎక్కువ చేసాడు—ఆకలేస్తుందని ఏడుపు. ముకుందరావు బాధపడ్డాడు. ప్రొద్దుటనగా తిన్నాడు. మధ్యాహ్నం తినలా ఏదైనా కొనుక్కు తినటానికి డబ్బులు ఇవ్వలేదు. ఆ సంగతే ఆలోచించలేదు. కండ్లలో నీళ్లు తిరిగాయి.

రోజూ ఇలానే కేశవుడితో తానను భవించే సాధక బాధకాలు విచిత్రంగా కనబడ్డాయి. ఒకో రోజు శకుంతల వీడితో ఎలా వేగిందిరా అనుకొనేవాడు.

సుఖంగా చేరినట్లు వచ్చిన ఉత్తరం తరువాత రెండుసెలలవరకు ఉత్తరాలు లేవు. ఒకరోజు కార్డు - ఆడపిల్ల పుట్టిందనీ తల్లీ పిల్లలు కులాసా అని వచ్చింది. శకుంతల మామ వ్రాసాడు.

కేశవుడికి - చెల్లెలు పుట్టిందని చెప్పాడు. వాడెంతో ఆనందపడ్డాడు. చెల్లి ఎలా గుంటుందనీ, ఎంత ఉంటుందనీ తాను ఎత్తుకో వచ్చా అని మాటిమాటికి ప్రశ్నలతో వేధించాడు. ఆఖరుకు "చెల్లెల్ని చూడటానికి పోదాం—నాన్నా" అంటూ మారాము చేశాడు.

ఈ తరంలో ఒకసారి రమ్మనికూడ లేదు. ముకుందరావుకు వెళ్ళాలనే ఉంది. తనకు పిలుపులేదు. పైగా ఆ ఉత్తరం వాళ్ళమామ వ్రాశాడు.

కేశవుడి అల్లరెక్కువయింది. అమ్మను చెల్లెను వెంటనే చూడాలంటాడు. ఏడుస్తూ కూర్చుంటాడు. తీసుకు వెళ్దామంటే వాళ్ళ దగ్గరనుండి బారసాలకైన రమ్మని ఉత్తరం లేదు. ఇక భరించలేక సెలాఖరుకు ఉత్తరం వ్రాసాడు ముకుందరావు — కేశవుడు అమ్మ అమ్మ అని కలవరిస్తున్నాడనీ, వీలైనంత త్వరలో రమ్మని—.

ఉత్తరం లేదు. శకుంతల కేశవుడిపై చూపే ప్రేమంతా నటన, పెళ్ళిందగ్గరనుండి ఉత్తరమైనా వ్రాయలేదు. తనకు ఎన్ని చెప్పిందో — అన్నీ కల్లబొల్లి మాటలను కున్నప్పుడల్లా గుండెను పిండినట్లనిపించేది.

కేశవుడికి హోటల్ తిండి. మధ్యాహ్నం చిరుతిండ్లువలన పూర్తిగా ఆరోగ్యం క్షీణించింది. శకుంతలవస్తే పదిరోజుల్లో సర్దుకుంటాడులే - అనుకొనేవాడు ముకుందరావు.

పిల్లకు రెండుసెలలు నిండుతాయి. ఇన్నాళ్ళు తన తలుపే లేకుండా శకుంతల ఉండగలిగిన దనుకొనేసరికి ఆడజాతి సంతతిని తిట్టుకొనేవాడు.

కేశవుడి వళ్ళు నలతగా ఉంటూ జ్వరంగా మారింది. ఏమీ తినకపోగ వాడి - అమ్మ-అనేమాట తప్ప మరేమీ లేదు. రాత్రులు తల్లిని కలవరించేవాడు. వారంతిరక్క ముందే చిక్కి శల్యమైనాడు.

జ్వరంతగ్గింది కాని కేశవుడిప్పుడు మాట్లాడటం మానివేశాడు. నోటిలో ఏం పోసినా ఉమ్మివేస్తాడు. ముకుందరావు బెదిరించినా ముఖంలో ఏమార్పులేకుండా అలాగే చూస్తాడు. ఎప్పుడైన ఏం కావాలని అడగ్గా అడగ్గ ముఖాన్ని దిండులో దాచుకొని ఏడుస్తూ - అమ్మ - అంటాడు.

కేశవుడి నిలా ఉంచితే తనకు దక్కడను కొని ఒకరోజున - "పదనాన్న! అమ్మ దగ్గరకు" - అన్నాడు ముకుందరావు.

రైలు దిగేసరికి రాత్రి పదయింది. ఒక్క బండికూడ లేదు. కొడుకును భుజాన వేసుకు నడిచాడు. శకుంతల ఉండే వీధిలో అడుగు పెట్టగానే దుఃఖం పొంగుకొచ్చింది. శకుంతల రాకపోయినా, రమ్మని వ్రాయకపోయినా ఆత్మాభిమానం చంపుకు తను వెళ్తున్నందుకు-

ఇంటి గుమ్మంపు పైమెట్టు దగ్గర ఆగాడు. లోపలినుండి విస్పష్టంగా శకుంతలమాటలు వినవస్తున్నాయి.


"మీ మనసులో ఇంతకాలం ఈ ఊహ పెట్టుకొనే నన్ను పంపలేదని తెలీదు. వారి నుండివచ్చిన ఉత్తరాలేవీ నా కందకుండా దాచేశారు. వారికి నేను వ్రాసిన వాటినన్నీ పోస్టులో పడకుండా చూశారు. ఈ ఉత్తరాలన్నీ నీపెట్టిలో దొరికాయి. కూతురి శుభాన్ని కోరి ఒక తల్లి చేసే సేవ నిమువ్వు చెయ్యలేదు. ఇక ఒక్కక్షణం ఇక్కడ ఉండను. నన్ను మావారినుండి వేరు చేస్తే రోగంతో ఉన్న నాన్నతో సహా మగదిక్కులేక అతడి ఆంస్తి చేగుతామని - అక్క ఆస్తితోబాటు నా ఆస్తినీ అనుభవిద్దామనీ మామకుట్ర - తెలుసుకో- ఈ ఇల్లు నాకు నరకం. ఈ అంధకారంనుండి నే పోతున్నాను"— అని శకుంతల కంఠం.

"ఈరాత్రివేళ ఎక్కడికెళ్తావు" అన్నారు అధికారపూర్వకంగా-ఎవరో కాదు 'మామ'.

"ఈ ఇంట్లో ఉన్న చీకటికంటే బయట ఉన్నదే నాకు వెలుగు. నా విషయంలో నీవేమీ జోక్యం కలుగజేసుకో నవసరంలేదు. మా ఊరు నాకు బాగా పరిచయమే. ఎక్కడికో నాకే తెలీకుండా వెళ్తున్నాననుకుంటున్నావేమో - రైలుస్టేషన్‌కు దారి తెలుసు. మరో గంటలో బండికూడ ఉంది" అంటూ తలుపు తెరిచింది శకుంతల—.

లోపలినుండి వచ్చిన దీపపు నిండు వెలుగులో పాలిపోయినముఖంతో ముకుందరావు- ఎముకల ప్రోవులాఉన్న కేశవుడు కనబడ్డారు.

కేశవుడు హీన స్వరంతో-"అమ్మా!"— అంటూ శకుంతలకాళ్లకు చుట్టుకున్నాడు. ★



చిత్రకారుడు: ఎం. సుల్తాన్‌జమా (వైజాగ్)

గుమాస్తా గిరీశం తనకెప్పటికైనా మంచిరోజులువస్తాయేమో కనుక్కుందామని ఒక పేరుపడ్డ జోతిష్యుని దగ్గరకు వెళ్లాడు. ఆ జోతిష్యుడు రెండు ప్రశ్నలకి జవాబులు చెప్పడానికి ముందుగానే ఇరవై రూపాయలు పుచ్చుకున్నాడు.

గిరీశం (జోతిష్యునితో): రెండు ప్రశ్నలకి ఇరవై రూపాయలు చాలా ఎక్కువ కాదండీ?

జోతిష్యుడు: ఇంకమీ రెండవ ప్రశ్న ఏమిటి?

—జె. మాధవరావు (బుర్లా)



-దైవజ్ఞ పోతూరి శ్రీరామమూర్తి.

9-11-60 బుధవారం మొదలు
15-11-60 మంగళవారంవరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈ వారం ముఖ్యంగా ధన విషయంలో శ్రమ కనుపిస్తుంది. పెద్దమనుష్యులతో కలహాలు రాగల సూచన లున్నవి. ప్రయాణాలు అనుకున్న ప్రకారం జరుగవు. వృత్తివ్యాపారాలలో ఇంతకుముందుకన్నా కొంత చురుకుదనం కనుపిస్తుంది. ఇతరులవద్దనుంచి రావలసిన ధనాన్ని నమ్ముకుని కార్యభారం పైన పెట్టుకోవద్దు. కుటుంబంలో శ్రమ, చికాకు కనుపిస్తవి. మీ కార్యక్రమాలకు ఇతరుల ప్రోత్సాహం కనుపించదు. వారాంతంలో దూరమందున్న మిత్రులవద్దనుంచి అనుకూల వార్తలు తెలుస్తవి. అధికారులతో స్నేహము, కార్యసిద్ధి ఉంటవి. 10, 11 లలో బంధుమిత్రుల రాక, ఆస్తి వృద్ధిప్రయత్నాలు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

అనుకున్న పనులలో కొంత విజానం మాత్రం కనుపిస్తూఉంటుంది. మిత్రుల సలహా, ప్రోత్సాహము బాగా లభిస్తవి. ఇతరులతో కలిసి చేయు పనులలో సాధారణంగా అభిప్రాయభేదాలు రాగల సమయం. అయితే ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. పడమర దిక్కునుంచి శుభవార్తలు తెలుస్తవి. వారం రెండవభాగంలో ఇతరుల కార్యభారం పైన పెట్టుకోవలసివస్తుంది. అకస్మాత్తుగా ఖర్చులు కూడా పెరుగుతవి. నిబ్బరంతో మీధర్మాన్ని నిర్వర్తించుకో గలుగుతారు. నౌకరులు మొదలయినవారివల్ల కార్యభంగం కాకుండా చూచుకోవటం అవసరం. 12, 13 లలో కారణంలేని ఆందోళన, దేహశ్రమతో కూడిన కార్యక్రమం.

* * *

మిధునం :

(మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ప్రతి చిన్న పనీ విశేషమైన శ్రమతో నిర్వహించవలసివస్తుంది. ముఖ్యంగా మీ ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం. సంఘంలో పెద్దమనుష్యుల స్నేహం లభిస్తుంది. పుణ్యకార్యాలు నెరవేరుతవి. వృత్తి ఉద్యోగాలలో మీ ధైర్యాన్ని శక్యాన్ని పరీక్షించగల సంఘటనలు జరుగుతవి. కుటుంబంలో శాంతి, సౌఖ్యములభిస్తవి. మీరు ఎదురుచూస్తున్న వార్తలు సకాలంలో అందవు. ధనవిషయంలో ముందు కొంత ఆందోళన తోచినా సమయంలో చిక్కుపడకుండా పనులు నెరవేర్చుకోగలుగుతారు. ఆదాయం క్రమక్రమంగా పెరుగుతుంది. వ్యవహారరంగంలో ప్రస్తుతం అనుకూల వాతావరణం కనుపించదు. 14, 15 లలో శుభవార్తలు, వృత్తిలో అనుకూలత.

> **గ్రహస్థితి**
>
> మిధునంలో అంగారకుడు, సింహంలో రాహువు, తులలో బుధుడు, వృశ్చికంలో సూర్యుడు, వృశ్చిక, ధనుస్సులలో శుక్రుడు, ధనుస్సులో గురుశనులు, కుంభంలో కేతువు, మిధున కటక సింహ కన్యలలో చంద్రుడు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

మీ స్వంత పనులలో నిదానము, శ్రమ కనుపించగల సమయం. అయితే మాట చలామణి బాగుంటుంది. కోర్టు కచేరీలలో అనుకూలసూచన లున్నవి. ధనాదాయం పెరుగుతుంది. పుణ్యకార్యాలు నెరవేగలవి కాని, ఆరంభంలో విఘ్నాలు కనుపించటంవల్ల ఉత్సాహం తగ్గుతుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం బాగుండదు. వృత్తిఉద్యోగాలలో కార్యభారం అధికంగా ఉంటుంది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం కలిగించుకో తగిన సమయంకాదు. విలువగల వస్తువులు కొనే ఆలోచనలుజరిగినా సమయంలో ఆటంకాలు వస్తవి. వారాంతంలో అకస్మాత్తుగా వస్తునష్టం. 12, 13 లలో కుటుంబ కలహాలు, దుబారా ఖర్చులు, శుభవార్త.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఎవరు ఏ సలహా చెప్పినా ఆలోచించి కార్యరంగంలో ప్రవేశించటం అవసరం. స్వార్థపరులు కొందరు మిమ్ములను అనుసరించుకుని తిరిగే సూచనలున్నవి. లౌకిక మీరు ఇతరులకు చెప్పిన మాటను చెల్లించుకోగలుగుతారు. సులభంగా జరుగుతవని ఆరంభించిన పనులు మధ్యలో ఆందోళనను కలిగిస్తవి. వృత్తి ఉద్యోగాలలో మీ శక్తి సామర్థ్యాలను బాగా వినియోగించుకోగలుగుతారు. మీకు అపకారం కలుగునట్లు మీ విరోధులు చేసిన ప్రయత్నాలు వారికే ఎదురుతిరుగుతవి. ప్రయాణాలు అనుకూలిస్తవి. వ్యవహార పరిష్కారాలకు అనుకూలమైన సమయం. 14, 15 లలో శుభసంబంధమైన ఖర్చులు, శుభవార్తలు, శ్రమ.

* * *

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా., హస్త, చిత్త 1, 2 పా.)

ఈ వారం వృత్తి వ్యాపారాలలో మంచి మార్పులు రాగలవు. విశేషంగా డబ్బు పెట్టుబడి పెట్టవలసివస్తుంది. కోర్టు కచేరీలలో మొదట ఆందోళన తోచినా చివరకు అనుకూలత కనుపిస్తుంది. ఈ సమయంలో మీరు ఒక కార్యం నిమిత్తం ప్రయత్నిస్తూఉంటే మరొక మార్గంలో ఫలితం కనుపిస్తూ ఉంటుంది. అధికారులవల్ల అనుకూలత ఉంటుంది. పదిమందిలో హోదా నిలబెట్టుకొనే నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. అందువల్ల తగినంత ఉపయోగం పొందలేకపోతారు. వారాంతంలో శుభవార్తలు తెలుస్తవి. 10, 11 లలో ధనలాభం, పండితులతో మైత్రి, విలువగల వస్తువులు కొంటారు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

అనేక విషయాలలో మీ శ్రమ ఫలించగల సూచనలున్నవి. ఎదురుచూడని మనుష్యుల

ఈవారపు ధరలు

బంగారు ధర 12, 13 తేదులలో కొద్ది తేజీ వస్తుంది. వెండి ధర ఆరంభంలో తేజీ కనిపించి 14, 15 లలో మందీ వస్తుంది.

పసుపు ధర 12 నుంచి తేజీవస్తుంది. మిర్చి ధరలో పెద్ద మార్పు ఉండదు.

నూవులు, నూనె ధరలలో తేజీ నిలుస్తుంది. వేరుశనగపప్పు ధర మందీ,నూనె ధర గతవారంమాదిరి నిలుస్తుంది.

గోధుమలు ధరలో కొద్ది మందీ. మినుములకు మందీవచ్చి వారంచివరిలో పెరుగుతుంది.

వల్ల కార్యసిద్ధి, ధనలాభము పొందగలుగుతారు. లోగడ ప్రయత్నించినా ఉపయోగం కనుపించనివ్యవహారాలలో అకస్మాత్తుగాపరిష్కారం కుదురుతుంది. పాటివారిలో గౌరవ మర్యాదలు పొందగలుగుతారు. ఆదాయం పెరుగుతుంది. వారం మధ్యలో అకస్మాత్తు గా దుర్వార్తలు తెలియగలవు. ఇతరుల కార్యభారాన్ని క్రమంగా తగ్గించుకుని, ప్రశాంతంగా ఉండగలుగుతారు. వృత్తిలో అభివృద్ధి సూచనలు కనుపిస్తవి. 9, 10, 11 లలో గౌరవప్రాప్తి, అధికారుల ఆదరణ.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ప్రతిబంధకాలను తొలగించుకుని మీ కర్తవ్యాన్ని నెరవేర్చుకోతగిన సమయం. సంఘంలో స్థానము, గౌరవము లభిస్తవి. ఆదాయం కూడా బాగుంటుంది. లోగడ నెరవేరని పనులు సులభంగా అనుకూలిస్తవి. బంధువులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. వారం మధ్య కాలంలో స్నేహితులవల్ల అకస్మాత్తుగా ఉద్రేకము, ఆందోళన కలుగతగిన పరిస్థితులు ఏర్పడుతవి. కుటుంబంలో ప్రశాంతంగా ఉంటుంది. తలచుకున్న పనులు సకాలంలో జరుగుతవి. ముందుగా ఎవ్వరికీ వాగ్దానాలు చేయవద్దు. దూరముందున్న మిత్రులవద్దనుంచి శుభవార్తలు తెలుసవి. 12, 13 లలో స్వల్ప విషయాలలో పేచీలు, అపవాదులు.

* * *

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ప్రథమ పాదం)

ఈ వారం వృత్తి ఉద్యోగాలలో మీ మాటకు విలువ లభిస్తుంది. ఎదటివారి పోటీ అధికంగా కనిపిస్తూఉంటుంది. సాధ్యమైనంతవరకు కలహాప్రసంగాలు రాకుండా చూచుకోనండి. ప్రయాణాలు చేస్తారు. దక్షిణ దిక్కునుంచి శుభవార్తలు, ధనలాభము ఉంటవి. మీరు ప్రశాంతంగా ఉందామని ప్రయత్నిస్తారు. కాని వెంటవెంటనే బాధ్యతలు పైన పడుతూఉంటవి. పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం. ఇతరుల మాటలను నమ్మి మీకు తెలియని క్రొత్త పనులలో ప్రవేశించవద్దు. నీచులతో కలహాలు వస్తవి. 9, 10 తేదులలో వృథా శ్రమ, ఇతరుల నిమిత్తం ఖర్చులు, నిష్ఠూరాలు.

* * *

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

ప్రస్తుతం మీ ఆందోళన తగ్గిపోతుంది. వృత్తిలో క్రమక్రమంగా మంచి మార్పు కనుపిస్తుంది. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం వచ్చి మీ బాధ్యతలను సులభంగా నెరవేర్చుకోగలుగుతారు. సంచారము, దేహశ్రమ అధికంగా ఉన్నా ఆటంకాలు లేకుండా పనులు నెరవేరుతవి. ఇతరులకు మీఆలోచనలుబాగా ఉపయోగిస్తవి. ఉష్ణసంబంధమైన అనారోగ్యం కనుపిస్తుంది. బంధువులవద్దనుంచి వచ్చే వార్తలు తాత్కాలికంగా చికాకును కలిగించవచ్చు. విశేషంగా ధనం పెట్టుబడి పెట్టవలసిన కార్యభారం పెట్టుకోవద్దు. వ్యవహారవిషయాలలో రాజీమార్గంలో పోవటం అవసరం. 10, 11 లలో వినోద కాలక్షేపం, ధర్మకార్యాలు, ధనలాభం.

* * *

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ధన విషయంలో శ్రమకరంగా ఉంటుంది. తప్పనిసరిగా పనులు కొనసాగించవలసిన సమయంలో సహాయం చేస్తామని చెప్పిన మనుష్యులు తప్పుకుంటారు. బాహ్యవిషయాలలో ఆడంబరం పెరుగుతుంది. పెద్దమనుష్యుల ఆదరాభిమానాలు లభిస్తవి. ప్రయాణాలు సుఖంగాను, లాభకరంగాను జరుగుతవి. ధైర్యము, పట్టుదల బాగుంటవి. సమయానుకూలంగా ఎదటివారిని అనుసరిస్తూ మీ ప్రయోజనం సాధించుకోగలుగుతారు. శుభకార్యప్రయత్నాలు ఒక నిర్ణయానికి వస్తవి. ఇండ్లు, భూములు మొదలయినవి కొనే ప్రయత్నాలకు అనుకూలమైన సమయం. 12, 13 లలో దండుగ ఖర్చులు, మానసిక శ్రమ.

* * *

మీనం:

(పూర్వా భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

సందేహాలతోనే కాలం జరిగిపోతుంది. ధనాదాయము, గౌరవము బాగుంటవి. కోర్టు కచేరీలలో చాకచక్యంతో కార్యం సాధించుకోవలసిన సమయం. ఇతరులమీద ఆధారపడి ఆరంభించిన పనులు నెరవేరుతవి. కాని, తగినంత ఫలితం పొందలేకపోతారు. కుటుంబంలోనివారి అనారోగ్య కారణాలవల్ల మీ పనులలో నిదానము కనుపిస్తుంది. దుబారా ఖర్చులు పెరుగుతవి. ఇతరుల మాటలను నమ్ముకుని లభించిన అవకాశాన్ని వదులుకుంటారు. ప్రయాణాలు అనుకూలించవు. విశ్రాంతి లోపిస్తుంది. 14, 15 లలో ధనప్రాప్తి, వృత్తిలో అభివృద్ధి. ★

స్వప్న సౌధం

మధురాంతకం రాజారాం

రాత్రి పదిగంటల సమయం.

బయట చలిగాలి వీస్తున్నా గదిలో మాత్రం వెచ్చగా వుంది. నల్లటి నాపరాళ్ళ పైన, తెల్లటి గోడల మధ్య నీలిరంగు కాగితంతో ఆచ్ఛాదింపబడిన చిన్న బల్బునుంచీ ప్రసరిస్తున్న కాంతిలో ఆగది చిన్న సముద్రంలా వుంది. గోడ ప్రక్కగా పవారు మంచం. మంచంపైన మల్లెపువ్వులాంటి దూది పరుపు. చెదిరిన ముంగురులతో, బరువెక్కుతున్న కనురెప్పలతో, ఆలోచనల గొలుసుకట్టు వెంట సాగిపోతూ నిద్రాదేవత ఒడిలోకి జారుకుంటోంది నీరజ.

పచ్చి పసుపుకొమ్ములు చిదిమి చేసిన బొమ్మలా వుంటుంది నీరజ. అంతకంటే కోనేట్లో కోసి తెచ్చిన తామరపువ్వులా వుందనడం సమంజసం. ఎందుకంటే నీరజ ముఖంలో అలసట కాస్తా స్పష్టంగానే కనిపిస్తోంది.

ఉదయం ఎనిమిదినుంచీ సూర్యాస్తమయం వరకూ ఉద్యోగకార్యభారంలో నీరజ అలసిపోయినమాట వాస్తవం. ఐతేనేం, ఆ అలసట కూడా నీరజ సౌందర్యానికి ఉద్దీపకంగానే వుంది. విడ్డూర మేముంది? అందమున్నచోట సర్వమూ అందమే అని కవికులగురువులు చెప్పనే చెప్పారు మరి!

నీరజ ఉద్యోగంలో చేరి యింకా రెండు మాసాలు నిండలేదు. అలసిపోయి యింటికి వచ్చిన అమ్మాయికి భోజనం పెడుతూ ముసలావిడ "అదేమిటో గానీ నా కళ్ళకు నువ్వు చిక్కిపోతున్నట్లు కనిపిస్తున్నావే నీరజా! అప్పుడే. 'దూటీ' అంటే మాటలా!" అంటుంటుంది.

నీరజ ఆశ్చర్యపడుతుంది. కల నిజమైతే ఎవరికైనా ఆశ్చర్యమే కలుగుతుంది. అందులోనూ పగటికల! పదేళ్ళపాటుగా ఆ పగటికలలోనే బ్రతికింది నీరజ. ఎప్పటికప్పుడే ఆ కల చెదరిపోవచ్చు ననుకునేది. అమృతం దేవతలకోసం! రాహువులాంటి తాను అందుకోసం ఆశించడం వట్టిఅడియాస-అనుకునేది.

ఆలోచిస్తూ నిద్రపోయి, నిద్రలో కలగని, కలలో తన పగటికల చెదరిపోయినట్లు భావించి, స్వర్గంనుంచీ తను అధోలోకాలకు కృంగిపోతున్నట్లు భ్రమించి గుండెల్లో గడగడలాడిపోయేది. కానీ ఆశించిన అమృతపాత్ర ఆకాశకుసుమం కాలేదు నీరజకు! ఎందుకు కాలేదు? అందుకు కారణం తాతయ్య ఆత్మబలమా! తన పూర్వజన్మల సుకృతమా! లేక భగవంతుడి కృపాకటాక్షమా! కారణం ఏమిటో నీరజకు తెలియదు. ఏవో అదృశ్య హస్తాలు తనకు అభయమిచ్చాయి. అండగా వుండి తనను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాయి. తాతయ్య చనిపోయిన రాత్రిలో





తనకింక దిక్కెవ్వరని నిలదించింది నీరజ. క్రమక్రమంగా దిక్కులేనివారికి దేవుడే దిక్కన్న గుండెనిబ్బరంలోకి రాగలిగింది.

ఈ చివరిమాట తనవిషయంలో ఋజువైనట్టు మరెక్కడా కాలేదనీ, కాబోదనీ నీరజకు ఓబలీయమైన విశ్వాసంగూడావుంది!

ప్రక్క ఇంటి గోడగడియారం ఒక్కసారి మ్రోగింది. గంట పదిన్నర కావస్తోందన్న మాట! సినిమాలనుంచీ ఇళ్లకు తిరిగివెళ్తున్న వారి మాటల కలకలం నీరజకు లీలగా వినవస్తోంది. ఆసవ్వడిని చీల్చుకుని దూరంగా ఎక్కడో పెళ్లి జరుగుతున్న చోటునుంచీ రికార్డులసంగీతం సన్నసన్నగా వినిపిస్తోంది. పాతపాట. ఐనా ఆపాతమధురంగా వుంది. పాటలో ఓజవరాలు 'ఎవరినే, నే నెవరినే' అంటూ తనను తానే ప్రశ్నించుకుంటోంది. వయసు పెద్దది! అది నువ్వు పలానా దాని వని తెలియచెప్పగలవారికోసం అన్వేషిస్తుంది. ఆ అన్వేషణలో యిలాంటిప్రశ్న ఉద్భవిస్తుంది గాబోలు! ఈ సరికొత్తవ్యూహ నీరజ మనోవీధిలో వేకువజామున [illegible]లతో[illegible]పైనుంచి వీచిన కమ్మతెమ్మెరలా పారాడింది. వేపకొమ్మల్లో కావిచిగురులా ఈ వ్యూహ స్ఫురించింది గనుక తనలో యిలాంటి అన్వేషణకు అంకురార్పణ జరగడంలేదు గదా! మెలకువకూ నిద్రకూ మధ్య మైకంలాంటి అమానసికావస్థలో గూడా నీరజ సిగ్గుపడిపోయింది. సిగ్గులోనుంచీ నిగ్గులు సంతరించుకుని అధరాలపైకి ప్రాకివచ్చిన చిన్నదరహాసంతో ఆమె ముఖమండలం అరుణారాగరంజితమైపోయింది.

అబ్బే, యిదేమీ బాగుండడం లేదని అనుకోదలచింది నీరజ. కానీ అనుకోలేకపోయింది. కెండిగిన్నెలో నీరుతెచ్చిన



పాయసంలా, పెదవి కందించిన పాలకోవాలా అంత మధురంగా వున్న వూహను బాగుండలేదని నీరజ ఎలా అనుకోగలుగుతుంది?

ఒకటి... రెండు... మూడు...

తలుపును బాదిన శబ్దం వరుసగా మూడుసార్లు వినిపించేసరికి త్రుళ్ళిపడి నీరజ కళ్ళు తెరిచింది.

"ఎవరు? ఏం కావాలి?" ముసలావిడ ప్రశ్నిస్తోంది.

"డాక్టరమ్మగారున్నదీ యింట్లోనే గదండీ! పనిబడింది. ఓ కుర్రాడి పరిస్థితి అపాయకరంగా వుంది....." కంపిస్తున్న కంఠంతో ఓ వృద్ధుడు బదులు చెబుతున్నాడు.

"ఇక్కడ డాక్టరమ్మగారు స్వంతంగా 'ప్రాక్టీసు' చెయ్యటం లేదు. పైగా నిద్రపోతున్నట్టుంది గూడా. వెళ్ళి మరెవరినైనా చూచుకోండి..."

"అయ్యో, అలా అనకండమ్మగారూ! దగ్గర్లో డాక్టర్లెవరూ లేరు. కబురుపెట్టినా వాళ్ళు రావడానికి ఆలస్యం కావచ్చు. తక్షణం ఏదైనా సహాయం జరిగితేగాని కుర్రవాడు తేరుకునేటట్టు తోచదు..."

"అయితేమాత్రం! స్వంత వైద్యాలు చేయడంలేదని చెబుతుంటే మళ్ళీ బలవంతమా..." అడుగుల చప్పుడు వినిపించడంతో ముసలావిడ ఆగంతుకుడితో మాటలు చాలించి వెనుదిరిగి చూచింది. మందులసంచి చేతబట్టుకుని చెప్పులు తొడుక్కుంటోంది నీరజ.

* * *

నీరజది నడకగా ముసలాయనది పరుగుగా ఆ యిద్దరూ సందుగొందుల్లో పడి ఒకటి రెండు ఫర్లాంగులదూరం నడిచారు.

ఓ చిన్న పెంకుటిల్లు. వీధి వైపుగదిలో ఓ చాపపైన స్మారకంలేకుండా పడివున్నాడు రోగి. అది మనిషి అడ్డంగా పడుకోడానికి వీల్లేనంత చిన్న గది. నిలువుగా పడుకుంటే మనిషికీ ద్వారానికీ మధ్య ఓ మూరెడుజాగా మాత్రం మిగులుతుంది. మామూలు యిటుకరాళ్ళతో కట్టిన గోడలే గులకరాళ్ళు పరిచి గచ్చుచేసిన నేలే! ఐనా భూమిపైన నివసిస్తున్న మానవులకోసం అదే భూమిపైన గాలికీ వెలుగుకూ దుర్భేద్యంగా ఓ చక్కటి భూగృహాన్ని నిర్మించిన ఘనత ఆ గృహవాస్తుశాస్త్రజ్ఞుడిది! కీర్తిశేషాలైన నల్లుల అవశేషాలుగా అలముకున్న నెత్తురు మరకలతో గోడలు యుద్ధభూములకు నమూనాలుగా వున్నాయి. పైకప్పునిండుకూ చాందినీ గుడ్డలా బూజు పేరుకపోయింది. ఇన్నిహంగులున్న ఆ గదిలో పాటకచ్చేరీ ప్రారంభించి చీగటీగలూ తమ ఉచితజ్ఞతను చాటించుకుంటున్నాయి. చాపచుట్టూరా కొన్ని దినపత్రికలు చెల్లాచెదరుగా పడివున్నాయి. ఓమూల పుస్తకాల గుట్టఒకటి. మరోమూల

ప్రాణదాత

పాత ట్రంకుపెట్టె ఒకటి, వైద్యశాస్త్రంలో పట్టా పుచ్చుకున్న నీరజ ఆ గదిలో అడుగుపెట్టిన మరుక్షణంలో తాను తన శత్రురాజ్యంలో ప్రవేశించినట్టు తెలుసుకోగలిగింది.

ముసలాయన చెప్పినట్టు రోగి బొత్తిగా కుర్రవాడేమీ కాడు. పడుచువాడే. ఆపడుచుదనంగూడా ప్రారంభదశలో వున్నట్టులేదు. ఆ గడ్డం పెరిగిన తీరూ, ఆ తలవెంట్రుకలు చెల్లాచెదరై వున్న వాలకం, ఆ బొమికల ప్రోవు చాపకంటుకు పోయివున్న హృదయవిదారకదృశ్యం – వీటిని బట్టిచూస్తే అతడు సుడిగుండాల్లో మునిగితేలి, ఝంఝామారుతాల అలజడికి అగ్గమై యిక ఓపరికంచాలక పోవడంవల్ల అలలు తీసుకొచ్చి తీరరేఖపైన దిగవిడిచిన ఓటి పడవలా వున్నాడు. ఓ వైపున మృత్యువులాంటి సముద్రం, మరో వైపున కన్నతల్లిలాంటి భూదేవి. నట్టనడుమ చెలియలికట్ట నంటుకుని ఓటిపడవ. మొట్ట

ఉ: ఒరేయ్ రామూ! బోర్డు చెరపరా.

వి: నేను చెరపను సార్!

ఉ: ఎందుకు చెరపవురా?

వి: మీరు నిన్ననేగద సార్ చెరపకురా చెడేవని నీతి బోధించింది.

–ఇనుగుర్తి గురుస్వామి(కార్వేటినగరం)

మొదటిసారిగా తాను పరిష్కరింపవలసి వచ్చిన ఆ 'కేసు' ఎదుట కాసేపు ప్రాన్పడి నిల్చుండిపోయింది నీరజ.

వృద్ధుడు చెప్పుకపోతున్నాడు. "చూడు తల్లీ! మందో మాకో సూదోగీదో ఏదోఒకటి చూడాలి తక్షణం. రెండు రోజులుగా నేనింట్లో లేను. ఉంటే యిందాకా రానిచ్చేవాణ్ణిగాను. పుణ్యానికి పోతే పాపం ఎదురయ్యే రోజులు. ఇంట్లోవాళ్ళు వద్దన్నా వినకుండా యితగాడికి గది అద్దెకిచ్చాను. నాలుగు మాసాలుండి మరెక్కడైనా బస చూచుకుంటానన్నాడు. చూచుకునేవాడే! ఇంతలో ఈ జబ్బొకటి వచ్చిపడింది. ఆసుపత్రికి వెళ్ళి మందు పుచ్చుకుంటున్నానన్నాడు. నయమైపోతుందనుకున్నాను. ఒకనాటి సాయంకాలం తలుపు తెరచి చూచేసరికి యితడిలా కొయ్యబారిపోతుంటాడని నాకేం తెలుసు! తీరా యిప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్తే చేర్చుకుంటారో లేదో సందేహం. మీ చేతనైంది చేయండి డాక్టరమ్మగారూ! మీ మందు ఖర్చులకు నా కిలాగూ చేతినుంచీ దండుగ తప్పదు. ఏంచేస్తాను మరి! ఇల్లుకట్టుకుని అద్దెకిచ్చుకున్న నేరానికి ఏ పీడవచ్చి తలకు చుట్టుకున్నా భరించాల్సిందే! తప్పుతుందేమున్నా నా!"

ముసలాతడి ధోరణికి నీరజ చిరాకు పడిపోయింది. లోకానికి ఎదుటివాడు బ్రతుకుతాడా, బ్రతకడా అన్న విషయంపట్ల ధ్యాస తక్కువ. వాడి చావుబ్రతుకులవల్ల తనకు కలగబోయే లాభనష్టాలను బేరీజు వేయడంలో నిమగ్నమై వుంటుంది లోకం. డాక్టర్లు మాత్రం లోకంలోని మనుషులు కాదా అనవచ్చు. వాళ్ళూ మనుషులే! రోగికి నయం కావడం, కాకపోవడంకంటే వాళ్ళకు తమ ఫీజుపట్ల పట్టింపు ఎక్కువఅంటూ యిక్కడో ప్రతివాదం బయల్దేరే అవకాశం సైతం లేకపోలేదు. కానీ ఫీజులు గడించి మేడలు కట్టాలన్న పెద్దపెద్ద ఆలోచన లేవీ నీరజకు లేవు. లేదంటే ప్రస్తుతం ఆమె అంతరాంతరాల్లో ఓ చిన్న కోరిక నిక్షిప్తమై వున్నమాట మాత్రం నిజం! ఈ రోగి తన చేతులమీదుగా గడచి గట్టెక్కితే, అది తన వృత్తికి శుభప్రదమైన ప్రారంభంగా వుంటుంది.

రోగిని పరీక్షచేయడం పూర్తికావచ్చింది. బాహ్యలక్షణాలనుబట్టి అశ్రమంగానే రోగనిదానం చేయగలిగింది నీరజ. ఎండిపోయిన పెదవులు, పిడచగట్టుకపోయిన నాలుక, ఉబ్బసంలాంటి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు– ఇవన్నీ శరీరాన్ని పీల్చి పిప్పిచేస్తున్న విషజ్వరానికి చిహ్నాలు. ఈ రోగానికి రామబాణంలాంటి సూదిమందు కద్దు. కానైతే ఒక నియమంమాత్రం వుంది. వ్యాధి చేయి దాటిపోతున్న విషమ పరిస్థితిలోనేగానీ దాన్ని వాడకూడదు.

భగవంతుడిపైన భారం వేసింది నీరజ. సిరంజిలోకి మందెక్కిస్తూ "ఇతని కిక్కడ బంధువులుగానీ పరిచితులుగానీ ఎవరూ లేరటండీ?" అని ప్రశ్నించింది.

వృద్ధుడు పెదవి విరిచాడు. "ఏదీ ఎవరున్నారు? ఇక్కడివాడే కాదమ్మా తల్లీ! ఈ లోకంలో మరెక్కడగానీ యితనికి కావలిసిన వాళ్ళుంటూ లేరనే నా ఊహ. ఉంటే కనీసం జాబులైనా రావూ! ఇదివరకేదో గడియారాల కంపెనీకి ఏజెంటుగా పనిచేశానన్నాడు. ఊళ్ళు తిరగడంతో ఆరోగ్యం పాడైపోయిందట. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారట! విశ్రాంతికోసం ఈయనగారిక్కడ మకాం వేశారు. ఇక్కడైనా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేవాడు గాదు పాపం! ఏవో ఒకటి రెండు చిన్న వుద్యోగాలుచేసి మానుకున్నాడు. ఎప్పుడెదురైనా వినయంగా పలకరించేవాడు. మనిషి మంచివాడే! కానీ ఏం లాభం? బుద్ధి

ధూమశీలమంటే కర్మ గాడిదలు కాయ మంటుంది..."

వృద్ధుడి సాయంతో రోగిని సరిగ్గాపడుకో బెట్టి చొక్కా చేతిని మడిచి మోచేతి పైభాగంలో సూది ఎక్కించింది నీరజ. "పది హేను నిమిషాల్లో గుణం కనిపించవచ్చు. కనిపిస్తే మనం మరికొంత ప్రయత్నం చేయ వచ్చు. లేకపోతే ఆశ వదులుకోవలసి వుంటుంది. ఆలోపల మీరు ఓ గ్లాసుడు వేడిపాలు పుట్టించగలిగితే ఎందుకైనా మంచిది. రోగం యిలా ముదిరిపోడానికి సరైన మందు లేకపోవడం మాత్రమే గాదు, సక్రమమైన ఆహారం లేకపోవడం గూడా ఒక కారణమే..."

"పాలా! అదెక్కడ దొరుకుతుంది? ఇంత రాత్రివేళ..."

నీరజకు చిర్రెత్తుకొచ్చింది. "అదేమిటండీ! ఇక్కడ మీరొక మనిషిప్రాణంతో వ్యవ హరిస్తున్నారన్న సంగతి మరచిపోగూడదు. వెళ్ళండి. ఇంత పట్టణంలో పాలు దొరక్క పోగు. ఎక్కడైనా టీస్టాల్లో అడిగి చూడండి..."

నీరజకోసం వసారాలో వాలుకుర్చీ వేసి ముసలాయన గ్లాసుతీసుకుని వీధిలోకి వెళ్ళి పోయాడు. చీకటి గుయ్యారంలా వున్న గృహాంతర్భాగం కేసి చూస్తూ కుర్చీలో కూర్చుంది నీరజ. అప్పటికీ ఆ ముసలాతడే కొస్తానయం. ఈ యింట్లో మిగిలిన వాళ్ళందరూ గాఢంగా గుర్రకలు పెడుతూ నిద్రపోతున్నారు. బుడ్డీదీపం ఒకటి వెలుగు తుంచబట్టి సరిపోయిందిగానీ లేకుంటే రోగి పడివున్న గదిలోగూడా అంధకారం తాండ వించేది! ఆ గుడ్డిదీపమైనా యింకెంతసేపు వెలుగుతుంది? తడిసోకని వత్తిచివర దాని బ్రతుకుగూడా సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడి పోతోంది.

నీరజ నిట్టూర్చింది. దేనిపట్ల నిర్లక్ష్యం చూపగూడదో దానిపట్ల నిర్లక్ష్యం చూపు తున్నారు మానవులు. డబ్బుతో కొనరానిదీ, మేధస్సుతో సృష్టించరానిదీ అయిన 'ప్రాణం' ఒక్కొక్కచోట తృణంకన్నా హీనంగా నిరాదరింపబడుతోంది. ఒకప్రాణం కోసం శరీరంలోని కండలుకోసి సమర్పించు కున్న త్యాగశీలతనుగురించి కథలు చెప్పుకునే దేశంలో దౌర్భాగ్యమానవులు కొందరు కంటతడపెట్టేవారైనా లేకుండా క్రిమికీట కాల్లా చనిపోతున్నారు.

నిటారుగా కూర్చునే ఓపికలేక కుర్చీలో సోలిపోయింది నీరజ. కరడుగట్టుక పోయిన నిస్తబ్ధతలో చేతిగడియారం టిక్కు టిక్కు మంటున్న శబ్దంగూడా ఆమెకు స్పష్టంగా వినిపిస్తోంది. మెల్లగా నిమిషాలు దొర్లిపోతు న్నాయి. పదిహేనునిమిషాల గడువుగూడా దాటిపోవస్తోంది.

ఉన్నటుండి గదిలోనుంచి రోగి మూలుగు వినిపించినట్టు తోచడంతో లటాలున లేచి నిల్చుని నీరజ గదిలోకి తొంగిచూచింది. నిజమే! రోగిలో చలనం ప్రారంభమైంది. గాలిలో ఎండుటాకుల్లా అతడి పెదవులు కదులుతున్నాయి.

శ్వాసక్రియ స్వేచ్ఛగాజరగడానికి వీలుగా అతడి తలక్రింద తలగడ నుంచగలిగితే బాగుం డుననుకుంది నీరజ. పుస్తకాలు తప్పితే ఆ గదిలో తలగడగా ఉపకరించే వస్తువులేవీ లేవు. గుట్టలావున్న గ్రంథ సముదాయంలోనుంచి ఆమె ఓ లావుపాటి పుస్తకం పైకితీసింది. దుమ్ముదులిపి ఆ పుస్తకాన్ని తలగడగా అమ రించివుండేదే నీరజ. కానీ దుమ్ముదులుపు తుండగా పుస్తకంలోనుంచి క్రిందికి జారిన కాగితం ముక్కలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాయి. ఒకదానితర్వాత ఒకటిగా ఆమె కాగితాలన్నింటినీ చేతికి తీసుకుని, దీపకాంతిలో వాటిని తదేకదృష్టితో పరి శీలిస్తూ విగ్రహంలా నిల్చుండిపోయింది.

అవి మామూలు కాగితంముక్కలు గావు. మనియార్డరు రసీదులు!

ప్రతిరసీదులోనూ 'మనియార్డరు పుచ్చు కున్నవారి సంతకము' అన్న ముద్రితాక్షరా లకుపైన తాను స్వయంగా చేసిన తన సంతకం నీరజకళ్ళకు అసందిగ్ధంగా కనిపిస్తోంది!

నీరజకు కలిగిన ఆశ్చర్యాన్ని మాటల్లో వర్ణించడం దుస్తరం.

మహాప్రకాశంలో కనుమాపు చెదరి అంధత్వం ప్రాప్తించినటుగా హద్దులుదాటిన ఆశ్చర్యంలో నీరజ మనసు చైతన్యం గోల్పోయి స్తబ్ధమైపోయింది.

అలా తనెంతసేపు నిల్చుందో నీరజకు తెలి యదు. "పాలు తెచ్చానండ డాక్టరమ్మ గారూ!" అన్న వృద్ధుడి పలకరింపుతో గానీ ఆమె మళ్లీ మామూలు స్థితికి రాలేకపోయింది.

పాలగ్లాసును చేతికి తీసుకుని రోగిదగ్గర కూర్చుంది నీరజ. చెంచాతో పాలుతీసి రోగి పెదవుల కందిస్తున్న నీరజనుచూచి వృద్ధుడు విస్మయచకితుడై పోయాడు. ఓ డాక్టరు చికిత్స చేస్తున్నట్టుగా లేదు, ఆ దృశ్యం ఎవరో ఆత్మీయురాలు రోగికి సపర్యలు జెరపినట్టుగా వుంది!

పదినిమిషాలు గడిచిన తర్వాత మళ్ళీ వృద్ధుడే పలకరించాడు. "అర్ధరాత్రి కావ స్తోందమ్మగారూ! మిమ్మల్ని యింటిదగ్గర వదిలిపెట్టి వస్తాను..."

"ఎందుకూ నేనిక్కడే వుంటాను" అంది నీరజ.

అప్రయత్నంగా వెలువడిన ఆ జవా బులో 'నన్నిక్కడినుంచి వెళ్ళిపొమ్మన డానికి నువ్వెవరివి' అన్న అర్థం ధ్వనిం చిందేమో మరి—వృద్ధుడి విస్మయం ద్విగుణీ కృతమైపోయింది.

* * *

నీరజ మనోవీధిలో పూర్వస్మృతులు



- ఆర్. సుబ్బారావు (అనకాపల్లి)

నాటకంలో దృశ్యాలకు మల్లే కదిలిపోతు న్నాయి.

గాలిలో చిన్నదీపం వెలిగించి తన తల్లి దండ్రులిద్దరూ చనిపోయారు. భగవదను గ్రహం తాతయ్యరూపంలో తనను ఆదరిం చింది. చల్లటి కానుగచెట్టు నీడలాంటిది తాతయ్య ఆదరణ. ఆ నీడలో తాను తల్లి దండ్రులు లేని కొరతను మరచిపోగలిగింది.

లోకమంటే ఒకపూలతోట. ఆడుకో వచ్చు. పాడుకోవచ్చు. బొమ్మరిళ్ళుకట్టుకో వచ్చు. గుజ్జనగూళ్లు వండుకోవచ్చు—అన్న అమాయికభావనలతో తనచిన్ననాటిరోజులు మధురస్వప్నంగా గడచిపోయాయి.

తాతయ్య తనను హైస్కూల్లో చేర్పిం చాడు. వందలాది బాలబాలికల్లో తనకొక ప్రత్యేకస్థానంవుండేది. ఈపిల్లకు మంచిభవి ష్యత్తు వుందనుకునేవాళ్లు టీచర్లు. పరీక్షలు వ్రాసి బాగామార్కులు సంపాదించడమే మంచిభవిష్యత్తుకు రాచబాటని తనారోజుల్లో తలపోసింది. జీవితం అందమైనదిగానూ, ఆనందకరమైనదిగానూ అప్పుడు తనకుభాసిం చింది.

ఐతే ఆ అజ్ఞానపు తెరలు క్రమక్రమంగా తొలగిపోతూవచ్చాయి. పరిస్థితులు తమ నిజ స్వరూపంతో ప్రత్యక్షమైనకొద్దీ తనలో బ్రతుకంటే భయాందోళనలు కోసాగింది. ఏక్షణా న్నయినా రాలిపోవడానికి సిద్ధంగావున్న పండుటాకు తాతయ్య. ఆయనకు పరువు ప్రతిష్ఠలే గానీ ఆస్తిపాస్తులు లేవు. పట్టణం చివర ఆశ్రమంలాంటి కుటీరంలో ఆయన నివాసం. ఆ కుటీరమైనా ఆయన స్వంతం గాదు. కట్టుకంబానికి కట్టిపెట్టినగొడ్డులా తన కుటుంబంకోసం బ్రతికినవాడు గాదు తాతయ్య. ఆయన సమాజంకోసం బ్రతికాడు. సంఘంలో చైతన్యం తీసుకురావాలని ఆకాం



ప్రాణదాత

క్షించి అందుకోసం బ్రతుకును మీదుకట్టిన మహనీయుల అడుగుజాడల్లో ఆయన నడిచాడు. వితంతు వివాహాలు, అస్పృశ్యతానిరాకరణ, కులభేదాల ప్రసక్తిలేకుండా సహపంక్తి భోజనాలు మొదలైనవి ఘోరాపచారాలుగా భావింపబడినరోజుల్లో ఆయన ముందుండి అలాటి ఉద్యమాలను నడిపించాడు. లోకులు రాళ్లురువ్వినా, బంధులోకం ఆంక్షలు విధించినా ఆయన అచంచలంగా తనఆదర్శానికి కట్టుబడినిలిచాడు.

తాతయ్య గవర్నమెంటు పాఠశాల్లో టీచరు. కొంతకాలం హెడ్మాస్టరుగాకూడా పనిచేశారు. జీతంక్రింద ప్రతినెలా ఆయనకెంతో కొంతడబ్బు ముడుతుండేది. ఐతే అందులో సగానికిసగం పేదవిద్యార్థుల బడిజీతాలక్రింద, పుస్తకాలక్రింద ఖర్చయిపోతుండేది. ఒక్కొక్కనెల జీతం తీసుకున్నరోజున ఆయన ఖాళీ జేబుతో గూడా యింటికి రావడం జరుగుతుండేది. అమ్మమ్మ ఈ లోకపుమనిషి గాదు. తాతయ్య అడుగులకు మడుగు లొత్తడం మాత్రమే ఆమెకు తెలుసు. ఆయనచేసిన పనిలో తప్పులు పట్టడం ఆమెకు తెలియదు.

తాతయ్యకు వైద్యంగూడావచ్చు. ఆయన బోర్డు తగిలించుకోని నాటువైద్యుడు. వైద్యం ఆయనకు వంశానుగతంగాసంక్రమించినవిద్య. ఐతే ప్రతిఫలం ఆశించినప్పుడు తన వైద్యం ఫలించదని ఆయన విశ్వాసం. ఆ వైద్యంపట్ల కూడా కొందరికి విశ్వాసం వుండేది. అర్ధరాత్రప్పుడు, రాత్రి మూడు జాములప్పుడు ఎవరెవరోవచ్చి తలుపుతట్టి తాతయ్యను తీసుకెళ్లిపోయేవారు. బ్రతకడానికి ప్రతిజీవికి హక్కుందని చెబితే చాలదు, దిక్కుకూడా వుండాలి అని ఆయన చెబుతుండేవారు. ప్రతి మానవుడికీ కడుపునిండుకూ తిండి, ఒంటికి బట్టా, రోగానికి మందు – ఈ మాత్రమైనా ప్రాప్తిపడకపోతే శతాబ్దాలుగా వికసిస్తూ వచ్చిన మానవనాగరికత కేవలం ప్రహసనప్రాయమేననీ ఆయన వాదిస్తుండేవారు. ఇంటికెవరైనా అతిథులు వచ్చినప్పుడు తనను చూపించి "చూచారటండీ! మా అమ్మాయికి పద్నాలుగేళ్లు పూర్తికాలేదు. అప్పుడే ఫిఫ్తుఫారం చదువుతోంది. నా తల్లిని డాక్టర్ చదివిస్తాను. ఆడవాళ్లు చదవడమంటే నాకు చాలా యిష్టం. కానీ ఒక్క షరతు. వాళ్లు కుర్రవాళ్లకు పాఠాలైనా చెప్పాలి. లేదా రోగులకు పరిచర్యలైనాచేయాలి" అంటుండేవారు.

చదివించడానికి చదివించాలన్న సదుద్దేశం ఒక్కటి మాత్రమే చాలదనీ, అందుకు మరికొన్ని హంగులుండాలని అప్పట్లో తాతయ్యకే గాదు, తనకు సైతం తోచింది గాదు!

అవసానదశలో తాతయ్యకు పాతికరూపా

యల పెన్షను తప్పితే యితరత్రా జీవనాధారం లేదు. ఆపాటి రాబడిలో ఆయన జీవితశేషాన్ని నిశ్చింతగా గడపగలిగి వుండేవారే. కానీ తన చదువు కోసం ఆయన ఆర్జనకు పూనుకోవలసి వచ్చింది. శరీరంలో ఓపిక లేకపోయినా ఆయన పది మంది కుర్రాళ్ళకు ట్యూషను చెబుతుండే వారు. ఆ అదనపు రాబడిని నమ్ముకునే ఆయన తనను కాలేజికి పంపడం జరిగింది.

తనకూ దురదృష్ట దేవతకూ సంకుల సమరం ప్రారంభమైంది గూడా అప్పటి నుంచే!

కాలేజిలో చేరిన కొంతకాలానికే యింటి దగ్గరనుంచీ పిట్టపిడుగులాంటి వార్త వచ్చింది. తాతయ్య యిక పైకిలేవలేరు. ఆయన కాళ్ళు రెండూ పడిపోయాయి. మనిషిని జీవచ్ఛవంలా మంచంపైన పరుండబెట్టే ఆ భయంకరమైన వ్యాధి పేరు పక్షవాతం!

సెలవుల్లో యింటికి వెళ్ళినప్పుడు తను తాతయ్యదగ్గర కూర్చుని విలపించింది. ఇక చదువు మానేసి ఏదైనా చిన్న వుద్యోగం చూచుకుంటానన్నది. ఐతే తాతయ్య ససేమిరా ఒప్పుకున్నారుగాదు. "చూడు తల్లీ! నా జీవితంలో నేను చేబట్టిన ప్రతి కార్యంలోనూ నాకు విజయమే సమకూరింది. నిన్ను చదివించాలన్నది నా చిట్టచివరి ప్రయత్నం. ఈ ప్రయత్నంలో నేను కృతకృత్యుణ్ణి ఔతానో కానో తేల్చుకోవాలి. నువ్వు నాకోసమైనా చదువుకోవాలి. తప్పదు" అన్నారు.

అన్నారేగానీ ఎలా చదివించగలరో తనకర్థం కాలేదు. ఐనా తాతయ్య పట్టుదలవల్ల తను మళ్ళీ కాలేజికి వెళ్ళక తప్పలేదు. యథాప్రకారంగా ప్రతినెలా డబ్బు చేతికందుతుండేది. అసలు రహస్యం యింటరు పరీక్షలు వ్రాసి యింటికి వెళ్ళిన తర్వాత గానీ తనకు తెలిసి రాలేదు. ఇల్లు అయ్యవారి నట్టిల్లులా సర్వశూన్యంగా వుంది. పాత కాలంనాటి కుర్చీలు, బీరువాలు మటుమాయమైపోయాయి. పాత్రసామగ్రి కంటికి కనిపించడం లేదు. ఆఖరుకు అమ్మమ్మ చెవుల్లో కమ్మలుగూడా లేవు!

అంతటితో దారుణ నిదాఘంలో మండుటిసుకపైన యింకిపోయిన ప్రవాహంలా తనను చదివించాలన్న కోరిక తాతయ్యలో అణగారిపోయి వుండవచ్చుననే తను భావించింది.

కానీ విధికి మానవులతో చెలగాటమాడటమంటే సరదా! తన సరదాకోసం అది అప్పుడప్పుడూ కొన్ని తమాషాపనులు చేస్తుంటుంది. ఇంటరు పరీక్షల్లో తను కళాశాలకంతా ప్రథమస్థానంలో నెగ్గింది. ఆ మార్కుల మూలంగా తనకు మెడికల్ కాలేజిలో సీటు మాత్రమే గాదు, స్కాలర్ షిప్పు గూడా లభించే అవకాశం దృగ్గోచరమైంది.

ఇప్పుడేం చేస్తావన్న ఈ కడసారి సవాలు గూడా తాతయ్య ఆత్మవిశ్వాసంతో ఢీకొనలేకపోయింది. కళ్ళుమూసుకుని, పిడికిలి బిగపట్టి, దృఢనిశ్చయంతో "నాకు నమ్మకం వుందితల్లీ! నీచదువు మధ్యలో ఆగిపోదు. మనకు భగవంతుడి తోడ్పాటు తప్పకుండా లభిస్తుంది. నువ్వు వెళ్లి కాలేజిలో చేరు" అన్నారాయన.

దురదృష్టదేవతకూ తనకూ జరిగిన సంకుల సమరంలో అది పతాకస్థాయి!

మెడికల్ కాలేజిలో చేరిన రెండుమాసాలకు తాతయ్య తనకొకజాబు వ్రాశారు. ఆశనిరాశలు పడుగుపేకలా కలిసిపోయిన ఆ ఉత్తరంలోని ప్రతివాక్యమూ తనకింకా బాగా జ్ఞాపకం. వణుకుతున్న వ్రేళ్లతో కూర్చునే వీలులేక రోగశయ్యపైన పడుకుని ఆయన వ్రాసిన ఆ చివరిలేఖ తలచుకోగానే తన మనోఫలకంపైన సాక్షాత్కరిస్తుంది.

"చిరంజీవి నీరజకు శుభాశీస్సులతో మీ తాతయ్య వ్రాయునది—

అమ్మాయీ! నాఆరోగ్యం నానాటికీ దిగజారిపోతోంది, ఇహానికీ పరానికీమధ్య అంచుపైన నేను నిలబడిఉన్నాను. ఈక్షణాన నా ఆలోచనలను యిహంవైపుకు లాక్కుంటున్న లంకెలు రెండు. ఒకటి మీఅమ్మమ్మ. రెండోది నువ్వు. మీ అమ్మమ్మనుగురించి నాకంతగా దిగులు లేదు. ఆమెకు నువ్వున్నావు. నీకెవ్వరూ లేరు. నువ్వు నీగమ్యస్థానానికింకా చాలాదూరంలో వున్నావు. ఇంతవరకూ నువ్వాగమ్యం చేరుకోగలవనే నేనాశించాను. ఐతే నా యీ జీవితచరమాంకంలో ఆ ఆశ క్రమక్రమంగా సన్నగిల్లిపోతోంది.

త్వరగా గడచిపోకుండావున్న రోజులు, నిద్రపట్టని రాత్రులు, ఎగతెగని ఆలోచనలు, స్పష్టంగా ప్రకటితంగాని వ్యథలు - ఇవన్నీ నా మనశ్శాంతిని పాడుచేస్తున్నాయి. ఒక్కొక్కప్పుడు నాకీ పక్షవాతం రావడం గూడా మంచికే ననిపిస్తోంది. ఇది రాకుంటే నా నిస్సహాయత్వం నాకు తెలిసేదిగాదు. నేనొక అల్పజీవినన్న సత్యం నాకు గోచరించేదిగాదు.

ఇటువల నేను కొందరు మిత్రులకు, పరిచితులకు జాబులు వ్రాశాను. నేనెప్పుడో ఉపకారాలు చేశానని చెప్పడమూ లేదు. అందుకు ప్రతిఫలం కోరడమూ లేదు. చేతులు జోడించి దీనంగా యాచించాను. నా ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు లేవు. నా ప్రార్థన అరణ్యరోదనంక్రింద పర్యవసించింది. ఏం చేయమంటావు తల్లీ! ఇంతకాలంగా నేనేనో భ్రమలో బ్రతికాను. ఇప్పుడు నా చేతకానితనాన్ని ఒప్పుకుంటున్నాను.

ఇంతటితో నేనీ జాబును పూర్తిచేసి పోస్టుచేసి వుండేవాడినే. ఐతే అదేం చిత్రమోగానీ నువ్వు చదువు ప్రారంభించిననాటి నుంచీ మనకు అంధకారంలో ఆశాకిరణాలు కనిపిస్తూనేవున్నాయి. ఇటీవల జరిగిన ఓ విచిత్రోదంతాన్ని వివరించి, ఉత్తరం ముగిస్తాను.

ప్రాణదాత

పదిరోజులప్పుడు పాతికేళ్ల యువకు డొకడు నాకోసం వెదుక్కుంటూవచ్చాడు. వచ్చినవాడు తానొక పత్రికా విలేఖరినని చెప్పుకున్నాడు. నా దురవస్థను చాలా విచారించాడు. నే నంగీకరించినట్లయితే నన్ను గురించి ఓ వ్యాసం వ్రాసి పత్రికలో ప్రకటిస్తానన్నాడు. నాకు నవ్వొచ్చింది. వెంటనే ఒళ్లు మండిందికూడా! అలాటి వ్యాసం ప్రకటించడం నా కిష్టమేననీ, ఆ వ్యాసం ప్రకటింపబడిన కాగితం పొట్లాలు కట్టుకోడానికి ఉపకరిస్తే అందువల్ల చనిపోయిన తర్వాతకూడా నా ఆత్మకు శాంతి చేకూరవచ్చుననీ అతనికి బదులు చెప్పాను.

పాపం! అతని ముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

దిగాలుపడి తల వంచుకుని అతడు వెళ్లిపోయాడు. అతడి రాకపోకలకు నేనంత ప్రాధాన్యం యివ్వలేదు కూడా! కానీ యింతలో అతడి దగ్గరినుంచీ ఓ ఉత్తరం వచ్చింది.

ఇదేమిటో విడ్డూరంగానే వుంది మరి! ఈ విశాలాంధ్రావనిలో ఎక్కడో మానవ సేవాసమితి అన్న పేరుతో ఒక సంస్థవుందిట. సంఘానికి అంతో యింతో సేవచేసిన నాలాటి వాళ్లకు వార్ధక్యదశలో కొంత ఆర్థిక సహాయం చేయడం ఆ సంస్థ కార్యక్రమంలో ఒక భాగమట! ఆ సేవాసమితి కార్యకర్తలతో సంప్రదించాననీ, వాళ్ళు నాకు నెలానెలా ముప్ఫై రూపాయ లివ్వడానికి అంగీకరించారనీ అతడు తన ఉత్తరంలో పేర్కొన్నాడు.

నా కళ్లను నేను నమ్మలేకపోయాను. నమ్మడానికి వీలున్న విషయం కాదిది. కానీ యిదేదో అయాచితమైన సహాయం. లభిస్తే సంతోషమే గానీ, లభించకపోతే విచారం వుండదు. అందుకనే, ఆ సహాయం మాట నిజమే అయితే డబ్బును నీ చిరునామాకు పంపే ఏర్పాటు చేయమని ఆ యువకుడికి ప్రత్యుత్తరం వ్రాశాను.

సముద్రంలోపడి మునిగిపోతున్నవాడు ఏ మాత్రం కర్రముక్క చేతికి దొరికినా దాని సాయంతో బయటపడాలని ఆశిస్తాడు. జీవికి ఆశ సహజం. మనమూ వేచిచూద్దాం. బదులు రాస్తావుగదూ...'

అదీ శారత్యా ఉత్తరం.

అందులో ఆయన వ్రాసినట్లు రెండు వారాలు తిరగకముందే సేవాసమితి కార్యదర్శి దగ్గిరనుంచి తనకు మొదటి మనియార్డరు వచ్చింది.

ఆ తరువాత ఒక్కనెలకూడా తప్పిపోకుండా తనకు యం. ఓ.లు అందుతూ వచ్చాయి.

మధ్యలో ఒకసారి తాతయ్య చనిపోయి నప్పుడు తనావిషయం తెలియజేస్తూ జాబు వ్రాసింది. ఐతే మనియార్డర్లు ఆగిపోలేదు. కోర్సు పూర్తయిందని తెలుపుకున్న రెండు మాసాలకు అవి ఆగిపోయాయి.

ఐతే ఆ మానవసేవా సమితిని గురించి కొన్ని సందేహాలుమాత్రం తనలో అలాగే వుండిపోయాయి. నెలనెలా తనచేతికొస్తూ వుండిన మనియార్డర్లు ఒక్క చోటనుంచీ వచ్చినవిగావు. ఒక నెల నెల్లూరునుంచీ, మరొకనెల హైదరాబాదునుంచీ, యింకొక నెల బెంగుళూరునుంచీ యిలా అవి దేశం నలుమూలలనుంచీ వస్తుండేవి. సమితి కార్యాలయం యిలా నిరంతర దేశపరిభ్రమణం సల్పడంలోని అంతర్యమేమిటో తనకు బోధపడేదిగాదు. మళ్లీ ఆశ్చర్యమేమిటంటే మనియార్డరు కూపన్లమీది దస్తూరిలోమాత్రం కించిత్తు విభేదమైనా పొడనూపేదిగాదు. ఈ చిదంబర రహస్యమేమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో తను రకరకాలుగా వాకబుచేసి చూచింది. ఐతే ఆమానవసేవా సమితియొక్క ఆచూకీ తెలిసినవాళ్ళెక్కడైనా తనకు తటస్థించలేదు.

* * *

"నేనెక్కడున్నాను?" నూతిలోనుంచి వెలువడినంత నీరసంగా, ఆప్రశ్న అస్పష్టంగా వినిపించింది.


"ఇక్కడేవున్నారు......" మృదువుగా ప్రత్యుత్తర మిచ్చింది నీరజ.

రోగి నీరజవైపు పరకాయించిచూచాడు. సిద్ధహస్తుడైన శిల్పిమలిచి నిలబెట్టినట్టున్న చలువరాతి విగ్రహంలావుంది నీరజ. మృత్యువక్త్రంలోనుంచి బయటబడిన ఆ దుర్బలుడికి బ్రతకడంలోని మాధుర్యమంతా మూర్తి కట్టి తనముందు ప్రత్యక్షమైనట్టుగావుంది నీరజ. అంతలో అతడికొక భ్రమకలిగింది. తనునిజంగా బ్రతకలేదేమో! చనిపోయి స్వర్గానికి వెళ్ళగా అక్కడొక అశ్వినీదేవత తనకు శుశ్రూష చేస్తున్నదేమో...

అతడొకసారి కళ్ళుమూసుకొని మళ్లీ తెరిచాడు. ఈ వలావలకు చూపులుత్రిప్పి గదిలో వెలుగుతున్న విద్యుద్దీపాన్ని బట్టి, బల్లపైన ప్రశాంతగంభీరమైన వదనముద్రతో సాక్షాత్కరించిన బుద్ధభగవానుడి విగ్రహాన్ని బట్టి నీరజ కనురెప్పల కదలికనుబట్టి తనింకా మానవలోకంలోనే వున్నట్టు నిర్ధరించుకోగలిగాడు.

అతడి కళ్లల్లోనుంచి కృతజ్ఞత తెరలు తెరలుగా వెల్లువికి చూపులతో కలిసివచ్చి నీరజను అభిషేకించింది. రొమ్ముపైన వాడిపోయిన తోటకూరకాడల్లా పడివున్న అతడి చేతులు మెల్లగా పైకికదలి ఒకదానినొకటి నమస్కరించాయి.

దగ్గరగావచ్చి అతడి నా ప్రయత్నం నుంచి వారిస్తూ "అలాటిపనిచేసి మీరు నన్ను



రేపటివరకూ ఉండదా ఏం?

—యం. సుధాకర్ (వరంగల్)

బాధించగూడదు. మీరు నమస్కరించవలసినంతటి గొప్పతనం నాలోలేదు" అంది నీరజ.

"ప్రాణమిచ్చినవారికి నమస్కరించడంలో తప్పలేదు. మీ రెవరో నాకు తెలియదు. ఆ మురికి కూపంలోనుంచి నేనిక్కడికెలావచ్చానో తెలియదు. మీరు నిల్చునే వున్నారు. దయచేసి ఆ కుర్చీపైన కూర్చోగూడదూ..."

"కూర్చుంటానుగానీ మీరు నేను చెప్పినట్టు వినాలి..."

అతడు నవ్వాడు "ఏం చెబుతారు మీరు! మీరేంచెప్పినా నేను వింటాను. కానీ మీరెవ్వరో నన్ను తెలుసుకోనివ్వక పోవడం మీకు ధర్మంకాదు..."

నీరజగూడా నవ్వింది. "ధర్మాధర్మాల వివరాలనుగురించి తీరిగ్గా చర్చించుకోవచ్చు. ఇది మీరు మాట్లాడ్డానికి సమయంకాదు. ఇప్పుడు మీరు బాగా విశ్రాంతి తీసుకోవాలి..."

నీరజవైపుగాకుండా అతడు పైకప్పుకేసి చూస్తూ చెప్పక పోలేదు. "మీరు నన్ను దీర్ఘ విశ్రాంతిలోనుంచి లేపారు. ఇప్పుడు మళ్ళీ విశ్రాంతి తీసుకోమని చెబుతున్నారు. మీతో నేను చాలా విషయాలు చెప్పుకోవాలి. ఇలా నేను రక్షింపబడటానికి యిది రెండోసారి. వింటే మీ కాశ్చర్యం గా వుండొచ్చు. భూమిపైన పుట్టడానికి మునుపే చనిపోయి వుండవలసిన దురదృష్టవంతుణ్ణి నేను..."

"పోనీ, సంగ్రహంగాచెప్పి ముగించండి" అంటూ కుర్చీని మంచందగ్గరికి జరుపుకుంది నీరజ.

"ఆ దురాగతాన్ని భ్రూణహత్య అంటారు! మా అమ్మకు తన చిన్నతనంలో ఎప్పుడో బొమ్మలపెళ్ళిలాంటి పెళ్ళితతంగం ఒకటి జరిగింది. పెళ్ళిజరిగిన రెండేళ్ళకే వైధవ్యం ప్రాప్తించింది. బందిఖానాలాంటి యింట్లో, తనవాళ్ళ కామె వెట్టిచాకిరీ చేస్తుండగా పదేళ్ళు కడిచిపోయాయి.


అప్పుడే నేనామెకడుపులోపడ్డాను..."

అక్కడ కాసేపాగి అతడు నీరజ వైపు చూశాడు. "చెప్పండి" అంది నీరజ.

"మీరర్థం చేసుకోగలరు గనుక విశేషించి చెప్పడంలేదు. తనను నమ్మించిన వ్యక్తిపాదాలుపట్టుకుని ఆమె ఎలావిలపించివుంటుందో మీ రూహించుకోగలరు. అతడు గూడా ఆమె నీ అపాయంనుంచీ రక్షించాలనుకున్నాడు. ఆ వూళ్లో పంతులుగారు గొప్ప వైద్యులని ప్రతీతి. అతడు వెళ్లి పంతులుగారిని యాచించాడు. ఎందుకోసమనుకుంటున్నారు-గర్భస్రావానికి మందుకోసం!

భగవత్స్వరూపులన్న విశేషణం ఈలో

(45-వ పేజీ చూడండి)



రాత్రిపూట అడివిలో కూసే రైలుఇంజన్‌లా అరిచింది గడియారం. ఉలిక్కిపడి దుప్పటివిదిలించి లేచికూచున్నాడు సంజీవిరావు. ఆరున్నర చూపెడుతూంది వెధవ గడియారం.

'అయిదున్నరకు అలారం పెడితే ఆరున్నరకు మోగుతూంది!...హుం...గడియారం కూడా చెప్పినమాట వినడంలేదు. తాను మాత్రం చచ్చినట్లు దానిమాట వినాలి'—ఈ మాత్రం ఆలోచించేసరికే దుప్పటిముడవడం అయిపోయింది.

అలారం ఆమెనుకూడా లేపింది; కాని ఆమె లేవలేదు. ఆమె లక్ష్మి.

సంజీవిరావు బాత్‌రూములోకి వెళ్ళాడు. పళ్ళుతోముకుంటుంటే గుర్తొచ్చింది. అమూలపన్ను తీయించి కొత్తది కట్టించుకోవాలని—రెండు నెలలనుండి అనుకుంటున్నాడు. ఏదీ—

అంట్లగిన్నెలతో పనిమనిషి ప్రవేశించింది. చిన్నప్పటి సైన్సుపాఠాలనూ, పత్రికలలో ప్రకటనలనూ మర్చిపోయిన సంజీవిరావు ఆషామాషీగా పళ్ళు తోముకొని ఇవతల కొచ్చాడు.

పడగ్గదిలో కెళుతూ చూస్తే ఇంకా కమల నిద్రపోతూంది. అదృష్టవంతురాలు! అయినా రేపొద్దున పెళ్ళయితే ఇలాపడుకోవడం కుదురుందా?

రేజర్‌లోకి బ్లేడుని అమరుస్తూ కేకేశాడు సంజీవిరావు.

"లక్ష్మీ! లక్ష్మీ!"

"ఏమండీ?"

"నా అద్దం ఏదీ—?"

"నిన్న నాని పగలగొట్టాడండి!"

"ఊఁ......"

"ఆ పెద్దద్దంలో చేసుకోండి."



ఎదురీత

వాకాటి పాండురంగారావు

"చిత్తం!...కొంచెం వేడినీళ్ళు..."

లక్ష్మి మాట్లాడకుండా వేడినీళ్ళు తెచ్చి-చ్చి వెళ్ళింది. వాతావరణంలో ఏదో బాగులే దనిపించింది సంజీవిరావుకు. దానంతట అదే తెలుస్తుందిలే—అనుకున్నాడు.

షేవింగు మొదలెట్టాడు. అద్దం ముందు కూచోగానే పనితనం వస్తుంది. నాలుగు దశాబ్దాలనుండి చూసుకుంటున్న మొహమే ఏరోజుకారోజు క్రొత్తగా వుంటుంది. 'నిజం తన చిరునవ్వుని అద్దంలో చూచుకుంటే కనపడేది — అందం' అన్నాడు టాగూరు. కుడిచెంపమీదుగా రేజర్ లాగుతున్నపుడు చెవిమీద సన్నగా తెల్లగా కన్పించింది. సబ్బు నురగే కాదు అనుకుని తుడిచాడు. ఊహూం ...... పోలేదు. కొత్త వేన్నీళ్ళ తా-టి తువ్వాలుతో తుడిచాడు. ఆ తెల్లగీత అలాగే వుంది.

'ఓంయా సంజీవిరావూ! ఇర్వాన్ని మాసి పోదా కజ్జావనుకుంటే ఎలాగోయ్...అది సబ్బు నురగకాదు; నెరవనున్న నెరిసిపోతున్న సీజాతు' — అనుకున్నాడూ సంజీవిరావు; నవ్వుకున్నాడు.

గడ్డం తెగింది.

అయ్య బాబోయ్ - అప్పుడే తల నెరిసిపోవడమా! శీర్షాసనం వేస్తే జుత్తు నల్లగా వుంటుం దంటారు. పొద్దున్నే లేచి వేస్తే బావుంటును—

పాల సముద్రంమీద ఎర్ర కలువలా సబ్బు నురగమీద నెత్తురుబొట్టు తేలింది. ఇరవై నాలుగ్గంటల కోసారి బ్లేడుతో కలిసి ఆడుకుంటూండడంవల్ల చర్మం మొద్దు బారిపోయింది. నొప్పి తెలియడంలేదు నెత్తురు చుక్కని తుడిచాడు సంజీవిరావు. ఎడమ చెంప కానిచ్చాడు. మళ్ళీ కుడివైపు ఎర్ర బొట్టు తయారయింది. ఎప్పటికప్పుడే ఇంత బోరిక్ పవుడరూ అదీ తెచ్చి ప్రథమ చికిత్సకొక్కావలసిన మందుల పెట్టెలాంటిది తయారు చేయాలని అనుకోవడం...కానీ—

నిశ్శబ్దంలో మునిసి నాలుకలా 'పొంయ్' మంది మైలు కవతలవున్న మిల్లు సైరన్.

బాబోయ్! ఏడూ నడిచేనయిపోయింది!

సంజీవరావ్ పరుగెత్తుకు వెళ్ళాడు స్నానాలగది దగ్గరికి.

"లక్ష్మీ! లక్ష్మీ! నీదయిందా...టైమయిపోతూంది."

"అయిపోయిందండీ!" తడిబట్ట చుట్టుకుని బయటికి వచ్చింది లక్ష్మి. ఆమె వైపు చూశాడు. ఆ నిమిషంలో ఇరవై ఏళ్ళు వెనక్కు వెళ్ళాడు. లక్ష్మి-అప్పుడు సన్నగా విద్యుత్కిరణంలా వుండేది; ఇప్పుడునిండుగా పున్నమదీపంలా వుంది.

"అలా చూస్తారేమిటి క్రొత్తగా-స్నానం కానివ్వండి."

"స్నానం కానిచ్చి వస్తున్నాడు సంజీవిరావు. కమల ఎదురయింది.

"ఏమమ్మా...ఇంత ఆలస్యంగా లేచావేం?"

"రాత్రి ఏదో చదువుకుంటూ పడుకునే సరికి పన్నెండు దాటింది నాన్నా—"

"మరయితే నీకు బడి టైమయిపోదూ-"

"ఆ...అయితే అవనీ నాన్నా - వెధవ టైము! మహా అయితే ఓ సెలవు కాగితం పడేస్తే సరి" అని ఆవలిస్తూ స్నానాలగదివైపు సాగింది కమల.

పుస్తకాలు చదవడం - వెధవ టైము - సెలవు కాగితం - ఇవన్నీ ఎక్కడో విన్నట్లనిపించాయి. బట్టలు తొడుక్కుంటున్న సంజీవిరావుకు. హుఁ! 'టై'కి ఎన్ని ముడతలో...ఇస్త్రీ చేస్తే బావుండును. ఇస్త్రీ పెట్టెకూడా వుంది. కాని చేతిగడియారం ఎనిమిది చూపుతూంది.

"టిఫిన్ ఇదిగో..."

"లక్ష్మీ..."

"ఏమండీ..."

"ఏదోలా వున్నావే-?"

"ఏమీ లేదండీ!"

"నాని లేవలేదూ?"

"ఇదిగో వెళ్తున్నా...లేపుతాను."

ఉప్మా, కాఫీ అయ్యాయి. ఉప్మాలోని కరివేపాకు ఘుమఘుమ, నేతిలో వేగిన జీడిపప్పుల రంగు, రుచి, వేడికాఫీలోని వెచ్చటి కమ్మదనం-కసుక్కుమండానే తినడం, తాగడం అయింది.

"నాన్నా! ఇదిగో పేపరు!" అంటూ నాని వచ్చాడు.

"ఒరేయ్! ఇంతసేపట్రా పడుకోవడం? నేను చూడు—అప్పుడే స్నానం కూడా చేసేశాను-"

"నువ్వు ఆఫీసుకు వెళ్తావు నాన్నా."

"అరి వెధవా!" అని వాడినెత్తుకుని ముద్దాడబోయిన సంజీవిరావుకు తెల్లచొక్కా-దాని మడతలూ పాడయిపోతాయన్న తెలివి కలిగి వాడిని క్రిందకు దింపేశాడు. "ఊఁ! అయితే నేను ఆఫీసుకు పోతాను గనుక ముందు లేచానంటావ్...మరి నువ్వు రేపు విజయదశమినుండి బళ్లోకి వెళ్లాలే-అప్పుడూ?"

"ఊఁ...వెళ్తా నాన్నా."

"గుడ్! వెరీగుడ్!" కోటు తొడుక్కున్నాడు సంజీవిరావు. 'షూ'లయితే లేసులు వేసుకుంటూ కూచోవాలని 'స్లిపాన్స్' తొడుక్కున్నాడు.

"నాన్నా! మరే...నన్ను ఎగ్జిమిషన్‌కి తీసుకెళ్తానన్నావూ-ఎప్పుడూ-"

"ఎగ్జి'మిషన్ కాదురా నానీ! ఎగ్జి'బిషన్! ఏదీ-అను-ఎగ్జి'బిషన్!"

"ఎగ్జిబిషన్"

"ఆ...అదీ—భేష్! రోజూ కాసేపు కూచుని ఇంగ్లీషు అదీ చెప్పించినా బావుండును...అయినా కమల టీచరు కదా-చెప్ప కూడదూ?"

"మరి ఎప్పుడువెళ్దాం నాన్నా?"

"ఓ! వెళ్దాంలేరా అబ్బాయ్. ఆదివారం నాడు వెళ్దాంలే" ఆదివారంనాడాఫీసులో ఓ స్పెషల్ రిపోర్టు ఏడవ్వాలన్న విషయం సంజీవి

ఎదురీత

రావుకు జ్ఞాపకం లేక కాదు. ఆదివారం మామూలుగా ప్రపంచంలో అన్ని ఆఫీసులకూ సెలవురోజు కదా అని-

"నాన్నా! నాకా డిజైన్ల పుస్తకం తెచ్చిపెడతానని పదిరోజులక్రింద చెప్పావు?"

"ఇవాళ తెస్తాన్లేవే! మీఅమ్మేదీ— లక్ష్మీ! వెళ్తున్నా! ఇవాళ మధ్యాహ్నం హోటలులో భోజనం చేస్తా. కేరియర్ పంపకు."

సంజీవిరావు హుటాహుటిగా నడిచివెడుతున్నాడు. బస్‌స్టాండ్ గడియారం నాలుగు ముఖాలూ కలిసి సరాసరిగా ఎనిమిదీఇరవై రెండు చెప్పాయి. అది చూచిన సంజీవరావ్ ఇంచుమించుగా పరుగెత్తాడు. ఎనిమిదీ ముప్ఫయొకటికి అవడిస్టేషన్ చేరిన సంజీవిరావు నోరూ ముక్కూ కలిసి పని చేస్తున్నాయి. అమ్మయ్య ఇంకో పదినిముషాల్లో రైలురావాలి- గంట ప్రయాణం- సెంట్రల్లో దిగి బస్సెక్కాలి- మౌంట్‌రోడ్ వెళ్ళాలి- ప్రక్కకుతిరిగి, కిళ్లీదుకాణం ముందున్న దినపత్రిక తాలూకు పోస్టరు చదివాడు.

"బాంబు ప్రేలుడు- దిగువ కొరియాలో. ప్రధాని హెచ్చరిక; భాషా వైషమ్యంపై"

సంజీవిరావు విసుక్కున్నాడు. తనకు రోజూ ప్రొద్దున్నే పత్రికవస్తుంది. కాని ఇలా పోస్టర్లు చదవడం, ట్రెయిన్‌లో ఎవరిదగ్గరో పుచ్చుకుని చూడడం- తప్పదు.

* * *

"సంజీవి...'సూపర్ సీడ్'లో 'సి' లేదయ్యా—'ఎస్'వుందీ, అని చెప్పలేదూ?" అన్నారు మేనేజరు వెంకట్రమణయ్యగారు తెల్ల తలపాగా క్రింది నల్లకళ్ళజోడుగుండా చూస్తూ—

"అలాగేనండి!"

"ఇదంతా నరాల బలహీనతవల్ల వస్తుందోయ్! అందుకేమీలేదు, ఒక్క డోసు 'నేట్రంమూర్ - 30 ఎక్స్' వేసుకో! ఆ తర్వాత నన్నడిగిచూడు"

వెంకట్రమణయ్యగారి ప్రక్కవాటాలో హోమియోపతి డాక్టరున్నారు. ఒకానొక రోజు చదువుకోడానికేమీ లేకపోతే హోమియోపతి పుస్తకం చదివేసి వారం రోజులు తిరక్కుండానే ఓ పెట్టెమందులు తెప్పించేశారు వెంకట్రమణయ్యగారు. అప్పటినుండీ స్పెల్లింగులు సరిగ్గా రాయడానికి-అధికారులమీద నిర్లక్ష్యం తగ్గడానికీ- చేతివ్రాత అందంగా కుదరడానికీ- వేగంగా నడవడానికీ కూడా ఆయనహోమియోపతీమందులు ఇవ్వడం మొదలు పెట్టారు. తాను చెప్పి ఎవరయినా కొనక పోయినట్టు తెలిస్తేచాలు మరుసటి రోజు తానే ఆ మందు పట్టుకొచ్చి యిచ్చి పావలావో అరణాలో అడిగి పుచ్చుకునేవారు.

సంజీవిలాటి వారు — పన్నెండుమంది ఆయన చేతిక్రింది గుమాస్తాలు—చచ్చినట్లు పావలా ఇచ్చి-ఆమందు నందుకునేవారు. కాస్త తలనొప్పి అదీ వుందనీ సంజీవిరావు కంటి డాక్టరుకో ఏమో, కళ్లజోడుకో పాతికా తగలెట్టి తొడుక్కుంటే—"యూఫ్రేసియా, రూటా-జి, లాటి హోమియో మందులుండగా కళ్లజోడు వేసుకుంటావా? ఇసీ! 'హానిమాన్' ఏమంటాడో తెలుసా?" అని చెవినిల్లు గట్టుకుని పోరి నెలరోజులు తిరక్కుండా సంజీవిరావుకూ- సులోచనాలకూ విడాకు లిప్పించి తాను మందు లివ్వడం మొదలెట్టారు వెంకట్రమణయ్యగారు. తత్ఫలితంగా సంజీవిరావు ఆఫీసు గుమ్మంలో అడుగుపెట్టగానే కళ్లజోడు తీసి కోటుజేబులో పెట్టుకుని లోపలికి అడుగువేసేవాడు. కళ్ళజోడు లేకుండా ఆఫీసు కాగితాలు చదువుతుంటే బూజుబూజుగా అనిపించేది. రాస్తుంటే కళ్ళు నొప్పెట్టేవి. నీళ్ళు వచ్చేవి. వెంకట్రమణయ్యగారు మందు మార్చి మందు ఇస్తుండేవారు, పావలాలు వసూలు చేస్తుండేవారు. "ఇది నీకోసం ప్రత్యేకం కలకత్తానుండి తెప్పించానోయ్!"—అనీ, "ఏమనుకున్నావో...ఇది ఒర్జినల్ 'బోరిక్ టాఫిల్' వాళ్ళది! 'బోరిక్ టాఫిల్' అంటే ఏవిటో తెలుసా—మీ మిల్కుటాఫీ కాదుస్మీ!" అనీ-ఘట్టిగా పెద్దగా ఘల్లున నవ్వి—అమెరికా అనే దేశంలో సదరు బోరికుడూ-టాఫిలుడూ అన్న మిత్రులిద్దరూ ఆ యుగంలో పుట్టారననీ, వాళ్ళు పూర్వం అశ్వినీ దేవతలనీన్నీ, చరకుడూ ధన్వంతరీ వగైరా గుంపంతా వాళ్ళ దగ్గర కంపౌండర్లుగా పనిచేస్తుంటా రనిన్నీ—వెంకట్రమణయ్య వివరిస్తుంటే—ఆపైన రాసిన వాక్యం వాక్యమేనా, తాను రాసిందేనా అని నమ్మలేక

ఆస్పత్రికి వెళదామనుకున్న ఓ పెద్దమనిషి దారినపోయేదానయ్యని పిలిచి "అయ్యా, ఆస్పత్రికి దారి ఎటువైపు" అని అడిగాడు. అతగాడు ఓ రెండు నిమిషాలు ఆలోచించి "కళ్లు మూసుకొని పదిగజాలు తిన్నగా నడవండి. కళ్లు తెరిచేసరికి ఆస్పత్రిలో వుంటారు" అని జవాబిచ్చాడు.

—గో. వా. వా. (విశాఖ)

కళ్ళతో కుంటుంటేవాడు సంజీవిరావు. వెంకట్రమణయ్యగారి నల్లకళ్ళజోడుని తీసి కొనడియన్ ఇంజన్ క్రింద పెడదామనికూడా అనిపించేది.

పనిచేస్తున్న గుమాస్తా వెనుకవచ్చి, మాట్లాడకుండా నిల్చోవడం వెంకట్రమణయ్యగారి మరో అలవాటు ఆయన నీడ తనముందున్న కాగితం మీద పడుతుంటే—గుమాస్తాకు—జవాబు తెలియక పడికొట్టుకుంటున్న పరీక్షా విద్యార్థి వెనుక వాచర్ నిల్చున్నట్లు — అన్పించేది.

"సంజీవిరావుగారూ – మీకు రెండు ఉత్తరాలొచ్చాయి–" అందుకున్నాడు సంజీవిరావు.

ఒకటి కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతున్న చంద్రశేఖరంది—"...ఈసారి నెలం జీతంతోబాటు హాస్టల్ ది కాకుండా మరో పాతిక ఎక్కువ పంపించు నాన్నా! మొన్న పిక్నిక్ వెళ్ళినప్పుడో స్నేహితుడి కెమెరా పట్టుకెళితే క్రిందపడి ఒక మర విరిగింది. దాని 'రిపేరింగ్'కి ఇరవై అవుతుందిట..." అంటే మామూలు చందాఇరవైతో ఇంకో పాతిక!

రెండో ఉత్తరం—"...పెద్దదయిన ఆడది ఉద్యోగం చేయడం శాశంతిగా నచ్చదు. కమలకో సంబంధం చూశాను. కాబట్టి త్వరగా వచ్చి ఇది తేల్చుకుని వెళ్ళు...కోడలికి అత్తక్కులు..." అంటారు నాన్నగారు.

ఈ ఉత్తరాలను రెండేసిసార్లు చదువుకున్నాడు సంజీవిరావు. మడిచి జేబులో పెట్టుకుంటుండగా ఏదో చేతికి తగిలితే బయటికి తీశాడు. మూడు రోజులనుండి పోస్టుచెయ్యాలనుకుంటున్న కవర్ నవ్వింది.

"ఆ డి. ఓ. ఏమయింది?" వెంకట్రమణయ్యగారి నీడ సంజీవి రావు వీపు మీద పడింది.

"ఇదుగో అయిపోయిందండీ—"

"ఒంటి గంటకు డైరెక్టర్ కేంప్ వెళ్ళిపోతున్నారని తెలుసుగా—"

గడియారం ఒకటి కొడుతూండగా సంతకం చేయించిన డి. ఓ. ఉత్తరంతో బయటపడ్డాడు సంజీవిరావు.

ఆఫీసునుండి నడిచాడు.

నడిచి – నడిచి – చాలదూరం వెళ్ళాడు.

ఉలిక్కిపడి చేతిగడియారం చూసుకుంటే రెండున్నరయింది ఒంటిగంటనుండి రెండుదాకా 'విశ్రాంతి' సమయం.

'నేడే! 8-8-60! నేడే విడుదల – మహోత్తర బృహత్తర...'

ఓ ఇల్లంత బోర్డుమీద మనుషులంత అక్షరాలు చూశాడు సంజీవిరావు!

మార్చి మూడవ తేదీ!

నాన్నా! తానెంత మతిమరుపు మనిషయిపోయాడూ! ఇరవైయేళ్ళ క్రితం – ఈరోజు – లక్ష్మి తన జీవితలక్ష్మి అయింది. ఈ ఇరవైయేళ్ళలోనూ ప్రతి మార్చి మూడవ తేదీనాడూ తాను ఆఫీసుకు సెలవు పెట్టేవాడు. తనూ లక్ష్మి పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూలా అయి, మళ్లీ ఆ మొదటిరోజు ఆనందంకోసం వెయ్యి వలలు విసిరేవారు. ఆ అనుభూతికోసం పదివేల అయస్కాంతాలతో ప్రయత్నించేవారు. ఆ రోజు ఇంట్లో వంట మానేసి హోటలు కెళ్ళేవారు. సినిమాకో, బీచికో, జూకో, బోటుషికారుకో వెళ్ళేవారు. మొదట కమల, శేఖరం, తర్వాత నానివస్తే వాళ్ళందరితో కలిసి ఆరోజు వొక ఉత్సవదినంగా గడిపేవారు. మార్చి మూడు! సంవత్సరంలో అన్ని పండగలలోనూ పెద్దదయిన పండగరోజు!...పొద్దున లక్ష్మి ముభావానికి కారణం ఇదన్నమాట...పోనీ తానయినా చెప్పివుండకూడదూ – హుం! తను ఇంటిదగ్గర అన్నిసార్లు వెధవగడియారం కేసిచూశాడే ఒక్కసారి కేలెండరువైపు చూసివుంటే – ఇంతెందుకు – ఆఫీసుకు వచ్చి తారీఖువేసి ఇన్ని ఉత్తరాలు రాశాడు కదా అప్పుడుకూడా గుర్తుకురాలేదే-ఏమయిపోయ్యాడు తను? ఏం వచ్చేసింది తనలోకి? జారిపోవుతున్నట్లనిపిస్తూంది ఏమిటి?

సంజీవిరావు మధనపడ్డాడు.

మూడయింది. కనీసం ఇప్పుడయినా తిన్నగా ఇంటికివెళ్లి లక్ష్మిని ఎక్కడికయినా తీసుకువెళితే బాగుంటుంది.

చెమటపోసుంటే కోటుబొత్తాలు పైవి రెండూ విప్పాడు. కుడిప్రక్కకు బరువుగా వాలింది కోటు. ఆ ప్రక్కజేబులోని ఉత్తరాలు రెంటిని ఎడమజేబులోకి సర్దాడు సంజీవిరావ్.

ఆ కవర్ పోస్ట్ చేయాలి. అబ్బాయికి డబ్బు ఎక్కువ పంపాలి-ఇవాళ మనియార్డర్ టైమయిపోయింది. వచ్చే ఆదివారంతో కలిపి రెండురోజులు సెలవు పెట్టి వెళ్ళి నాన్నగారు రాసిన ఆ సంబంధం ఏదో చూసి రావాలి. ఇక్కైముంజే పన్ను కట్టించుకోవాలి. అన్నట్టు ప్రథమ చికిత్స పెట్టె తయారుచేసుకోవాలి. అసలు రేపొద్దున్నుండి ఇంకా ముందు లేవాలి. శీర్షాసనం వేయాలి. పేపర్ చదవాలి. త్వరగా లేవాలంటే ఆ గడియారం రిపేర్ చేయించాలి లేదా క్రొత్తది కొనాలి.

బస్ స్టాపులో నలభై నిమిషాలు నిల్చున్నాడు సంజీవిరావు. ఒక్క బస్సు రాలేదు. మూడున్నర కావస్తూంది. టాక్సీలో వెళితే? అయ్య బాబోయ్, ఇరవై రెండు మైళ్ళకూ ఏ పదిరూపాయలో అవుతుంది. ఆ పదికింకో పదో పదిహేనో కలిపితే లక్ష్మికో చక్కటి చీరవస్తుంది. అసలు ముందు తను ఇంటికెళ్ళి లక్ష్మికి చెప్పుకోవాలి. మూడున్నర అయిపోయింది.

సంజీవిరావ్ కు కోపంవచ్చి, వాచీని విప్పి కోటులోపలి జేబులోకి కుక్కాడు.

> క్లాసులో ఒకకుర్రాడు అతిగా వాగేస్తుంటే మేష్టరు తను చెబుతున్న పాఠం నిలిపేసి ఇలా అడిగాడు:—
>
> "ఏరా వెధవా! ఈ క్లాసులో పాఠాలు చెప్పేది నేనా నీవా?"
>
> కుర్రాడు:–"మీరే నండి."
>
> మేష్టారు:–"మరెందుకైతే గాడిదలా అరుస్తున్నావ్?"
>
> బాబు (విల్లివాక్కం)

బస్ స్టాపులో జనమే లేరే! ఓహో – ఇవాళ ఆఫీసులున్న దినం – ఇంకా ఆఫీసులొదిలే వేళ కాలేదు. అన్నట్టు తను మేనేజర్ కి ఫోన్ చెయ్యొద్దూ – ఏదో ఒక అబద్ధమాడాలి.

లక్ష్మికి ఏదయినా కొనాలి. ఆమె నెక్కడకయినా తీసుకు వెళ్లాలి.

కమలకు డిజైన్ పుస్తకం కొనాలి.

నానికి ఎగ్జిబిషన్ కొనాలి.

తనకు—??

ముందు ఫోన్ చెయ్యాలి.

రోడ్డుదాటి అవతలి హోటల్లో వున్న ఫోన్దగ్గరికి వెళ్ళాడు సంజీవిరావు.

"...అవును...హఠాత్తుగా అరటిపండు తొక్క మీద కాలు వెయ్యడంవల్ల జారి క్రిందపడ్డాను. కొద్దిగా దెబ్బతగిలింది. టాక్సీమీద ఇంటికి వెళ్ళిపోతున్నాను పర్మిషన్ కావాలి..."

"...ఓహో...చిన్న దెబ్బ కదూ... చర్మం కొంచెం ఊడిందా? ఏమీలేదు... 'ఆర్నికా టించర్'ని పైన రుద్ది లోపలికి 'లెడంపాల్ స్టర్' పుచ్చుకో...ఊ...వెళ్ళు వెళ్ళు...ఎర్రపుండు పడ్డతర్వాత కావలిస్తే 'బెలడోనా-మూడు ఎక్స్'..."

సంజీవిరావు ఫోన్ పెట్టేశాడు. పెడుతూ రోడ్డుమీదకు చూశాడు. గంటసేపటినుండి తాను ఎదురుచూసిన బస్సు, స్టాపులో ఆగకుండా అర్జునుడి రథంలా వెళ్ళిపోతూంది.

కుర్చీలో కూర్చుండిపోయాడు.

"ఏం కావాలి సార్?" అని పట్టేని వల్లించి నిల్చున్నాడు సర్వర్.

"ముందు రెండు బాదుషాలూ, ఒక ప్లేటు పకోడాలూ, తర్వాత జీడిపప్పు రెండు పెసరట్లూ, ఉప్మా..."

"పార్సిలు కట్టమంటారా—?"

"కాదోయ్!"

హోటల్ గడియారం నాలుగుకొట్టింది.

—తలెత్తి ధీమాగా గడియారంవైపుచూసి నవ్వేశాడు సంజీవిరావు. ★

హరి వంశము

మధురాపర్వము-7

దీర్ఘ ప్రజాగరో భీతో
దుర్నిమిత్తాని దుర్మతిః
బహూన్యచష్టో భయదా
మృత్యోః క్లైత్యకరాణిచ ॥

—భాగవతం.

ఆ రాత్రి కంసునకు నిద్దుర పట్టలేదు. దానిని చూడగా అతనికి భయమైనది. తన్ను చూచుకొనగా భయమైనది. క్రీడాగారమును దర్శించివచ్చు వేళ, సాయంసంధ్యలో, దీర్ఘమైపడిన తననీడ అశిరస్కమై తనకు కన్పించినది. ఆ మాట తాను అంధకునకు చెప్పగా అతడు దిగ్భ్రాంతిని చెందినాడు. శాకునికుల మతములో ఇది మరణ సూచకము. ఇది ఒక దుర్నిమిత్తము. ఆసన్నమరణి అయినవానికి అతని నీడయొక్క శిరము కన్పించదట! ఇప్పుడు తనకు ఆ దుర్నిమిత్తము పొడచూపినది. కంసునకు ఏమియు తోచలేదు. అంధకుడు భగవంతుని ఆజ్ఞ అనుమానవచ్చి—కంసా! రేపు నీకు మరణము—అని చెప్పినాడు. వాడు పరమవృద్ధుడు. వానికి మతి భ్రమించినది. కంసుడు మతిభ్రమించిన వానివలె, తన మందిరములయందంతట క్రుమ్మరిల్లినాడు. ఆ దేవి ఏమిదేవి? ఆదర్శనము ఏమిదర్శనము? తన హృదయము రంగముగా ఆ మూర్తి విలయ నాట్యము లాడినది. కంసునకు అప్పుడు పుట్టిన తీవ్ర హృదయ స్పందనము ఇంతవరకు తగ్గలేదు. ఏదో ఒక్క మహాఘాతము తన హృదయక్షేత్రంలో వికటపదతాడన సంచారంగా మసలుతున్నట్లే అతనికి భయముకాని భయము, వేదనకాని వేదన అనుభూతం అవుతున్నది.

మందిరములయందు రత్నదీపములు వెల్గింపబడినవి. దాసదాసీ జనములు రాత్రివేళ జరుపవలయు పనులలో నిమగ్నులై మసలుతున్నారు. ప్రభువు దర్శనార్థము అస్తి వచ్చినది. ఆమె రాగా, కంసుడు ఆమెను ఆమె కానట్లు చూచినాడు. “నీవు ఎవ్వరవు?” అని ప్రశ్నించినాడు. “ప్రభూ! నేను అస్తిని. తమ భాగ్యాను” అన్నది అస్తి. “అస్తి! నీ ప్రక్కన ఆ వున్నది యెవ్వరు?” అని ప్రశ్నించినాడు కంసుడు. కన్నులకు చేతిని ఓరగా అడ్డము పెట్టుకొని చూచినాడు. అతనికి అస్తి ద్విత్వమై కన్పించినది. “అస్తీ! నీతో ఆ వున్నది యెవ్వరు?” అని మరల ప్రశ్నించినాడు. ఆ స్తికి ముందు అది పరిహాసకమన్పించినది. తర్వాత భయమైనది. “ప్రభూ! నే నే, నేను నాతో వున్నది యెవ్వరు? ఎవ్వరును లేరు?” అన్నది “అవును! అవును! ఎవ్వరును లేరు. ఎవ్వరును లేరు” అన్నాడు కంసుడు.

“ప్రభూ! మీరు ఇట్లా వున్నారేమి?”

“ఎట్లా వున్నాను! అస్తి! ఎట్లా వున్నాను.”

“ప్రభూ! మిమ్మల్ని చూడగా నాకు భయం అవుతున్నది.”

“అవునే! అస్తి! నన్ను చూచుకొనగా నాకే భయమౌతున్నది. ఈ భయమునకు అంతులేకుండా వున్నది. అస్తి! అంతులేకుండావున్నది.”

అస్తి ఏమీ మాట్లాడలేకపోయినది. మధురేశ్వరుడు ఈ భయమునుగూర్చి మాట్లాడటమే ఆమెకు విచిత్రమనిపించినది.

“ప్రభూ! మీకు దేనినిగూర్చి భయము?”

“అస్తీ! అందరు దేనిని గూర్చి అధికంగా భయపడుతూ వుంటారు?”

“నాకు తెలియదు.”

“ఎందుకు తెలియదు. తెలుసు. అందరికి తెలుసు. ప్రాణాన్ని గూర్చి భయపడుతూ వుంటారు. ఆ ప్రాణం ఏమైపోతుందో అని భయపడుతూవుంటారు. నాకూ అదే భయము. దేవకి ప్రథమగర్భము నాటినుండి అదే భయము. ఈ భయము చెఱసాలగా నేను బంధితుడనై పోయినాను. ఆ చెరనుండి విముక్తి ఎప్పుడు? విముక్తిఎప్పుడు?”

కంసుడు ఆ మాటలు అనినంతలో కింకిణీకుణుకుణునినదంగా విచిత్రమైనహాసంతో గూడిన ధ్వనులు ఆ మందిరము నందంతటా మాఱ్ఱోగినవి. కంసుడు అదిరిపడినాడు. “అస్తీ! నీకు ఆధ్వనులు, ఆ మహాహాసం వినబడుతున్నాయా? అస్తీ! నీకు ఆమూర్తి కన్పిస్తున్నదా? అహో! దర్శనము! తల్లీ! నన్ను నీవు అనుగ్రహిస్తున్నావా? శిక్షిస్తున్నావా? అస్తీ! నీవుపో! నీవుపో! నేను ఏకాంతం వాంఛిస్తున్నాను.”

అస్తికి ఏమీ తోచలేదు. ఆమెకు కంసుని ఈ విచిత్రప్రవర్తనము చూడగా భయమైనది. ఆమె ఏదో మాట్లాడబోయినది గాని మాట్లాడలేక పోయినది. ఆమెకు అప్పుడు ఏడ్పువచ్చినది. కంసుడు ఆమెవంక చుగుర్కొన చూచినాడు. మధురేశ్వరుని ఆజ్ఞ అది. ఆమె కదిలిపోయినది.

కంసుడు తిరిగి ఒంటరివాడైనాడు. అతనికి ఏవో విచిత్రమైన ధ్వనులు, భయంకరమైన ధ్వనులు విన్పిస్తున్నవి. ఒక్కప్పుడు పులులు గాండ్రించినట్లు, ఒక్కప్పుడు సింహములు గర్జించినట్లు, మరి ఒక్కప్పుడు ఏనుగులు ప్రాణాపాయసమయంలో ఘీంకరించినట్లు, ఆ ధ్వనులు విన్పిస్తున్నవి. ఒక్కప్పుడు సృగాలములు ఒకకొన్నివేలు ఒక్కచో చేరి అరిచినట్లు, ఆ ధ్వనులు తనకు భయోత్పాత హేతువులు అవుతున్నాయి. కంసుడు ఆ ధ్వనులను వినలేకపోయినాడు. రెండుచేతులతో చెవులను మూసికొన్నాడు. మూసికొని అప్రతిభుడై పోయినాడు. అంతా నిశ్శబ్దంగావుంది. చెవులు మూసికొనగా, ఎవరికైనా, ఒక్కఘోష విన్పిస్తుంది. పిహితకర్ణపుటకునకు విన్పించే ఆ ప్రాణఘోష తనకు ఇప్పుడు విన్పించడంలేదు. కంసుడు చెవులమీదనుంచి చేతులను తొలగించినాడు. తిరిగి తాను ముందువినిన భయంకర ధ్వనులన్నియూ సమాహారస్థితిని పొందినట్లు, ఆ ధ్వనులన్నీ ఏకమై ఉద్భటంగా విన్పిస్తున్నవి. కంసుడు మరల చెవులు మూసుకొన్నాడు. మరల అంతా నిశ్శబ్దము. చెవులు మూసికొనగా ప్రాణఘోష విన్పించుటలేదు.

హారీత శివశర్మ

హరివంశము

కంసుడు భయపడినాడు. ఆసన్నమరణి అయినవాడు చెవులు మూసుకొనగా, ప్రాణఘోష విన్పించదని నిమిత్తవేదులు అనడం వుంది. అది తలచుకొని కంసుడు మరీ భయపడినాడు. అతనికి తన ఆ మందిరమును చూడగా భయమైనది. అక్కడ నిలబడగా భయమైనది. కంసుడు అక్కడనుండి కదిలినాడు. తనకు తెలియకనే ప్రాప్తి మందిరములవైపు బయలుదేరినాడు. అస్తికన్న ప్రాప్తిధైర్యముకలది. ఆ ప్రాప్తి తనకు ధైర్యాన్ని నూరిపోస్తుంది.అనుకొని కంసుడు తనలో తాను నవ్వుకున్నాడు. ఆ నవ్వుగూడా తనకు వికటంగా విన్పించింది. తన నవ్వే తనకు వికటంగా విన్పించడం ఏమిటి? ఇది తన్ను చూచి తానే భయపడుతున్నట్లు వుంది. ప్రాప్తిమందిరములలో మణిదీపములు సూర్యచంద్రులను కట్టవేసినట్లు వెలుగుతున్నవి. ఇంకా చంద్రుడు ఉదయించలేదు. చీకటులు ముసురుకొని ఆకాశం నల్లని చీరమీద జలతారుచుక్కల అద్దకముగా అందం చేసుకున్నట్లువుంది. ఆ చీకటిని చూడగా కంసునకు దేవకికొడుకు నల్లనివాడు జ్ఞాపకం వచ్చినాడు. జ్ఞాపకం రావడం ఏమిటి? ఆ నల్లనివాడు తనమనస్సులో లేనిది ఎప్పుడు? అనుకున్నాడు కంసుడు. వాడు పుట్టకముందు, పుట్టిన తర్వాత ఎప్పుడు తనమనస్సు వానియందే భయాన్ని చేస్తున్నది. ఆ భయముతోకూడ వానియందే నివిష్టం అయివుంది. ఆ నల్లనివాడు ఎట్లా వుంటాడు? తాను ఇంతవరకు వానిని చూడలేదు. చూచినవారు చెప్పగా, వినగా, తనకు అతని స్వరూప మిట్టిదని అర్థముకాలేదు. ఆ రూపమును తనయెదుట ఎందరో వర్ణించినారుగాని, తనకు ధనురాగారపాలకులు, ధనుర్భంగానంతరము వచ్చి వర్ణించినతీరు బాగున్నది. "దేవ! అవధరించండి. ఒక్క ఆశ్చర్యం జరిగింది. మనవిల్లు పూజించు మందిరంలోనికి ఇద్దరు లోకాధిక తేజంగలవారు వచ్చారు. వాళ్ళు దేవనిభుల్లాగా వున్నారు. ప్రభు! వాళ్ళు నవయౌవనులు. మనోజ్ఞ విచిత్ర గంధమాల్యాలంకృతాంగులు. నీలపీతవాసులు. దివినుండి వసుధపైకి ఉరికిపడ్డట్లు ఏపరుతున్న వీరులు. ఒకరు ఎరుగనేరకుండా వచ్చారు. వారిలో ఒకని కన్నులు, స్వామి! తెల్లతామర రేకులు. అతడు నల్లవాడు" అని వారు చెప్పగా తనకు ఆ రూపం విచిత్రమై కన్నులముందు కన్పించింది. ఇప్పుడు తిరిగి ఈ నల్లని చీకటిని చూడగా ఆ రూపం కన్పిస్తున్నది. ఆ కుఱ్ఱవాడు తన జీవితంలో చీకటి వెదజల్లినాడు. వాణ్ణి ఎప్పుడు చూస్తానా? అని మనస్సు తహతహలాడుతున్నది. ఈ చీకటి ఆ వాడు తాల్చిన శరీర వర్ణాన్ని పోలివుంది. అతడు ధరించిన గంధమాల్యాలంకరణాలనుపోలి సువాసనలతో గుబాళిస్తున్నది. అన్ని దిశలలోను నిండిన వానిమహిమను గుబాళించడంకోసం బొడ్డుతిమ్మిరసముద్భవుడు చల్లిన మృగమదాన్ని పోలి, ఈ చీకటి సువాసనాభరితమై గగనవీథుల అన్నింటను వ్యాపిస్తున్నది, ప్రాప్తిమందిరాలలో ఆసువాసనలు గుబులుకుంటున్నవి. అగరుధూపాలతో ఆ మందిరంసువాసనలహరీపరీతం అయివుంది. కంసునకు, మధురేశ్వరనకు, ప్రాణనాథునకు, ప్రాప్తి ఎదురువచ్చింది.

కంసుడు "ప్రాప్తి!" అన్నాడు.

ప్రాప్తి "స్వామీ" అన్నది.

"ధనుర్మహాన్ని దర్శించడానికి మీ తండ్రి రాలేదు. ఆయన మగధేశ్వరుడు. మేము ఇప్పుడు ఆయనకు కన్పిస్తామా?" అన్నాడు కంసుడు.

ప్రాప్తి ధనుర్భంగోదంతాన్ని విన్నది. మధురలో ఆవృత్తాంతాన్ని విననివారు ఎవ్వరు? కంసునిమాటలు, అసందర్భములై ప్రాప్తికి విచారకారణములైనవి.

"ప్రభు! మా తండ్రి వచ్చి ఏమిచేస్తాడు!"

"అవును! అవును! ఆయనగూడ నాకువలెనే అవతారము ఎత్తినవాడు. ఆయనజీవితమునకు ఆధారము ఔద్ధత్యము. నా జీవితమునకు ఆధారము భయము."

"స్వామి! ఈ మాటలేమి! లోపలికి పోదాము రండి!"

ప్రాప్తి కంసుని చేయిపట్టుకొని లోపలకు తీసికొనిపోయినది. కంసుడు ఆమెవెంట నడచినాడు. ప్రాప్తిమందిరములో క్రీడా సరస్సు ఒకటి వున్నది. దానిని ఆమె తన మందిరమధ్యదేశమున నిర్మింపజేసినది. అది జలపూర్ణమై, నానావిధపుష్పముల చేత

ఆకీర్ణమై, కన్నులకు పండువుగావుంది. ఈ రాత్రివేళ మణిదీపముల కాంతిలో ఆ కృత్తికసరస్సు ఇరమ్మదములు కరిగి సేతుబంధనములై నిల్చినట్లు కన్పిస్తున్నది. ఆ సరస్సునుచూడగా కంసుడు కౌశికీదేవి కన్నుల కాంతులు జలరూపధారిణులై అక్కడ ప్రోవుపడినట్లు కన్పించినవి. దేవకీ కన్నకడుపు వల్లని కుఱ్ఱవాని తెల్లనినవ్వులు మెల్లములై, వెల్లువలు కట్టికట్టి, ఈసరస్సును చూచికొని, అందులో పిల్లన గ్రోవులు ఊదుతున్నట్లు ఉల్లసిల్లాయి. కంసునకు ఆ సరస్సును చూడగా అసహ్యమైనది. ఆ కాంతులను చూడగా అసహ్యమైనది. తన మనస్సు చీకటియందు పరిభ్రమిస్తున్నది. "ప్రాప్తి! ఆ దీపముల ఆర్పివేయించు. నేను చీకటిని వాంఛిస్తున్నాను" అన్నాడు కంసుడు. "అది యేమికోర్కె మహారాజా! ఈ సరస్సులో ఈ పుష్పాన్ని చూడండి. మగధనుంచి తెప్పించినాను" అన్నది ప్రాప్తి. "మగధ నుంచి తెప్పించినావా! వ్రేపల్లెనుండి ఎవరైనా తెచ్చిఇచ్చినారా? చూడు ప్రాప్తి! ఇది దేవకినవ్వు వికసించినట్లు వున్నది" అన్నాడు కంసుడు. ఆ పూవునుమూడగా సరస్సును దరిసినాడు. మణిదీపముల వెల్గులో ఆ సరోజలాల్లో తననీడ కన్పిస్తున్నది. కంసుడు ఆ నీడను చూచుకొన్నాడు. శిరస్సులేదు.

"ప్రాప్తి!"
"ఏమి! ప్రభు"
"ఈ ప్రతిబింబాన్ని చూడు!"
"చూచుచున్నాను! ప్రభు!"
"ఎట్లా కన్పిస్తున్నది."
"అద్భుతమ్ముపోలి కన్పిస్తున్నది ప్రభు!"
"అంతేనా!"
"అవును ప్రభు!"
"శిరస్సు కన్పిస్తున్నదా!"
"కన్పిస్తున్నది. ప్రభు"

"నేను గ్రుడ్డిని. ప్రాప్తి! ఆ తల నాకు కన్పించుటలేదు."

ప్రాప్తి తల్లక్రిందులైపోయినది. తిరిగి ఆ సరోజలాల్లో తన ప్రాణనాథుని ప్రతిబింబాన్ని చూచినది. ఆ ప్రతిబింబము సశిరస్కమై కన్పిస్తున్నది. "మధురేశ్వరా! తమరు ఏమి అవుతున్నారు?" అని కంఠంలో గాద్గద్యంతో ప్రశ్నించింది. "అదే! అర్థమగుటలేదు. ప్రాప్తి! సాయంత్రము వేళ నేను అంధకునితో కలిసి, ప్రేక్షాగారపరిశీలనార్థము పోయినాను. అప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు. నీడలు దీర్ఘములై పడుతున్నాయి. అప్పుడు నానీడను చూచుకున్నాను. శిరస్సులేదు. ఇప్పుడు ఈ ప్రతిబింబాన్ని చూచుకున్నాను. శిరస్సులేదు. ప్రాప్తి! నీకు అర్థమైనదా!"

ప్రాప్తికి అర్థమైనది. అర్థముకాలేదు. మధురేశ్వరుని ఈ మనోవైక్లబ్యమును చూచి ప్రాప్తి భయపడినది. "స్వామి! కొంచెము విశ్రాంతి తీసుకోండి" అని ప్రాథేయపడింది ప్రాప్తి. ఆ మాటనువిని కంసుడు నవ్వినాడు. "ప్రాప్తి! నాకు ఎక్కడి విశ్రాంతి! ఎక్కడి విశ్రాంతి! ఇక ఒక్కటే విశ్రాంతి" అని నిట్టూర్చినాడు. నిట్టూర్చి ప్రాప్తిదిక్కుముఖమై "ప్రాప్తి! నీవు దేవకి సంతానము, వాసుదేవుని చేతలనుగూర్చి విన్నావా?" అని ప్రశ్నించినాడు "విన్నాను" అన్నది ప్రాప్తి. "ప్రభు! ఆ దేవకికొడుకు పట్టి మాయవాడు. ఎక్కడో ఆ మాయలు నేర్చుకొని వచ్చినాడు. మీరు ఆ చేతలను చూచి భయపడుతున్నారా?" అన్నది. కంసునకు ఒడలు భగ్గున మండిపోయినది. "ప్రాప్తి! మధురేశ్వరునకు భయమా! ఏమి మాట అన్నావు? ఎంతమాటఅన్నావు?" అని కంసుడు వికటముగానవ్వినాడు. నవ్వుతూ, ఆ మందిరములో గుడుసుళ్లుగా తిరిగినాడు. అతడు తిరిగినంత మేర అతని నీడగూడ గుడుసుళ్లు తిరిగినది. కంసుడు ఆ నీడను దర్శించి హఠాత్తుగా ఆగిపోయినాడు.

"ప్రాప్తి! ఇటురా! ఈ నీడ చూడు! నీకు ఎట్లా కన్పిస్తున్నది."



చిత్రకారుడు — అచ్చి రఘురామరెడ్డి (మద్రాసు)

"మరల ఇదియేమి! ప్రభు! నాకు బాగుగానె కన్పిస్తున్నది"

"నాకు కన్పించుటలేదు. ప్రాప్తి! నాకు ఈ నీడ ఛిద్రమై, సరంధ్రమై కన్పిస్తున్నది. దీని అర్థమేమో తెలియునా?"

"తెలియదు, స్వామి!"

"రేపు తెలుస్తుంది! ప్రాప్తి! రేపు తెలుస్తుంది!"

ప్రాప్తికి దుఃఖము ఆగలేదు. "ప్రభు! మీరు ఇప్పుడు పూర్వమువలె లేరు. ఏమో మారిపోయినారు. మమ్ముల్ని ఏమి చేస్తారు?"

కంసునకు ప్రాప్తిని చూడగా జాలివేసినది. అతడు ఆ మందిరములలో నిల్వలేకపోయినాడు. ప్రాప్తి అడ్డమువచ్చినను అచ్చట నిలువక బయలుదేరినాడు. ఆరుబయిట కొంత చల్లగా ఉన్నది. చంద్రుడు ఉదయించబోతూ వుండగా, అచ్చట ఆకాశము విచిత్రమైన తెల్లదనాన్ని తెచ్చుకున్నది. కంసుణ్ణి చూచి ఏమి అనుకున్నవో నక్షత్రములు మినుకు మినుకు మంటున్నవి. వాటిని చూడబోగా కంసునకు అవి తిన్నగా కనుపించలేదు. చేయి కన్నులపైన నాసికాగ్రము మీదుగా పెటుకొని చూడగా, ఆ తారకలు రెండు రెండుగా అతనికి కన్పించాయి. చంద్రుడైనా సరిగ్గా కన్పిస్తాడేమో చూద్దామన్న బుద్ధితో మధురేశ్వరుడు తన సౌధోపరితలాన్ని చేరినాడు' అక్కడ వుండి మధురను చూచినాడు. యమునను చూచినాడు' అవి అన్నియు ఇప్పుడు తనకు మసకమసకగా కన్పిస్తున్నవి. ఏదీ ఆ చీకటికానిచీకటిలో, వెలుగుకాని వెలుగులో, విస్పష్టంగా గోచరించడంలేదు. తనచుట్టూ వున్న ఈ ప్రకృతి అంతా ఇట్లా మారిపోవడం మధురేశ్వరునకు విచిత్రమనిపించింది. ఈ మధురను తాను కైవశము చేసుకున్నప్పటినాటికి, ఇప్పటికి ఎంతమార్పు? ఈమార్పు తనలోనా? తనకు బయిటనా? బయట యమున యమునగావుంది. మధుర మధురగా వుంది. తానుమాత్రము మారిపోయినాడు. దేవకీ సంతానమనగా పుట్టిన భయముతో మారిపోయినాడు. అప్పుడు ఉదయించిన చంద్రుడుగూడా, కంసునకు మారిపోయి ఉదయించినట్లే కన్పించినాడు. ఆ చంద్రుడు చంద్రుడుగాలేడు. ఆ కాంతి, కాంతిగాలేదు. ఆ కాంతిని చవిచూచి కలువలు వికసిస్తాయట! తన మనస్సు వికసించడంలేదు. వెన్నెలను చూచి దొంగలు ఝల్లినట్లు, ఝల్లుతున్నది. ప్రపంచాన్ని క్రమ్మిన అంధకారాన్ని, ఈ చంద్రుడు ఖండిస్తాడట! తనలో, అతని ఉదయమువలన

(45-వ పేజీ చూడండి)



వనితాలోకం

ఆడపెత్తనం - అఘాయిత్యం

(అన్యోన్యంగా ఉండని ఆలుమగల సంసారం ఎండిన కాసారం. అదిసారం లేని సంసారం. పౌరుషం లేని భర్తలూ, స్త్రీ సహజమైన ఒద్దిక లేని ఇల్లాళ్లూ సమకూడిన సంసారాలపట్ల పై మాట వర్తిస్తుంది. కొన్ని కొన్ని సంసారాల్లో భర్త లెవరో, భార్యలెవరో తెలీనంత విడ్డూరాలు కనుపిస్తాయి. ఆడపెత్తనం ఎంతవరకు పోతున్నదో ఈ వ్యాసం చూచాయగా చెబుతుంది.)

సామాన్యంగా యౌవనంలో ఉన్న భర్తలందరూ భార్యలు చెప్పినట్టుగానే నడుచుకుంటారు ఎవరో నూటికి పదిమంది తప్ప. అసలు భార్య చెప్పినట్టు వినడం భర్తది తప్పని నేననను. కాని పూర్తిగా భర్తపైన అధికారం చలాయించే భార్యలను చూస్తే ఎవరికైనా అసహ్యమనిపిస్తుంది. ఆ విషయంలో భార్యకు భయపడడం పురుషుని తప్పు కావచ్చు. కాని అందరూ తెలివైనవారు ఉండరుగా. కొందరు అమాయకులు ఉండడంకద్దు. ఆ అమాయకులను లోబరుచుకొని కీలుబొమ్మగా చేసి ఆడించడం స్త్రీధర్మానికి విరుద్ధం. పోనీ కొంచెం అమాయకుడైతే కొద్దిగా అధికారం చెలాయించవచ్చు ననుకుందాం. కాని పూర్తిగా అతిశయోక్తి అనిపించేదిగా ఉండకూడదు.

ఏదో పనిగుంచి మా బంధువులింటికి వెళ్లాను. వారి కూతురూ అల్లుడూ కూడా వచ్చారు. రాత్రి భోజనా లయింతరువాత అందరికీ పడుకోవడానికి స్థలం చాలక చాలా ఇబ్బంది అయింది. ఇక ఆమె కూతురు భర్తతో "ఇక్కడ పడుకోవడానికి స్థలం లేదు. ఈ రాత్రి మీ అక్కగారింట్లో పోయి పడుకోండి." అంది. నాకు ఆశ్చర్య మనిపించింది. ఆమె మాట్లాడుతున్న అధికారస్వరానికి. ఆ అమాయక భర్త మారుమాట్లాడకుండా 'సరే' అన్నాడు. కొంచెంసేపటికి మళ్ళీవచ్చి ఈ రాత్రి ఏం పోతావు ఇక్కడే వరండాలో పడుకో అని ఒక జంపుఖానా ఒక శాలువ తెచ్చిచ్చింది. ఆయన 'సరే' అన్నాడు. ఆమె పోబోతుండగా 'ఇదిగో కొంచెం దిండు ఉంచేపంపిస్తావా' అన్నాడు. చుట్టాలచూపుకి వస్తే నీ రాజభోగాలు ఎలా దొరుకుతాయి. ఈ రాత్రి ఎల్లాగో గడుపు' అంటూ విసవిస వెళ్లిపోయింది. నాకు చాలా జాలివేసింది. కాని ఏమి చేయలేకపోయాను. కాని తెల్లవారి ఆమెను చూస్తే గదిలో హాయిగా వెచ్చగా బట్టలు వేసుకొని (నిద్రపట్టదని) నెత్తిక్రింద రెండు దిండ్లు

కమలలక్ష్మి


పెట్టుకొని పడుకుంది. ఆమె స్వార్థం, ఆయన అమాయకమైన దుస్థితి చూచి ఇటువంటివాళ్ళను ఎందుకు సృష్టించావురా దేవుడా అనుకున్నాను.

వీరిలా ఉండగా ఇంకొక తరగతివారున్నారు. భర్త అమాయకుడు కాకున్నా భార్య సంగతి తెలిసి తానే స్వయంగా పని చేస్తాడు.

మాకు తెలిసిన ఒక కుటుంబం ఉంది. ఆ దంపతులకు పిల్లాజెల్లా ఎవరు లేరు. ఆయన నెలకు నూటయేబది రూపాయలు సంపాదిస్తున్నాడు. కాని ఇంట్లో ఆయనో వంటమనిషిగా ఉంటాడనుకోవచ్చు. ఉదయం ఆమెగారు ఎనిమిదిగంటలకు లేస్తుంది. ఈ లోపలనే ఆయన వంటంతా పూర్తిచేస్తాడు. ఆమె లేచింది చూసి ఆమె ముఖం కడుక్కునే లోపల టీ తయారుచేస్తాడు. ఇద్దరూ త్రాగాక ఆమె స్నానంచేసి టాయిలెటు అయ్యేలోపల ఆయన తిని ఆఫీసుకు వెళ్ళిపోతాడు. ఇక ఆమె కూడా తిని కంచాలన్నీ అట్లే ఉంచుతుంది ఒంటిగంట దాకా. అప్పుడు పనిమనిషి వచ్చి అంతా శుభ్రంచేసిపోతుంది. సాయంత్రం మాత్రం ఆయన వచ్చేవరకు టీ చేసిపెడుతుంది. ఆమె ఉదయంనుంచీ (అంటే ఆయన ఆఫీసుకు పోయినప్పటినుండీ) అల్లికలూ, రేడియో, స్నేహితులు వీటితో కాలక్షేపం చేస్తుంది. సాయంత్రంఅయినా ఆమె రేడియోముందు కూర్చుని సిలోన్ పాటలు వింటూ వాటితో కంఠం కలుపుతుంది. ఇక ఆ భర్త ఆ సాయంత్రమైనా ఆమెను వంటచేయమనడు. ఆయనే వంటంతా వండిపెడతాడు. పాలు తోడు దగ్గరనుండీ అన్నీ ఆయనే చేస్తాడు. ఆమె అలా ఎందుకు చెయ్యదుఅంటే చిన్నప్పటినుండిఅలవాటులేదు. పనిరాదు అంటుందిట సాఫీగా. పని నేర్చుకుంటే రాదూ ఆమె మాటలుగాని. ఆయన కూడా నెమ్మదిగా ఊరుకునేసరికి ఆమెకు అలవాటయింది. పాపం ఆయన ఆఫీసులో పనిచేసి అలసిపోయి ఇంటికివస్తే ఇంట్లోకూడా పనిచేయాలంటే పాపం ఆయనకెంత కష్టంగా ఉంటుందో అదయినా ఊహించుకోదావిడ. పోనీ ఆమె సంపాదిస్తున్న గర్వమా అంటే అదీలేదు. సంపాదనే లేదు. పోనీ కోటి దురుసుతనమన్నా లేదు. ఆమెకు కేవలం వంగలేని గుణం. ఆమెసుఖం ఆమె చూసుకుంటూ ఉంటుంది. కాని భర్త కష్టం గురించి ఆలోచించదు. కనీసం సహాయం అన్నా చేదామన్న ఆలోచనే ఉండదంటే నమ్మండి. ఇక పిల్లలు పుడితే ఎలాగో మరి. ఎవరన్నా పోయి వారింట్లో రెండు రోజులుంటే అదో కథలాగనిపిస్తుంది. పాపమాయన ఎంత సిగ్గుపడతాడో!

మరొక తరహా భర్తలున్నారు. సామాన్యంగా ఇటువంటివాళ్లు చాలామంది ఉన్నారని నా ఊహ. సామాన్యంగా వింటూనే ఉంటాం.

మా బంధువుల్లో ఒకాయన ఉన్నాడు. ఆయన ఎంత తెలివికలవాడయినప్పటికి తన భార్య చేసే చర్యలన్నీ చూస్తూ ఏమీ అనడు. ఆయన భార్య తన పుట్టింటివా



రేవరన్నా లేక పుట్టింటివారి బంధువుల బంధువులైనా సరే వారింటికి వస్తే వారు ఎన్నిరోజులున్నా సగౌరవంగా ఆదరిస్తుంది. కాని తన అత్తవారివారెవరైనా వస్తే మూతి మూడు వంకర్లు తిప్పుతుంది. సరిగ్గా 'భోంచేశావా' అని కూడా అడగదు. ఒకవేళ అత్తవారివారెవరైనా పనిమీద నాలుగు రోజులుండవలసివస్తే వారి చాటుగా మాట్లాడినట్టుగానే వారికి వినవచ్చేటట్లు "ఇంత పెద్ద బస్తీలో హోటళ్ళు కరువయ్యాయా? ఇదేదో ధర్మసత్రమనుకొని చీటికి మాటికి వస్తూంటారు. అబ్బబ్బబ్బ ఒకళ్లు కాకుంటే ఒకళ్లు. ఇక్కడ ఉండటమే కష్టమైపోతుంది" అని ఏ ఎదురింటి ఏకాక్షితోనో అంటుంది. ఇక ఆయన బాధపడి [illegible] ఇదంతా ఆమె భర్త చూడలేదని కాదు. ఎన్నోసార్లు చూస్తాడు. కాని ఎందుకో ఏమో ఏమీ అనడు. తన భార్య పుట్టింటివాళ్లు ఎప్పుడూ ఏబదిమంది స్టాకు ఉంటారు కాని ఆయన ఎవ్వరినీ ఆపేక్షించడు. తనవాళ్ళెవరైనా వస్తే భార్యను ఆయనకూడా పలకరించనైనా పలకరించడు అదేమి విచిత్రమో ఏమో.

అంటే పుట్టింటివాళ్లమీద అభిమానం ఉండవద్దని కాదు. కాని అంతమందిలో తన (తనను పెట్టి పోషిస్తున్న) భర్త ఇంటివాళ్ళెవరైనా వస్తే వారినీ ఆదరిస్తే ఆమెదేం పోతుంది. ఆమె భర్త నేమనాలి!

మా వూళ్ళోనే ఓ దంపతులున్నారు. ఆయన తన తల్లిదండ్రులను వేరే ఇంట్లో వుంచి ఏదో వారికింత పంపిస్తూ తన భార్య తల్లిదండ్రులను తన ఇంట్లో ఉంచుకున్నాడు. ఆయన తన భార్యకు ఆమె తల్లిదండ్రులమీద గౌరవం చూపిస్తున్నప్పుడు తన తల్లిదండ్రులను తాను గౌరవించగూడదా? ఆయన అంత అజ్ఞానుడా? తాను సంపాదిస్తున్నప్పుడు తన తల్లిదండ్రులను బయటవుంచి భార్యమాట జవదాటలేక మామను అత్తను ఇంట్లో ఉంచుకోవడం ఎంత సిగ్గుచేటు! ఏం పురుషత్వము. ఆమెకలాంటి బుద్ధి ఎలా పుడుతుందో ఇదంతా ఆలోచించిచూస్తే ఒక వంక మగవాళ్లదే తప్పేమో అనిపిస్తుంది తమ భార్యలకు భయపడుతున్నందుకు. కాని ఎంతైనా 'స్త్రీ బుద్ధి ప్రళయాంతకః' ఎంతటి భర్తయితేనేం భార్యను అదుపులో పెట్టగలడా! భార్య తిరగబడి పోట్లాడితే ఏంచేస్తాడు. కొడతాడా. కొట్టినా మొండికేస్తుంది. అప్పుడేం చేస్తాడు?

పాపము! వారి జన్మకు అంతే రాసి ఉందేమో! ★

పాకశాల

కందతో కొన్ని వంటకాలు

దుంపకూరలు తరుచుగా తింటుంటే కొన్ని తత్వాలకి అంతగా పడనిమాట వాస్తవమేకాని, మార్పు కొరకు అప్పుడప్పుడు వాడుకునే రీతిగా కూరలు చేసుకుంటే, దుంపకూరల రుచి మరి దేనికీ లేదనిపిస్తుంది. ఉ:—కంద.

కందలో రెండు రకాలున్నాయి. 1. తియ్యకంద. 2. దురద కంద. తియ్యకంద పెద్దపెద్ద దుంపల ఆకారంలో ఉంటుంది. రెండవరకం కంద చిన్నపిలకల ఆకారంలో ఉంటుంది. దురదకందని శుభ్రం చెయ్యడానికి కొంత శ్రమ తీసుకోనవలసి వస్తుంది. ముందు చెక్కుతీసి, ముక్కలు తరిగి ఉప్పు నీటితో కడిగి ఆతరువాత చింతపండు నీళ్ళలో ఉడకపెట్టి ఈ దిగువరీతిగా వండుకోవచ్చు. కాని మనకి సాధారణంగా తియ్యకందే అందుబాటులో ఉంటుంది బజారులో. కంద త్వరగా ఉడికేందుకు జామ ఆకులు కలిపి ఉడికిస్తే త్వరగాఉడికిపోతుంది. ఈ దిగువ నాకు తెలిసిన కొన్ని అధరువులు ఇస్తున్నాను.

1, కందతో పులుసు, బెల్లంకూర:

కొంత పెద్ద పెద్దముక్కలను తరిగి నీళ్ళతో ఉడకపెట్టవలెను. ముక్క మెత్తపడ్డాక చిల్లుల పళ్లెంలోకి దిమ్మరించిన నీరంతా ఓడిపోతుంది. కొంత వేడిగా ఉండగానే ఈ ముక్కలని దిట్టమైన గరిటెతోగాని, లేక చేతిలోగాని మరీ పేస్టులాగ కాక, కొంత గుజ్జుగాను, కొంత చిన్నచిన్న ముక్కలుగానూ కుమ్మవలెను. చింతపండు గుజ్జుగా తడిపి, చిక్కనిగుజ్జు ఈ కందకూరపై పెట్టవలెను. చిటికెడు పసుపు, ఉప్పు మనకి వచ్చినంత బెల్లం పొడికూడా ఈ కూరపై పెట్టవలెను. పొయ్యిపై గిన్నె పెట్టి, నూనె, ఎండు మిరపకాయలు, మినప్పప్పు, ఆవాలు, పచ్చి మిరపకాయలు, చిన్నచిన్న అల్లం ముక్కలు, కరివేపాకు మొదలగు వాటితో ఘుమఘుమ లాడుతూ తాలింపు వేసి, ఈకందకూరముద్దను ఆ పోపులో పడవేసి కలిపి 10 నిముషములు సన్నని సెగమీదఉంచి తీసివేయవలెను. ఈ కూరా చాలా బాగా ఉంటుంది. ఉప్పు, కారం, పులుపు, తీపి వారివారి రుచినిబట్టి వేసుకోనవలెను.

కందతో ఉప్మాకూర

కంద పెద్దపెద్ద ముక్కలుగాతరిగి ఉడకబెట్టి, మెత్తగా చేతితో ముద్దచేయవలెను. గిన్నెలో, ఎండు మిరపకాయిలు సెనగ, మినపపప్పు, ఆవాలువేసి కమ్మగా వేగిన తరువాత, అల్లం, పచ్చిమిరపకాయలు కరివేపాకువేసి, ఈ కందముద్దను ఆ పోపులో వేసి కొద్దిసేపు మగ్గనీయవలెను. ఆ కూరను ఒక పళ్ళెంలోకి తీసుకొని కొద్దిగా చల్లారిన తరువాత నిమ్మరసం కలపవలెను. వేడిమీద కలిపితే చేదువచ్చుటకు అవకాశము కలదు.

కందవేపుడు, చిప్సు

కుమారు సైజులో ముక్కలుతరిగి, మరీ చితకకుండా (మెత్తపడకుండా) ఉడకబెట్టి వార్చవలెను. పొయ్యిపై ఇనపమూకుడు పెట్టి నూనె బాగా కాగినతరువాత ఈముక్కలను అట్లకాడతో కలుపుతూ ఎర్రగా వేయించవలెను. బాగా వేగినతరువాత మెత్తనిఉప్పు, కారం ముక్కలపై జల్లి తీసి వేయవలెను.

సుశీలా మహంతి

చిప్సుకి కందని పల్చటి బిళ్ళలుగా తరిగి బట్టతో తడిపోవునట్లుగా ఒత్తవలెను. ముక్కలు బాగా పొడిఅయిన తరువాత, మరి కొంత నూనెలో కొద్ది కొద్దిగా వేసి ఎర్రగా వేగేవరకూ, అంటే పెళుక్కున విరిగేటంతవరకూ వేయించి, చిల్లులగరిటెతో తీసి ఒకపళ్ళెంలో పెట్టి, ఉప్పుకారం. కలిపినపొడి చేతితో చిప్సుకి పట్టించవలెను,

సరళ సలహా

ప్రతి వ్యవహార జగత్తు. మనో వ్యాపారం ఒకటయితే వాక్ వ్యవహారం మరో రీతిగా ఉంటుంది.

అనుకున్నవన్నీ అనేయడం, ఆపేక్షలన్నీ ప్రదర్శించడం,వైముఖ్యాలు యథాతథంగా వెల్లడించడం తగదు. ఒక విధానాన్ని అనుసరించి నలుగురితో మెలగగల నేర్పు ఎంతయినా అవసరం.

సంఘంలో పరివేష్టించిఉండేవారందరూ ప్రతిమనిషినీ-వారి వారి దృక్కోణాలనుంచి పరిశీలిస్తూ ఉంటారు. ఉదాహరణకి నా 'పెళ్ళి చూపులు' సలహా చూడండి. పైమాటకు సాక్ష్యం ఇస్తుంది. కాగా ఆ సలహాపై లేఖలు వ్రాసినవారంతా ఇదివ్యవహారజగత్తుఅనిమరచారు.

ఉన్నదున్నట్టు కొందరితోనే కొన్ని పరిస్థితుల్లోనే అనాలి. అది అన్నిచోట్లా మంచిది కాదు. ఇక్కడే ఎక్కడలేని నేర్పూ తీర్పూ కావాలి! లేకపోతే మనం పడేఇబ్బందుల సీరియల్ ప్రారంభమౌతుంది.

కందపులుసు

చిన్న చిన్న ముక్కలుతరిగి ఉడికిన తరువాత గరిటె జారుగా పులుసు కలిపి ఆ ముక్కలలో పోసి తగుమాత్రం ఉప్పు, పసుపు వేయవలెను. తీపి ఇష్టం ఉన్నవారు కొద్దిగా బెల్లంకూడా వేసుకోవచ్చును. ఆ పులుసులో కొత్తిమిర, పచ్చిమెరపకాయ ముక్కలు వేసి, తాలింపు పెట్టవలెను. పులుసు బాగా కాగినతరువాత ఇనపగరిటెతో పోపు పెట్టవలెను.

కందా, బచ్చలికూర

కందని ముక్కలుగా తరిగి బచ్చలిఆకులు, లేత కాడలు ముక్కలుచేసి రెండింటిని కలిపి ఉడికించి, పైన చెప్పినట్లు పులుసు, బెల్లం వేసి ముద్దకూరగావండుకుంటే బాగుంటుంది.

కంద అట్లు

పెసరపప్పు నీళ్ళలో బాగా నానాక, బుట్టలో వడేసి, కంద పెద్ద పెద్ద ముక్కలు తరిగి, పెసరపప్పుతో కలిపి బాగా నురుగు వచ్చేలాగ రుబ్బవలెను. కందముక్కలు పచ్చివేవేసి రుబ్బవలెను. అల్లం పచ్చి మిరపకాయలు, కొత్తిమర, రుబ్బి వేసినా బాగానే ఉంటుంది. లేక కచ్చాపచ్చాగా దంచి ఈ రుబ్బిన పిండిలో కలిపి పెనంపై పెసరట్లు మాదిరే, కొద్దిపాటి దళసరిగా పోసుకుంటే, అన్నంలోకి చాలా బాగుంటాయి. కందని కలిపి రుబ్బడంవల్ల అట్లు మెత్తగా, అతి మృదువుగా ఉండి చాలా రుచిగా ఉంటాయి. ఇష్టమున్నవారు ఉల్లిపాయిలు సన్నగా తరిగి పిండిలో కలిపి వేసుకొనవచ్చును. సోడా ఉప్పుతో కందని ఉడికించిన ముక్కలు నల్లపడతయి. అందుకని, ఎప్పుడు జామ ఆకులు కనక కందముక్కలతో కలిపి ఉడికించిన త్వరగా ఉడుకును. వేపుడు ముక్కలలో ఉప్పు, కారం, బదులు మసాలాపొడి చల్లుకున్నా ఇష్టమున్నవారికి బాగుంటుంది.

చంద్రకాంతలు

ఇది తీపి పిండివంట. పెసరపప్పు బాగా నానిన తరువాత బుట్టలో బాగా నీరుపోయేలాగ ఓడ్చవలెను. నీటితో రుబ్బితే పల్చపడుతుంది పిండి. నీరంతా ఓడిన తరువాత తడి తగలకుండా, మరీ గట్టిగాకాకుండా గారెలకి మల్లె కాటుకలా రుబ్బవలెను. పిండికి సరిపడిన పంచదార ఉజ్జాయింపుగా తీసుకొని పాకం పట్టుకోవలెను. పాకం మరీ ముదరగాకాని, మరీ లేతగాకాని ఉండక సరిగా దగ్గరపడే పాకంగా అయిన తరువాత ఈ రుబ్బివుంచిన పెసరపిండిని వేసి కలపవలెను. ఏలకపొడి కూడా వేయవలెను. కాసేపు నిప్పుపైఉంచి, తడిచేతితో యీ ముద్దను ఉండచేస్తే దగ్గర

వనితా వాణి



స్త్రీలకు యోగ్యమైన విద్య

దీపావళి సంచికలో "స్త్రీలకు యోగ్యమైన విద్య యేలాంటిది" అనే మొదటి బహుమతిపొందిన వ్యాసం చదివాను. శ్రీమతి సి. అన్నపూర్ణ గారు బాగా విడమరచి వ్రాశారు. విద్య మానవునికి మూడో నేత్రం విజ్ఞాన నేత్రంవంటిదనే విషయంలో నేను వారితో పూర్తిగా ఏకీభవిస్తూ వున్నాను. ఈ వ్యాసం చదివి అర్థం చేసుకొన్న ప్రతి స్త్రీ తన భావి జీవితాన్ని రాచమార్గంలో వుంచుకోగలుగుతుంది. వారు వ్రాసిన నాలుగు అంశాలు ప్రతి స్త్రీకి మార్గదర్శకాలని వేరే చెప్పక్కర్లేదు. కాని వారన్నట్లు ప్రస్తుతం విద్యావిధానం ఈ మార్గాలను చూపడంలేదు. కనీసం విశాలభావాలు గలిగే అవకాశంగూడా ఇవ్వడంలేదు. ఇట్టి పరిస్థితులలో మనోవికాస మేలా ఏర్పడుతుంది. చాలమంది స్త్రీలలో చిన్న విషయాలపై తాపత్రయపడి సంకుచిత దృష్టితో జీవితాన్ని నిరాశామయం చేసుకొనడమే మనం చూస్తూ వున్నాము. సంతృప్తి సహనము లేని స్త్రీ ఆనందాన్ని పొందలేదనే నా అభిప్రాయము. ప్రతిఫలాన్నాసించేవారెలా సంఘసేవకులౌతారు. వారు స్వసేవకులే ననడం నిర్వివాదాంశము. ఇటువంటి చక్కని వ్యాసాన్ని వ్రాసి ప్రథమ బహుమతి పొందిన అన్నపూర్ణ గార్కి నా అభినందన లందజేయగోరుచున్నాను.

ఆర్. నవనీతం (మద్రాసు-11)

*   *   *

19-10-60 వ తేదీనాటి సంచికలోని సి. అన్నపూర్ణ గారు వ్రాసిన స్త్రీలకుయోగ్యమైన విద్య ఎలాటిది అను వ్యాసము చాల బాగున్నది. ఇకముందు యిటువంటి వ్యాసాలు వ్రాయగలరని నమ్ముచున్నారు. ఇటువంటి వ్యాసాలవలన స్త్రీల మనసులు మారవచ్చునని తెలియుచున్నది. ఇటువంటి వ్యాసాలు పాఠకులకు అందించినందులకు అన్నపూర్ణ గారికి నా ధన్యవాదములు.

ఎ. పార్వతమ్మ (నందికోట్కూరు)

*   *   *

19-10-60 దీపావళి ప్రత్యేక సంచికలో "సి. అన్నపూర్ణ" అక్కయ్యగారు వ్రాసిన స్త్రీలకు యోగ్యమైన విద్య ఎలాటిది?" అనే వ్యాసం చాలా బాగుంది. ప్రతి స్త్రీలు అక్కయ్యగారు వ్రాసిన విధముగా విద్య నేర్చుకొన్నట్లయితే వారి కుటుంబములు శాంతి, సౌఖ్యాలతో అభివృద్ధిపొందుటలో అతిశయోక్తి కానేరదు. ఈ వ్యాసం వ్రాసి (నావంటి) పాఠకులకు చాలా సంతోషము కూర్చినది. అక్కయ్యకు మీ పత్రికద్వారా నా హృదయపూర్వక అభినందనములు అందచేయవలెను.

కుమారి జి. వరలక్ష్మి (కిర్లంపూడి)

*   *   *

ఈసారి దీపావళి (19-10-60) సంచిక చాల బావుంది. "స్త్రీలకు యోగ్యమైన విద్య ఏలాటిది?" అనే వ్యాసంపై సి. అన్నపూర్ణ గారు వ్రాసిన వ్యాసం బావుంది.

ఆదర్శప్రాయమైన సంసారజీవితం గడపడానికి స్త్రీకి యేలాటి విద్య అవసరమో చక్కగా వ్రాశారు.

ఇంటికి దీపంలాంటిది ఇల్లాలు. ఇంటి యొక్క బాగోగులు ఇల్లాలిపై ఆధారపడి వుంటుంది. బిడ్డల భవిష్యత్తు భర్తకౌ మంచిచెడులు యెరిగి, సంసారం సాగరం కాక, సంసారం పండువెన్నెలగా సాగే విధానం తెలిసిన విద్య అవసరమని చక్కగా సెలవిచ్చారు. కేవలం డిగ్రీలవల్ల పెంపొందన్న గుణాలు అబ్బవని నేటి విద్యావిధానం ఉపయోగపడదని నిజం చెప్పారు. రచయిత్రికి మా హృదయపూర్వక అభినందనాలు.

నాగోజి నాగలక్ష్మి (పలమనేరు)

*   *   *

19-10-60 పత్రికలో సి. అన్నపూర్ణ, ఇ. హేమలత, సి. హెచ్. సీత గార్లు వ్రాసిన 'స్త్రీలకు యోగ్యమైన విద్య ఏలాంటిది?' చాల బాగుంది. ఇకమీదటకూడ ఈ లాంటి వ్యాసాలు వ్రాస్తారని ఆశిస్తున్నాను. ఈ ముగ్గురు రచయిత్రిలకు మీ పత్రికద్వారా నా హృదయపూర్వక వందనములు అందచేయ గోరెదను.

సౌదామిని (తిరుపతి)

*   *   *

గోరింట నూనె

గోరంటనూనె తయారు చేసే మరొక సులభమైన పదతిఉంది. ముందు గోరంటాకును మెత్తగా రుబ్బి, దానిరసం, ఆకులు పడకుండా పిండి, వేరే వుంచుకోవాలి. ఒక గ్లాసు రసమైతే, రెండుగ్లాసుల మంచి కొబ్బరినూనెగాని, మంచి నువ్వులనూనెగాని, ఆ రసంతో బాగా కలిపి కుంపటిమీద సన్నసెగని కాచాలి. కాగేటప్పుడు కలుపుతూ వుండవలెను. ఒకగంటసేపు కాస్తే చాలు. నీళ్లు ఇగిరి, నూనె పైకి తేలును. ఈ నూనె తలకు రాసుకొనిన జుత్తు నల్లగాను వత్తుగాను పెరుగును. సువాసన కావలిసినవారు దానికి కొంచం సెంటు వేసుగోవచ్చును.

విజాపురపు సీతాదేవి (రూర్కి)

*   *   *

19-10-60 వారపత్రికలో ప్రచురింపబడిన 'బంగారుపంట-గోరింట' చదివాను. నూనె తయారుచేశాను. బాగా కుదిరింది. 'ముద్దా చిట్టి' గారికి నా అభినందనములు. రెండు సంవత్సరములనుండి తల చుండ్రుతో బాధపడుతున్నాను. దీని నివారణోపాయము తెలిసిన సోదరీమణు లెవరైన 'వనితావాణి' ద్వార తెలిపెదరని ఆశిస్తున్నాను.

వి. ఇందిరాదేవి (అవుకు)

*   *   *

పడేటట్లుగా అయినతరువాత పళ్ళానికి నెయి రాసి, తిరగబోయవలెను. కొద్దిగా చల్లారాక మైసూరుపాకుముక్కలకిమల్లె డైమన్ షేపులో గాని, పలకలగా కాని కోసుకొని, నేతిలో గాని డాల్డాలో గాని దోరగా, ఎరుపురంగు తిరిగేవరకూ వేయించవలెను. ఇవి పైకి కరకరలాడుతూ, లోపల మెత్తగా వుడికి చాలా రుచిగా ఉంటాయి. వీలైతే ప్రయత్నించి చూడండి. పాకంపట్టే విషయంలో కాస్త శ్రద్ధగా ఉంటే ఈ పిండివంట బాగా కుదురుగుతుంది. ప్రయత్నించిచూస్తారుకదూ రాబోయే పండుగలకు. ★

వనితావాణి

వి/ 12-10-60 పత్రికలో "లక్ష్మి సింధూర్" (గుంటూరు) గారు వ్రాసిన 'గోరింటనూనె' గురించి చదివాను. చాలా బాగుంది. ఇటువంటివి చేయడము నాకు చాలా సరదా? కాని "మొదటి గోజు నవ్వూర్తిగా నీరు యిగరనిచ్చో మరునాడ కూడా పెట్టవలెను" అని వ్రాసినారు అంటే మొదటి గోజంతా సెగపెట్టవలెనా? నీరు షుమారుగా ఎంతసేపటిలో యిగురును కొంచెము విపులముగా వ్రాయుచూ ఈ నూనెవలని ఉపయోగములుగూడా తెలుపగోర్తాను. వీరికి నా ధన్యవాదాలు.

వై. దేవబాల (హైదరాబాదు-18)

*   *   *

నాటిఅత్తలు-నేటికోడళ్ళు

పి. సుచరితగారు వ్రాసిన అంశములు అక్షరాలా నిజమే. ప్రస్తుతము నూటికి 95 మందికోడళ్ళు అత్తలచే బాధపడువారున్నారన్నది నిజమేగాని అబద్ధంకాదు. కోడళ్ళవల్ల బాధపడు అత్తలు ఎచ్చటో నూటికి 5 గురికి మించిలేరు. కాబట్టి, పి. సుచరితగారు వ్రాసినది అసహజమనీ, నమ్మరానిదనీ, అటువంటివి వ్రాసినఎడల మనస్పర్ధలకు దారితీయవచ్చునని బొంబాయినుండి రమాకృష్ణగారు వ్రాయుట సవ్యంగాలేదు. ఇటువంటివి చదివైననూ, కోడళ్ళను యమబాధలు పెట్టు అత్తలు కండ్లుతెరచి వ్యవహరించెదరని నా నమ్మకం.

కె. జయలక్ష్మి (హైద్రాబాదు)

*   *   *

సుచరితగారి "నాటి అత్తలు, నేటి కోడళ్లు" పై అటు అత్తలవర్గంవారు ఇటు కోడళ్లవర్గంవారు అభిప్రాయాలు లేదా అభివందనలందించడములో అర్థమూహింపవచ్చు. కాని ఏ తెగకు చెందని కుమారి రుక్మిణిగారు అనుభవరహితంగానే ఒక తీర్మానానికి రావడం నిజంగా ఆశ్చర్యమే!

లక్ష్మిరంగయ్య (హైదరాబాదు)

*   *   *

చిట్టిపాపలకు డ్రస్సులు

విశాలాక్షి రావుగారు 5-10-60 లో వ్రాసిన ఊలు డ్రస్సులను చూచిన వెంటనే ఎంతో సంతోషముతో ఊలు వుల్లలు అన్నీ తెచ్చుకుని ప్రయత్నించబోయేను. కాని మీరిచ్చిన ఆ + గుర్తు ఏమిటో అప్పుడు ఏ విధంగా అల్లాలో నాకు ఒకంతట బోధపడ లేదు. 2) రెండువైపులా "నిట్టు" చెయ్యమన్నారు. అంటే ఒకవరుస నిట్టు ఒకవరుస పర్ల్ అల్లవలెనా లేక రెండు వేపులా ఒకేలా అంటే మఫ్లర్ అల్లికలా అల్లవలెనా? దయయుంచి వెంటనే నాసందేహము తీర్చెదరని ఆశిస్తున్నాను. ఒకచోట ఈ ప్లస్సు గుర్తులమధ్యనున్న కుట్లు అలా * మళ్లీమళ్లీ వెయ్యాలన్నారు. మళ్లీమళ్లీ అంటే అలా టప్పుడు ఎలాగో ఎన్నికుట్లు వెయ్యాలో అర్థంకాలేదు. వెంటనే తెల్పెదరని ఎదురు చూస్తున్నాను.

ఇందుర్తి శోభాదేవి (కలకత్తా)

*   *   *


నిద్రామాయణం

12-10-60 ఆంధ్రపత్రిక వీక్లీలో నిద్రామాయణముగూర్చి పి. పద్మావతి (పొన్నూరు) గారు వ్రాసిన వ్యాఖ్య చూచితిమి. అందు నిద్రామాయణము రచయిత సరిగా వ్రాసినను వానిని వ్యాఖ్యానించారు. అందులో గుండెకాయ యెడమవైపు నుండుననుట సరియైనదే కాని జీర్ణాశయము కుడివైపునుండు ననుట శోచనీయము. జీర్ణాశయము ఎడమవైపునే యుండునని పద్మావతిగారు తెలుసుకొనప్రార్థన. ఏదోకొన్ని అసాధారణ పరిస్థితులలో తప్పితే జీర్ణాశయము కుడివైపున నుండదు. situs inverses లో మాత్రమే జీర్ణాశయము కుడివైపునకుండును.

పి. విజయలక్ష్మి

(విశాఖపట్టణం)

★



డోర్ కర్టెన్స్ మూలలకు

కుమారి దయిత విమలాదేవి విజయవాడ-2.

హరివంశము

(39-వ పేజీ తరువాయి)

అంధకారము ఖండింపబడుటలేదు. చంద్రుడు ఉదయిస్తే మనస్సు చల్లబడుతుందట! మరి తనకు ఆ చల్లదనమేమియు కన్పించుటలేదు. "ఓయి! ఓషధులకు రాజా! నాయీ భీతికి ఔషధంలేదా?" అని కంసుడు మనస్సులో అనుకున్నంతలో, ఆ చంద్రుడు తన్ను చూచి వికటమైన హాసం చేసినట్లు, యమునమీదుగా ఒకఘూకం మొరస్తూ పోయింది. ఒక తీతువ అరుస్తూ ఎగిరిదిం. ఎవరో తన్ను పిలిచి "కంస! ఆ తీతువవు నీవు" అన్నట్లు అనిపించింది.

ఆ చంద్రుణ్ణి చూడగా కంసునకు కోపము వచ్చినది. ఆ వెన్నెలను చూడగా కంసునకు వెక్కసం అయిపోయినది. ఆ చంద్రుడు తనకు సరిగా కన్పించుటలేదు. అజ్ఞానికి ఆత్మద్రవ్యం ద్వైతమై భాసించినట్లు, ఆ చంద్రుడు కంసునకు రెండై కన్పించినాడు. అతని మనస్సు అనాహ్లాదియై గుడుసుళ్లు తిరిగింది. ఆ మసక వెన్నెలలో యమున తన జీవితమును అంటవచ్చిన కాలసర్పాన్ని పోలి కన్పించింది. కాళీయ సర్పదమనుని శరీరాన్ని పోలి, కీర్తినిపోలి, అతనికి స్పష్టము కాక, అస్పష్టము కాక, ఇతమిత్థమని నిర్ణయించరానిదై, మనస్సులో భయాన్ని, బుద్ధిలో ఆలస్యాన్ని, అంతఃకరణలో మాంద్యాన్ని సృష్టించింది.

కంసుడు తిరిగి తనమందిరాలను చేరుకున్నాడు. రాత్రి చాలా ప్రొద్దుపోయింది. మందిరంలో అంతా నిద్రిస్తూవుంటారు. తనకు నిద్ర రావడములేదు. అట్లా హంసతూలికా తల్పంమీద నడుమువాలిస్తే, నిద్ర ఏమన్నా వస్తుందేమో ననుకున్నాడు కంసుడు. తాను మందిరములను దరియుసరికి దాసదాసీజనాలంతా ఆదమరచి నిద్రపోతున్నారు. ఆ సుఖం తనకు లేదే అని కంసుడు మనస్సులో పరిదేవనం చేశాడు. శయనమందిరంలో మణిదీపం మందంగా ప్రకాశిస్తున్నది. కంసుడు తల్పాన్ని అధిరోహించి, శయనించి, కన్నుమూసినాడు.

మనస్సును చిక్కబట్టి నిద్రపో ప్రయత్నించినాడు. ఎప్పుడు నిద్రపట్టినదో అతనికి తెలియలేదు. అతనికి మెలకువరాగా తెలిసినది ఇది. ఆ నిద్రలో తనకు కొన్ని కలలువచ్చినవి. అవి భయంకరముగావున్నవి. ఒక కలలో తాను గరళమును తినినాడు. మరి ఒక కలలో ప్రేతాన్ని పరిరంభణంలో పట్టినాడు. మరి ఒక కలలో తాను దిగంబరుడై, ఖరారూఢుడై తిరిగినాడు. విషభక్షణంచేసినాడు. జపాకుసుమ మాలియై ఊరేగినాడు. ఇన్ని కలలు రాగా తనకు మెలకువరాలేదు. ఆ కలలు మనస్సునకు సుఖాన్ని ఇచ్చాయా? కంసునకు అర్థము కాలేదు. అతనికి అర్థమైనట్లు కన్పించిన కల ఇది. అతనిలోని భయమును మరి యింతగా రగుల్కొల్పిన కల ఇది. తాను నిద్రపోతున్నాడు. ఆ నిద్రలో తనకు ఒక కలవచ్చింది. ఒక స్త్రీ. నల్లనిది. ఎఱ్ఱని కోక కట్టుకున్నది. తల విరబోసుకున్నది. చేతిలో ఖడ్గాన్ని ధరించినది. ఆమె వెంట ఆమెను పోలిన స్త్రీలే, ఇంకా ఎంతమందియో వున్నారు. అందులో ఒక్కర్తుక, దిగంబరి, తన్ను, నిద్రనుండి లేపినది. తాను లేచినాడు. ఆ దిగంబరి నవ్వుతూ, తన్ను కౌగలించుకోవచ్చినది. తనకు భయము వేసినది. దానిని తాను మందలించబోయినాడు. నోట మాటరాలేదు. ఆ దిగంబరి నవ్వినది. అట్టహాసముగా నవ్వినది. ఆ నవ్వు నవ్వుగాలేదు. కత్తులుచిమ్ముతున్నట్లు వున్నది. ఆ స్త్రీ అన్నది. "కంస! నేను నీకు రుచించడము లేదా?" తాను అనుకున్నాడు. ఈ స్త్రీ రుచించడము ఏమిటి? ఇంకా చాల మంది స్త్రీలు వున్నారు. వారు గూడ తనకు రుచించునట్లు లేరు. ఈ స్త్రీలేమి? ఈ రుచులేమి? అనుకున్నంతలో రక్తాంబరధారిణి, ఖడ్గహస్త, కాలవర్ణ మందహాసంచేసింది. "కంస! నన్ను ఎరుగుదువా" అన్నది. "నీవు ఎవ్వరవు?" అన్నాడు తాను. "నేనా! నేనా! కంస! నీకు మృత్యువును" అన్నది ఆమె. అని మహాహాసం చేసింది. ఆ మహాహాసం వినగా కంసునకు భయమైనది. భయములో మెలకువ వచ్చినది. గుండె ఇంకా కొట్టుకుంటున్నది. శరీరము స్వేదజలస్విన్నమైవుంది. కంసుడు తాను ఏమై పోతున్నానా! అనుకున్నాడు. బిగ్గరగా "తల్లీ! తల్లీ! నేను ఏమైపోతున్నాను" అని ఆక్రోశించినాడు. ★

ప్రాణదాత

(31-వ పేజీ తరువాయి)

కంలో కొందరిపట్ల మాత్రమే సార్థకమౌతుంది. పంతులుగారలాంటివారు తప్పడు అంచనా వేసుకుని తనదగ్గరికి వచ్చిన ఆ యువకుణ్ణి ఆయన చురచుర చూచారు. ఆ మట్టి ముద్దలో ఆ తేజాన్ని రగుల్కొలిపారు. మనిషిగా పుట్టినవాడివి మనిషిగానే బ్రతకమని బుద్ధి చెప్పారు.

ఉద్యోగానికి సిఫార్సు చేస్తూ ఆయన తన స్నేహితుడికి వ్రాసియిచ్చిన చీటితో, చేతి ఖర్చులకోసం యిచ్చిన డబ్బుతో మాఅమ్మా, నాన్నా దూరప్రాంతాలకు వెళ్లి పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి జరిగిన మూడుమాసాలకు నేను పుట్టాను.

పంతులుగారిని గాకుండా మానాన్నగారు మరొకరిని ఆశ్రయించినట్లయితే ఒకటి రెండు జీవితాలు సర్వనాశనానికి గురై వుండేవి. ఆయన యింకా కళ్ళు తెరవని పసినిసుగును కాపాడారు. దుర్గతికిలోను కావలసిన ఒక అబల జీవితంలో వసంతాలు వెలయించారు. సంజవేళల్లో నట్టింటదీపం వెలిగించినప్పుడల్లా మా అమ్మ ఆయన్ను తలచుకునేది. పంతులుగారి పేరు పార్థసారధిగారు. ఆయన పట్లగల భక్తిభావంతో మా అమ్మ నాకా పేరే పెట్టుకుంది..."

చేత గొడుగుతో, పొడుకాటి కోటుతో, తెల్లటితలపాగాతో, చిరునవ్వులు మెరుగులు దిద్దుతున్న నెరసిన మీసాలతో నీరజ మనోనేత్రాలకు తాతయ్య ఆకృతి ప్రత్యక్షమైంది.

"ఇప్పుడు మీరు నన్నిలా రెండోసారి రక్షించారు..."

నీరజ అడ్డు తగిలింది. "ఇందులో నా గొప్పేమీ లేదు. నేను డాక్టర్ని. మీరు పేషంటుగా నా దగ్గరికొచ్చారు. మీ జబ్బును నేను నయంచేయగలిగాను. అది నా వృత్తి ధర్మం..."

కుర్చీలోనుంచి లేచి నీరజ మెల్లగా బయటకు వెళ్ళిపోయింది.

* * *

వారం రోజుల తర్వాత ఓ ఉదయం అయిదుగంటలకే నిద్రలేచి డాబా పైన పచార్లుచేసి క్రిందికిదిగివచ్చాడు సారథి. నీరజ గదిలో కూర్చుని పత్రిక చదువుకుంటోంది.

సారథి కనిపించగానే పరామర్శించింది నీరజ. "అప్పుడే ప్రాతఃకాల విహారాలు ప్రారంభించారన్నమాట!"

గదిలో ప్రవేశించి కుర్చీలో కూర్చుంటూ "ఈ మొదటి తరగతి రాజకీయ ఖైదీకి ఆ మాత్రం స్వేచ్ఛ వుందనే నేను భావిస్తున్నాను" అన్నాడు సారథి.

"అమ్మో, మీరు చమత్కారంగా గూడా మాట్లాడగలరే! నేనింకా ఏమిటో అనుకున్నాను..."

నీరజ మళ్ళీ పత్రికా పఠనంలో లీనమైంది.

ఏదో మాట్లాడ దలచుకున్నట్లుగా సారథి గొంతు సవరించుకున్నాడు. కాసేపు నేలవైపు చూచాడు. మళ్ళీ తలపైకెత్తాడు...

"ఏమిటో చెప్పదలచుకున్నట్లేవుంది..." నీరజ ప్రసంగానికి దారితీసింది.

"మరేం లేదు. మీరు చేసిన మేలుకు ఎలా

ప్రాణదాత

ధన్యవాదాలు చెప్పుకోవాలో నాకు తోచడంలేదు. మీ ఉపకారాన్ని నేను జన్మలో మరచిపోను. కానీ మీ మంచితనాన్ని ఆసరాగా చూచుకొని నే నెంత కాలమైనా మీకు అతిథిగా వుండిపోలేను. ఒకటి రెండు రోజులనుంచీ మీ దగ్గర సెలవు తీసుకోవాలనుకుంటున్నాను..."

పత్రిక వెనుక ముఖం దాచుకుని "ఐతే మీరు బిల్లు చెల్లించకుండానే వెళ్లిపోతా రన్నమాట" అంది నీరజ.

సారధి నొచ్చుకున్నాడు, "అలాంటి కృతఘ్నుణ్ణి గాను. నే నిప్పుడు నిర్ధనుణ్ణి. కానీ నా సంపాదనా శక్తిపైన నాకు నమ్మకం వుంది. త్వరలోనే మీ ఋణం తీర్చుకోగలను..."

చేతిలోని పత్రికను టేబిలుపైన పడేసి "అలాగైతే మీరు తప్పకుండా వెళ్ళదలచుకున్న పక్షంలో ఈ బిల్లునుగూడా మీతో బాటు తీసుకెళ్ళండి..." అంటూ మేజా సొరుగులోనుండీ ఓ కవరుతీసి సారధి చేతి కందించింది నీరజ.

కవరుచించి కాగితం పైకితీసాడు సారధి. కాగితంపైన అంకెలు లేవు. అక్షరాలున్నాయి. ఒకే ఒక్క వాక్యం. దాని క్రింద సంతకం.

"నాకు కావలసింది మీరు—ఇట్లు, నీరజ."

సారధి ఒకటికి రెండుసార్లుగా ఆవాక్యాన్ని చదువుకున్నాడు. నీరజవైపు చూచాడు. మళ్ళీ కాగితంవైపు! మళ్ళీ నీరజవైపు!! సారధికి అనిమిషత్వం సిద్ధించింది.

"నీరజ! మీరేనా?" అప్రయత్నంగా అతడు ప్రశ్నించాడు.

'అవునండీ సారధిగారూ! నేనే మీ నీరజను' — అన్నట్టుగా నీరజ కళ్ళల్లో ఆనంద బాష్పాలు మిలమిల లాడుతున్నాయి!

★

టీచరు: (వడ్డీ వ్యాపారస్తుని కొడుకుతో) ఒరే గోపీ! మీ నాన్న ఒకడికి 50 రు. అప్పిచ్చాడనుకో. నెలకు 100 కి 1 రు. వడ్డీ చొప్పున 1 సం॥నకు మొత్త మెంతరా?

గోపీ: మా నాన్న వడ్డీకిచ్చినది చదువుకున్నవాడికా? లేక చదువురాని వాడికా సార్?

—ఆర్. ఎస్. రాజున్ (కంచికూరు)

చల్లని తల్లి

(గతవారం తరువాయి)

అవి—పట్టణం బయట బడుగు ప్రజల పూరికొంపలు. వీధి ఇరుకుగా అసహ్యంగా ఉంది. శుభ్రం అన్నది ఎక్కడా కనిపించదు. పిల్లలు దిగంబరులుగా తిరుగుతున్నారు. ఎదురైన ప్రతిమనిషిడొక్కా ఎండిపోయి ఉన్నది. వానవడి ఇళ్ళ పైకప్పు లన్నీ తడిసిపోయాయి. వాకిళ్లల్లో మనుషులు నిలబడి ఉన్నారు. వర్షాన్ని ఆ ఇళ్లపైకప్పులు అడ్డగించలేవు కనుక వాళ్లు కూడా తడిసిపోయి ఉన్నారు. పైకప్పుల నుండి దట్టంగా తెల్లటి పొగలు పైకి లేస్తున్నాయి. ఒక ఇల్లాలు బయట నిలబడి పచ్చికట్టెను సన్నటి పేళ్లుగా చీల్చుకుంటోంది.

కట్టెలబండిని చూచి ఆవీధిలోని వాళ్లందరూ బిలబిల మంటూ బండి చుట్టూ గుమిగూడారు. నిక్కి-నిక్కి-కట్టెల్ని అందుకో ప్రయత్నిస్తున్నారు. "ఆగండి" అని గద్దించాడు మీసాలయ్య. బండి ముందుకు కదల్లేక పోయింది.

"కట్టెలు అమ్మేవేనా?"

"మాకు కొన్ని కట్టెలుకావాలి!"

"బండి కట్టెలు ఎలా కొనడం?"

...ఆ గుంపులో కట్టెల మీద దుమారం రేగింది.


"దూరంగా వెళ్లండి. వీటిని ఎవరికీ అమ్మడంలేదు...ఇవిరాజుగారికి!" అంటూ అదలించాడు మీసాలయ్య.

ముసలమ్మ ఇప్పుడు సందిగ్ధావస్థలోపడింది. రాజన్నకేమో తాను మాట ఇచ్చేసింది. ఇక్కడ ఇన్ని కుటుంబాలు కట్టెలకోసం అల్లాడుతున్నాయి.

ఒక ఇల్లాలు—"అయ్యా! వంటచేసి రెండురోజులైంది. పొయ్యిలో పచ్చిపుల్లలు పెడితే పొగవస్తోంది గాని, మంటమాత్రం పుట్టడంలేదు. పిల్లాజెల్లా అంతా తిండిలేక మాడుతున్నారు. తలకో నాలుగేసి కట్టెలిచ్చి వెళ్ళండి—చాలు! బతికిపోతాం..." అంది దీనంగా.

కలువకొలను సదానంద

ముసలమ్మ మనసు కరిగిపోయింది. ఎవరో ఆమెకడుపులో చెయ్యిబెట్టి కెలికినట్లయింది. వెంటనే-మరేమీ ఆలోచించలేక బండి దిగి, కట్లు విప్పింది. రాజన్న ఆమెవైపు విచిత్రంగా చూశాడు. వారించాడు. "ఇదేమిటవ్వా! కట్టెలు కోటలో వేస్తానని చెప్పి, ఇక్కడ అమ్ముకుంటున్నావు? ఇదేం న్యాయం?" అన్నాడు. ముసలమ్మ నిబ్బరంగా ఇలా అంది..."న్యాయమో, అన్యాయమో నాకు తెలియదు రాజన్నా! నామనస్సుకు ఎలా తోస్తే అదే న్యాయం. ఈ కట్టెలు నేను కష్టపడి సంపాదించినవికావు. పేరాగలు నాకొద్దు. ఇంతమంది పేదల్ని గోడు పెట్టి నేను సుఖపడేదేముంది?... రాజుగారికేం? ఆయన తలుచుకుంటే ఇంటి దూలాలు ఊడబెరికి వంట చేయించుకోగలరు. వారి ఒక్కరి కోసం ఇన్ని బీదకుటుంబాలు అన్నం లేకుండా మాడిపోవాలా?...నేనూ పేదదాన్నే. నేను కోరేది పేదవాళ్ళ బాగే! ఈ కట్టెలన్నీ వీళ్ళకే ఇస్తాను. వీళ్ళందరూ నాలుగురోజుల పాటు అన్నం వండుకు తిన్నారంటే—నా కదే గొప్ప బహుమతి!"



"ఈ సంగతి రాజుగారు వింటే నీగతి ఏమవుతుందో ఆలోచించావా?" అన్నాడు రాజన్న కోపంగా.

"రాజుగారు కోప్పడేంత తప్పు నేనేమీ చేయలేదే? రాజుకు కావలసింది ప్రజలసౌఖ్యమేకదా? ఆయన చేయాల్సినపనిలో నేను కొంత పాలు పంచుకున్నాను. రాజు మంచివాడైతే ఇందుకు నన్ను తప్పక మెచ్చుకుంటాడు......" అంది ముసలమ్మ.

"సరే! నీసంగతి ఇప్పుడేముందిలే? రేపటికిగదా?" అంటూ రాజన్న పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ గబగబ రాజవీధిలోకి దారితీశాడు.

ముసలమ్మ కట్టెలన్నీ ఆ పేద ప్రజలకు పంచిపెట్టింది. వాళ్ళు ఇచ్చిన వెల కొంచెమైనా దాన్ని గొప్పగా స్వీకరించింది. మీసాలయ్యకు బండి బాడుగ ఇవ్వబోయింది. అతడు నిరాకరించాడు. "నీదగ్గర ప్రతిఫలం అపేక్షిస్తే పాపం చుట్టుకుంటుంది తల్లీ ... "అన్నాడు. "ముసలమ్మా! మా పెద్దచిక్కు తెచ్చిపెట్టుకున్నావుగదమ్మా!...... రేపు ఏం ప్రమాదం వచ్చి నెత్తిన బడుతుందో?..."

"ఏమైనా జరగనీ—నా కష్టం మాత్రం ఏమీ లేదు..." అంది ముసలమ్మ. ఆమె మళ్ళీ ఒంటరిగా తన కుటీరానికి వెళ్ళిపోయింది.

చల్లని తల్లి

4

ఆ రాత్రి తెల్లవారింది. మామిడి చెట్లో కోయిల రాగ మాలాపింపక, దిగులుగా కూర్చుంది. ముసలమ్మ నిన్న జరిగినదంతా నెమరు వేసుకుంటూ, తన చివికిపోయిన ఇంటిమీద ఆకులు కప్పుకుంటోంది. ఉదయ కాంతులు పండిపోయిన ఆమె ముఖం మీదపడి, ముసలితనపు గీతలను లెక్కపెట్టుకుంటున్నాయి.

ఎండ చురుకెక్కింది ఇంతలో ఆమె కుటీర ప్రాంగణంలో ఒక పల్లకీ వచ్చి నిలచింది. దాంతోబాటు ఇద్దరు బోయీలు, ఇద్దరు రాజభటులు వచ్చారు. అవ్వ వాళ్ళను చూచి ఆశ్చర్యపోయింది.

"నిన్న కట్టెలమ్మిన ముసలమ్మ నీవేనా ముసలమ్మా?" అని అడిగారు రాజభటులు.

"అవును!" అంది ముసలమ్మ.

"అయితే పద - రాజుగారు తీసుకురమ్మన్నారు నిన్ను!"

"ఎందుకూ?" అంది ఆమె.

"మాకు తెలియదు."

"అయితే పదండి!" అంటూ ముందుకు నడిచింది ముసలమ్మ.

"నువ్వు రావల్సిన పనిలేదు. మేమే తీసుకు వెడతాం. నువ్వు పల్లకీలో కూర్చో!" అన్నారు వాళ్ళు. ఆమె పల్లకీలో కూర్చుంది. పల్లకీ బోయీల భుజాలపై కెక్కి కూర్చుంది. బోయీలు కొండవాగులా ముందుకు నడకసాగించారు.

ఆ పటకుటీరం దగ్గర మాయమైన పల్లకీ రాజభవనంముందు జగాల్మంది. రాజభటులు ఆమెను లోపలికి తీసుకుపోయారు. ఆమె అదివరకెప్పుడూ ఆ ఆడంబరాలు, వైభవాలు చూచి ఉండలేదు. ధగధగలాడే స్తంభాలు, చలువరాళ్ళు పరచిన వసారాలు, భ్రమలుగొల్పే లోహశిల్పాలు, అడుగడుగునా పరచి ఉన్న పట్టుతివాసీలు, భవననిర్మాణంలో ప్రతి అంగుళంలోనూ కనిపించే నగిషీలు, ఆడంబరంగా తిరుగాడే దాసదాసీజనాలు... వీటినంతా చూచి ముసలమ్మ అబ్బురపడింది.

కొలువుకూటంలోకి తీసుకుపోయారామెను. ఎత్తైన సింహాసనం మీద విలువైన దుస్తుల్లో, నవరత్న ఖచితమైన కిరీటంతో, మణిమయ హారాలతో—అవతరించిన శాంతి దేవతలా గంభీరంగా కూర్చుని ఉన్నాడు మహారాజు. అతనికి ఇరువైపులా బారులు తీరి—మంత్రి సామంతులు, ఉన్నతోద్యోగులు, కవులు, పండితులు ఆసీనులై ఉన్నారు. సభావేదికకు ఎదురుగా పురజనులు కూర్చొని ఉన్నారు.

ముసలమ్మ ఊహించినదంతా తారుమారైంది. ఆమెకు స్వాగతం లభించాడు మహారాజు. ముసలమ్మ రాజుకు వంగి నమస్కారంచేసి, భయభక్తులతో ఒక ప్రక్కగా ఒదిగి నుంచుంది. "ముసలమ్మా! నేనెవరో గుర్తుపట్టావా?" అన్నాడు రాజు.

"మిమ్మల్ని గుర్తుపట్టడమేంటి మహారాజా? మీరు మమ్మల్ని ఏలే దొరలని లోకమంతా ఒప్పుకుంటుంది!" అంది ముసలమ్మ.

మహారాజు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు—చేతికంకణాలు 'కణకణ' మ్రోగినట్లుంది.

"రాజన్న నేనే!" అన్నాడు రాజు... "నగరంలో ప్రజల జీవనం ఎలా ఉందో చూచి రావాలని, మారువేషంలో బయలుదేరినా—నా పేరెలా మారుతుంది?... ..."

ముసలమ్మ కళ్ళు ఆశ్చర్యంతో మెరిసిపోయాయి. ఆమె రాజుకేసి చూసింది. ఔను! రాజన్న!... మహారాజు వేషంలో ఉన్న రాజన్న! ఆ ముఖంలో తేజస్సు!... భయంతో వణికిపోతూ—"మా దొడ్డదొరలు! తప్పంటే మన్నించాలి!" అంది.

"నువ్వు చేసినపని తప్పుకాదు. మాటకి నూరుపాళ్ళు ఒప్పే! నీబోటి చల్లనిమనిషి మా రాజ్యంలో వున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది..." అన్నాడు రాజు. అతడు సభాసదులకు నిన్న జరిగిన కథంతా చెప్పాడు... "నిన్న ఈమె కథ వినగానే—ఈమె మనసు చల్లముంత అని తెలుసుకున్నాను. ఈమె మీద నాకు దయకలిగింది. రాచనగరులోకి తీసుకొచ్చి, మంచి బహుమానమిచ్చి పంపాలనుకున్నాను. కట్టెలు కోటలో వేస్తానని ఒప్పుకుంది. కాని, దారిలో—కట్టెలు లేక అగచాట్లు పడుతూన్న బీదప్రజలకు కట్టెలన్నీ పంచిపెట్టే

ఒకడు:- ఏమండోయ్! మా చిన్న అబ్బాయి నన్ను చూసి వెక్కిరిస్తున్నాడేమిటండీ? ఎవర్ని చూసినా అంతేనా?

ఆయన : అబ్బే! ఎవర్ని చూసినా అలా వెక్కిరించడండీ! కోతినిచూసినపుడు మాత్రమే వెక్కిరిస్తాడు.

—నీలం భాస్కరరావు (కాకినాడ)

సింది. బహుమానం తనకు వద్దంది. మహారాజుతో చెప్పి నీ అంతు తేల్చేస్తానని బెదరించినా భయపడలేదు. ప్రజల బ్రతుకే తన బ్రతుకన్నది. ఈ ముసలమ్మ త్యాగశీలాన్ని, దయా స్వభావాన్ని, ఉపకారబుద్ధిని చూచి-నా అంతరంగం - కరుణతో, గౌరవ భావంతో, ఆనందంతో నిండిపోయింది. రాజ్యంలో ప్రతిమనిషీ ఈమెలా నిష్కల్మషంగా, నిస్వార్థంగా ఉంటాలని మా కోరిక! ... ఈ ముసలమ్మ మనస్సును బహుమానాలతో వెలగట్టలేకపోయినా-మా ఆత్మతృప్తి కోసమైనా ఈమెను బహూకరించక తప్పదు..." అంటూ వరహాలతో నిండిన వెండి పళ్ళెరాన్ని ఆమెకు అందివ్వబోయాడు.

ఆమె స్వీకరించలేదు. "మహారాజా! ఇంత సిరి నేనేం జేసుకుంటాను? ఊరు పొమ్మంటూంది, కాడు రమ్మంటూంది. ఈ వయస్సులో నా మామూలు బ్రతుకే నాకెంతో తృప్తినిస్తుంది. ఆతృప్తి చాలు..."

"ముసలమ్మా! నువ్వు మా తృప్తి కోసమన్నా తీసుకోక తప్పదు..." అన్నాడు రాజు.

ముసలమ్మ అంది "మహారాజా! మన్నించండి! మీకంత ఇష్టమైతే నేను కోరే బహుమానం ఇప్పిస్తారా?..."

"ఏమడిగినా సరే!" అన్నాడు రాజు.

"వరహాలు, అగ్రహారాలు నాకొద్దు ప్రభూ! కట్టెలమ్ముకునే వాళ్ళు నా బిడ్డలవంటివారు! నేనున్నంత వరకు వాళ్ళకు ముంత మంచినీళ్ళకు భయం లేదు. తరవాత ఆ లోటు తీర్చాల్సినవారు మీరే!... అక్కడొక చలివేంద్రం వేయించండి. దప్పికతో నాలుక ఎండిపోయే తమ బిడ్డలకు దోసెడు నీళ్లు పోయించండి. చల్లని తండ్రి అనిపించుకోండి..." అంటూ నీరసంగా ఆగిపోయింది ముసలమ్మ.

మహారాజు ఆమె మాటలు విని ఆనందబాష్పాలు రాల్చాడు. ఆమె కోరిక తీరుస్తానని వాగ్దానం చేశాడు. ఊరు ఆమెను సాగనంపింది! అడవి 'రావ'మ్మని ఎలుగెత్తి పిలిచింది!

5

వేసవికాలం వచ్చింది. మండుటెండలు లోకంపైన దండయాత్రలు ప్రారంభించాయి. పేదవాడి కాళ్లు కాలిపోయి, నెత్తి మాడిపోయి, నాలుక ఎండిపోతోంది.

నేలతల్లి, నింగితేడూ
చెలిమిచేసే కోటలో
తెలుగు ముబ్బుల పలుకరించే
నీలికొండల కోటలో—

ప్రకృతి దాచుకున్న సిరులపెట్టె-ఆ చిట్టడివిలో మళ్లీ లయ తప్పకుండా గొడ్డళ్లు చేసే చప్పుళ్లు వినవస్తున్నాయి. ఎండలో నల్లరాయిలా మెరుస్తోన్న రాముడు-కట్టెలమోపు తలపైన పెట్టుకున్నాడు. గొడ్డలి మోపులో దోపుకున్నాడు. ఒకచేతితో మోపును పట్టుకుని, మరోచేతిని ఊపుకుంటూ గబగబ నడక సాగించాడు......ఆ చేతిలో ఇప్పుడు కట్టె లేదు.

అతడు అడవి దాటుకున్నాడు. కొండమలుపు తిరిగాడు. నేరేడుచెట్ల నీడలోకి వచ్చాడు. మోపు చెట్టుకు ఆనించాడు.

అక్కడ ముసలమ్మ పర్ణశాల లేదు. ఆ చోట ఒక పెద్ద సమాధి ఉంది. ఆ సమాధిపైన నాలుగు స్తంభాల రాతిమంటపం ఉంది. ఆ మంటపం క్రింద నీడలో నాలుగు కొత్త కడవలు; వాటిదగ్గర ఒక మనిషి ఉన్నాడు.

రాముడు నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు. మంచినీళ్ళ ముంత అందుకుంటూ—"చల్లనితల్లి! చచ్చి ఏ లోకాన వుందో?..." అనుకున్నాడు. నీళ్లు త్రాగాడు. నీళ్ళు చల్లగా ఉన్నవి. అతడి దాహం తీరింది..."ముసలమ్మ చావలేదు. నీటిలోని చల్లదనమే ముసలమ్మ. నీళ్ళల్లో చల్లదనమున్నంత కాలం ముసలమ్మ బతికేఉంటుంది..." అనుకున్నాడు. మోపు తలపైన పెట్టుకున్నాడు. ఆసన్నటి కొండబాటలో నగరం వైపుగా సాగిపోయాడు.


...మామిడిచెట్లో కోయిల తన తీయని గొంతెత్తి, అతనికి వినిపించేలా గట్టిగా ఇలా పాడుతోంది.

"...నా గొంతులో తేనెవాగు సృష్టించి,
నా కూతలో రాగమాలికలు నించి,
కథలేవొ పాడుమని విధి నన్ను బంపె;
గాథ నీదే తల్లి-నాగళము నింపె;
నీ మంచి మనసు తెలినీటి కోనేరు;
నీ మనసులో మమత కోనేటినీరు;
నీమూర్తి పుడమిపై నేడు కనరాదు.
నీ మమత కేనాడు మరణమే లేదు.
పాటగా నీగాథ పాడి వినిపింతు;
పాటలో నీ కీర్తి సుధలు గురిపింతు;...
కుహుకుహూ; కుహుకుహూ;
కుహుకుహూ;కుహూ;..." ★

ఉరిశిక్ష విధించబడిన ముద్దాయిని ఉద్దేశించి 'నీ అంతిమకోరిక ఏమి'టని ప్రశ్నించాడు న్యాయమూర్తి.

ముద్దాయి - ఇక్కడినుంచి నన్ను యమలోకానికి పంపకుండా నరాసరి స్వర్గానికి పంపండి.

—లంకా వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి
(గుంటూరు)



బెజవాడ
సావందర

(గత వారం తరువాయి)

ఆమాట విన్న సునంద మోమాట పడకుండా నవ్వింది.

'రాకుమారా—ఆ పాప ఇంకా పాపే అనుకుంటున్నావా? కాదు. అందాల పాప. పదారేళ్లతోపాటు పదారు వన్నెలు నించుకున్న మెరుపులాంటి లేడిపిల్ల. ఆ పాప సంగతి మేం చెప్పకుండానే నువ్వు తెలుసుకున్నావుగా' అన్నది ఆమె.

ఉదయభారవి చాలా దారుణంగా సిగ్గుపడిపోయాడు. మరీ అంతయిదిగా యిదౌతాడని ఎవరూ అనుకోలేదు.

'అయితే ఈ ఉష ఆ రాకుమారి అన్నమాట' అన్నాడు.

'అన్నమాటేమిటి? ఉన్నమాటే' అన్నారు ముగ్గురమ్మలూ.

'మరిందాకేదో ఆ పదారేళ్ల నాడు నేను చేసిన చిలిపిపనే మళ్లీ చెయ్యాలన్నారు చూడండి. సదరు చిలిపిపని ఏమిటో, ఎప్పుడో, ఎక్కడో, ఎందుకో మొదలయిన వివరాలన్నీ..." అని దీర్ఘంతీసి పూర్తి కాకుండా మొహమాటపడిపోయాడు భారవి.

'అది చెప్పవలసినప్పుడు, చెప్ప తగినచోట చెప్పవలసినరీతిలో చెబుతాము' అన్నారు దేవతాస్త్రీలు. అటుతర్వాత పసందుగా ఉషాకన్య పుట్టినరోజు విందుచేశారు అమ్మలు. కమ్మని పిండివంటలతో తీయని పానీయాలతో ఆ విందు అమృతంలా ఉన్నా రాకుమారుడి మనస్సులో ఏదో వేదన సనసన్నగా బాధిస్తున్నది. ఈ గండం ఏమిటి? తప్పించడం ఎలా? ఇదే యోచన.

ఆ రాకుమారీ అలానే బాధపడింది. "అదేదో గండం వస్తే నా బతుకు గుండం అయిపోతుంది. ఇంత అందమైన అబ్బాయితోనూ ఒక్క క్షణమైనా సరిగ్గా మాట్లాడలేదు. ఇప్పుడెట్లా? అతనితో ఒక్కసారైనా తనివిదీరా మాట్లాడలేదే. మనసు తెలుసుకోలేదే, ఒక్కక్షణం అతని స్నేహంతో ఇంత తీయని పానీయమైపోయింది జీవితం. అతన్నే పెళ్లాడి కలకాలం కళకళలాడుతూ గడుపుతే ఇంకెంత కమ్మగా ఉంటుంది! ఆ అదృష్టం నాకుందో లేదో. అయినా ఈ దేవుడు భలే చెడ్డవాడు. మంచి వాళ్ళను వంచిస్తాడు. చెడ్డవాళ్ళతో చేతులు కలుపుతాడు. అందం, ఆనందం రెండూ కలవనీయడు. రెంటినీ విడదీసి – ఆ రెండూ ఏడుస్తుంటే తను నవ్వుతాడు." అనుకుంది.

అలా అనుకోగానే సరిగ్గా ఆ దేవుడే పగలబడి నవ్వినట్లుమిరుమిట్లు గొలిపే మెరుపు మెరిసింది. గందరగోళంగాఉన్న పళంగా పకిలినవ్వువినిపించింది. ఆకాశమార్గాన అలజడికలిగింది. సునంద ఉషను గుండెకు నిండుగా హత్తుకుంది. రాకుమారి మొహం తెల్లగులాబీలా తెల్లబోయింది. రాకుమారుడి ముఖం ఎర్రగులాబీలా పౌరుషంతో మెరమెరలాడింది.

ఇంతలో హఠాత్తుగా దురహంకార హుంకారంతో కారంగా చూస్తూ ఊడిపడింది పిడుగులా దుర్ముఖి. గండుమొహంతో దుర్ముఖి గండంలా గుండెలుదీసిన బంటులా కనిపించింది. లేడిలా వణకిపోయింది ఉష. సింహకిశోరంలా మారిపోయాడు ఉదయభారవి.

ఒక్కసారి చుట్టూ కలయచూసి, పక్కనున్న శకునపక్షి చేతిలో మంత్రదండం తీసుకుని రెండడుగులు ముందుకు వేసింది దుర్ముఖి.

'ఛాపం-ఫ్ఛ్ఫ్ఛ' అంటూ వెటకారంగా జాలితలుస్తూ ముందుకు వస్తున్న దుర్ముఖి ఏం చేయటానికి వచ్చిందో అందరికీ తెలుసుగానీ –



ఆ క్షణంలో వెంటనే ఏం చేయగలదో ఎవరికీ తెలీలేదు. భయంపడ్డ ఉపాకన్య గట్టిగా సునందని కౌగలించుకుంది. కెవ్వున గావుకేక పెట్టింది. నిలువునా పడిపోయి మూర్ఛపోయింది. ఈ మూడు ముక్కలతో పదారేళ్ళ రామాయణం చివరిఘట్టం చేరింది. అలా గట్టిగా కౌగలించుకోగానే రాకుమారి కంచుకానికి గుచ్చుకున్న లాల్ గులాబీ ఆమె వక్షస్థలానికి వత్తుకుపోయింది. ఆ పూరేకుల మరుగున పడిన గులాబీముల్లు గుచ్చుకుంది. పదారేళ్ళనాటి దుర్ముఖి దుర్భాషలు అక్షరాలా ఫలించబోయినాయి. సుచేత వెంటనే అగ్గిపిడుగులా దుర్ముఖిపైకి ఉరకబోయిన రాకుమారుణ్ణి ఆపి, 'ప్రతీకారం కాదు– దాని వల్ల ప్రయోజనం లేదు. సమయస్ఫూర్తితో చేయవలసినపని ఒకటుంది.' అన్నది. భారవి తమాయించుకున్నాడు. 'అయితే మరేవిటి ఉపాయం' అన్నాడు.

అప్పుడు సునంద అందుకున్నది. 'మరేంలేదు నాయనా. ఇందాక సమయం వచ్చినప్పుడు చెబుతానన్నాను చూడు. ఆ సమయమూ, చెప్పవలసిన సందర్భమూ వచ్చినాయి. చెప్తాను ఇకవిను, పదారేళ్ల నాడు నువ్వొక చిలిపిపని చేశావు. అది యిప్పుడు చెయ్యాలి.'

దానికి గాభ్రాగా నవ్వుతూ 'ఏవిటో మీరనేది నాకు తెలీటంలేదు. నేనేంచెయ్యాలో బోధపట్టంలేదు. చిన్నప్పటి చిలిపిపని అంటారు మాటిమాటికీ – అనేకం చేస్తాం చిన్నతనంలో – అందులో ఏదికి ఏమిటి?' అన్నాడు రాకుమారుడు.

'చిన్నప్పుడు ఈపాప సెలబాలగా ఉన్నప్పుడు నువ్వు ఎవ్వరూ చూడకుండా వెళ్ళి ఆమె నిద్రపోతుండగా ఘుమ్మున ముద్దెట్టుకున్నావు. అదే నువ్వు చేసిన అనేక చిలిపిపనుల్లో ఒకటి' అని ముక్తసరిగా చెప్పింది సునంద. అంతభయంలోనూ, గండంలోనూ అమ్మల రూపంలోవున్న దేవతాస్త్రీలకు నవ్వు ఆగలేదు. తెగ సిగ్గుతో తికమక పడిపోయాడు భారవి.

'ఇందరిలోనా—? అయినా ఇదేం పని?' అనుకున్నాడు. మళ్ళీ అపాయం తప్పదు అనుకున్నాడు. 'రాకుమారా ఆలస్యం అమృతం విషం. రాకుమారి మూర్ఛలో వుంది. ఇంకా అయిదు ఘడియలు అలానే ఉంటే పదారేళ్ళ తపస్సూ పాడయిపోతుంది. ఈ కథ సుఖాంతం కావాలి. ఈ కథానాయకి రాకుమారి. మేం చెప్పినట్టు చేస్తే ఈ ఉపాకన్య కథానాయకుడివి నీవు అవుతావు. సుఖాంతమైన కథకు నాయకుడయితే, నువ్వెన్ని చిలిపిపనులు చేసినా పరవాలేదు. అదీ

ఉషా కన్య కథ

బాధ' అంటూ బుజ్జగించింది సునంద.

రాకుమారుడు మిర్రి మిర్రి చూస్తున్న దుర్ముఖివైపు ఒక్కసారి చూశారు. అడుగు ముందుకు వేస్తే ఏదో ముప్పనాతి పనిచేస్తుందనే అనుమానంకొద్దీ వెంటనే రాకుమారి వైపు వెళ్ళలేదు. అలా అలా తిరుగుతున్నట్లు తిరుగుతూ గభిక్కున వంగి రాకుమారి గులాబీబుగ్గలు మనసారా ముద్దుపెట్టుకున్నాడు రాకుమారుడు. నిద్ర లేచినట్లు నవకాంతితో లేచింది రాకుమారి. దుర్ముఖి కదల లేదు మెదలలేదు. శిలలా నిలిచిపోయింది. చేతిలో మంత్రదండం నేలమీదికి జారిపోయింది. అందరికీ ఆ జరిగిన వింతలకి ఆశ్చర్యంవేసింది.

ఆ ఆశ్చర్యంలోంచి దీనదీనంగా ఒకధ్వని వినిపించింది. శిలారూపం వహించిన దుర్ముఖిరూపంలోంచి ఈ ధ్వని వచ్చింది. ఆ ధ్వని అక్షరాలా ఇలా వినిపించింది. "రాకుమారా? నామనస్సు ఏనాడో శిలఅయింది. నేటికి తనువూ శిల అయిపోయింది. నూటఒక్క పాపాలు చేయడానికి ఈ దుర్ముఖిఅవతారం ఎత్తాను. ఇదంతా నేను చేసుకున్న పాపం. అది క్రితంజన్మలో ఈ ముగ్గురు దేవతలూ నాకు పెట్టిన ఘోరశాపం. కావాలని దేవలోకంలో వాళ్ళకీ వీళ్ళకీ తగాయిదాలు పెట్టి - తంపులు తెచ్చి ఈ దేవతలను అష్టకష్టాలూ పెట్టాను. దాని వల్ల వీళ్లు ఆజన్మబ్రహ్మచారిణులుగా ఉండిపోవలసి వచ్చింది. సుజాత, సుచేత, సునందల వివాహం కాకుండా అసూయచేత అడ్డుపడ్డాను. ఆ వివాహమే జరిగితే వాళ్లకు నూటఒక్కవరాలు సంప్రాప్తమయ్యేవి. అవి నేను పొందాలనే ఆసుతో మోసంచేశాను. నేనే మోసపోయాను. దుర్ముఖినై పోయాను. శిలాహృదయనైనాను. ఇప్పటికి శిలనే అయిపోయినాను. దీంతో నూటఒక్క పాపాలు పూర్తి అయినాయి. చేసినపాపాలు ఇలా పండినాయి. పశ్చాత్తాపం కలిగింది. నీవు, రాకుమారి ఉషాకన్య ఉభయులూ వివాహంచేసుకుని సుఖంగా హాయిగా కలకాలం జీవించండి."

ఈ మాటలు విని ఉదయభారవి నిలువునా నీరయినాడు. రాకుమారి ఉషహృదయం ద్రవించిపోయింది. ఇద్దరిగుండెలూ కరిగి అక్కడొక దయాసాగరం ఘూర్ణిల్లింది. అమ్మలు ముగ్గురూ ఆసాగరానికి బాష్పగంగ ఉపనదులుగా విడిచి పెట్టారు.

పశ్చాత్తాపంతో పాపం తొలగిపోయి - దయాదాక్షిణ్యం మళ్లీ చిగురుస్తాయి; అదే దుర్ముఖి కథలోనూ జరిగింది.

అటుతర్వాత సునంద అందరితోనూ ఇలా అంది: "దుర్ముఖి అవతారం సమాప్తమై తిరిగి సుముఖిగా అవతరించడానికి ఒక్క శుభ నిమిత్తం కావాలి. శుభకార్యం జరగాలి. ఈ ధరణికోటఅడవిలో వెలసిన ఈ దుర్ముఖి శిలారూపం తరించి పూర్వరూపం రావాలంటే ఉషా, ఉదయభారవులకు ఈ ధరణికోట అడవిలోనే ఉత్తరంగా ఉన్న ఇంద్రకీలాద్రిపై వేంచేసిఉన్న జగదంబ కనకదుర్గాంబ సన్నిధిలో వివాహం జరగాలి. ఆ దేవి ఆస్థానిగా అలరారే బెజవాడనగరమంతా సదస్యంకావాలి. ఈ నవదంపతులు వారి ఆశీర్వచనం పొందాలి. అక్కడ వివాహం కాగానే ఇక్కడ దుర్ముఖి శిలారూపం చైతన్యవంతమై సుముఖి అయిపోతుంది. అంతటితో మా కథ కంచికి వెడుతుంది."

ఆ మాటలన్నీ నిజమై ఆనంద నందనవనంలాగ బెజవాడ ఇంద్రకీలాద్రిపై కళ్యాణమంటపం వెలసింది. కృష్ణాతీరవాసులైన పండితులంతా వేదనాదంతోనూ, మంగళ తూర్యనినాదంతోనూ ఉషా, ఉదయభారవి - ఈ యిద్దరి జీవితాలూ పెనవేసుకునే మూడుముళ్లూ వేయించారు.

సార్థకజన్ములయిన ధరణీవిశ్వనేతలూ, భరణీ వీరసింహులూ, సుజాత, సుచేత సునందలూ-కేవలం పరిస్థితినిబట్టి తీరూపేరూ మార్చిన శకునపక్షీ - సుజనపక్షీ, కాగా ఉదయపురిరాజ్యప్రజానీకం, బెజవాడ సదస్యంఅంతా ఆ దివ్యమంగళ శుభముహూర్తాన వధూవరులను ఆశీర్వదించారు. మహారాజు లిద్దరూ తెల్లమీసాలలోంచి చల్లగానవ్వారు.

ఈ నడచిన కథకీ, అది కంచికి వెళ్ళేముందు కలిగించిన ఆనందానికీ తనే కారణమనే ఆనందంతో శాపవిముక్తిపొందిన దుర్ముఖి, సుముఖిగా తిరిగివచ్చి మేజువాణిలో పెళ్లికూతురునీ, పెళ్లికొడుకునీ 'శతమానం భవతి' అని దీవించింది.

ఆ మధురక్షణంలో పులకించిన హృదయంతో బెజవాడ సదానందమైపోయింది. (సంపూర్ణం) ★

ఉపాధ్యాయుడు- నీకెన్నేళ్ళు నాయనా?

విద్యార్థి - ఐదండి.

ఉపా - నా గొడుగంత లేవు, నీకు ఐదేళ్ళా?

విద్యార్థి - మీ గొడుగుకు ఎన్నేళ్ళండి?

—సింగం పురుషోత్తం (నల్లగొండ)

కన్యాశ్రమం

(12-వ పేజీ తరువాయి)

ప్రాణం తీసేసింది. ఈ సంగతి తంతిద్వారా ఆమెకు తెలియజేస్తే ఆమె తల్లి వచ్చారుట. వింటున్నది. శవంమాత్రమే కళ్ళపడ్డది. ఈ విషయం నాకు ఆమె భర్త పోయిన మూడు వారాలకుగాని తెలియలేదు. ఆ వార్త విన్న తర్వాత నేను జానకిని చూడకుండా ఉండలేక పోయినాను. జానకి నేనుగూడా వస్తానన్నది. సరే ఆ రాత్రే బయలుదేరి వచ్చాం.

ఏమి చెప్పనా దృశ్యం: ఒంటిమీద చిన్నమెత్తు బంగారం లేదు. దుబ్బులాగా రేగి ఉన్న తల ముడి గడ్డ, కన్నీళ్ళ చారికల కట్టిన ముఖము మూర్తీభవించిన శోకదేవత లాగా ఉన్నది. ఆమెను చూడటంతో నే పట రాని దుఃఖంవచ్చి నిలుచున్నచోట నే కూలబడిపోయినాను. ఏమిటి నాయనా! మగబిడ్డవు నీవే యింత బెంబేలుపడి యేడిస్తే జానకికి దిక్కెవ్వరు? విధిలో ఎట్లాఉన్నదో అట్లా జరిగింది. నీవేమి చేస్తావు. ఏడవవదనీ మా అత్తయ్య - అంటె జానకి తల్లి - వోదార్చింది. రెండురోజులైన తరువాత వెళ్ళుతామని చెప్తే 'బావా! నా కర్తవ్య మేమిటో చెప్పకుండ వెళ్ళుతావా?' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. 'జానకీ! అయినదేమో అయింది. విచారించి లాభంలేదు. నీ అభిప్రాయ మేమిటో చెప్తే ఆలోచిద్దా మన్నాను.

'నరచరాస్తి ఏమైతేనేమి ఇంచు మించు మూడులక్షలకు పైగా ఉన్నదని అంటున్నారు. ఆయన ఇంత సౌమ్ము గడించారే గాని తాను తినలేదు, ఒకరికి పెట్టలేదు. చీమ కూడబెట్టినట్టు కూడబెట్టి కావలివానివలె వలిగాచి వెళ్ళిపోయినారు. ఇది నే నిప్పుడేమి చేయను 'అన్నది'. నీ వేది చేయదలుచుకుంటే అదే చేయవచ్చును, అన్నా నేను.

జానకి కళ్ళనిండా నీళ్లు తెచ్చుకుని! బావా నా పెళ్ళిసంగతి చూచావుగాదా. కట్నమిచ్చుకొనే శక్తిలేక ముసలివాడిని కట్టుకొని యీ గతికి వచ్చాను. మధ్యకుటుంబాలలో పుట్టిన కన్నెలకు వరకట్నాలు పిశాచిలాగా బాధిస్తున్నాయి. అనేక మంది కన్నెలు దీనికి బలైపోతున్నారు. లేదా అవివాహితులుగా ఉండిపోతున్నారు. ఈ రెండు స్త్రీలకు దుర్భరకష్టాలే, అన్నది జానకి.

'అవును ఇది దుర్భరకష్టంగానే ఉన్నది. దీనికి నివారణమార్గమే కనిపించడంలేదు' అన్నాను నేను.

'నివారణమార్గం నాకొకటి కనిపిస్తున్నది. ఈ ద్రవ్యంతో ఒక కన్యాశ్రమం పెట్టి వరకట్న మిచ్చుకోలేని మధ్య కుటుంబాలలోని కన్నెలకు వరకట్ననిషేధ దీక్షితులైన వరుల నిచ్చి వివాహాలు చేయిద్దామని నా అభిప్రాయం' అన్నది జానకి.

"నీ ఆశయం చాలా బాగా ఉన్నది. కాని మనం ఆశ్రమం పెట్టినంతమాత్రాన్న తల్లిదండ్రుల చాటున ఉండే ప్రాయంపుకన్నెలు వచ్చి మన ఆశ్రమంలో చేరుతారా? వాళ్ళ వాళ్లు అట్లా పంపడానికి ఒప్పుకుంటారా! అయినా పెళ్లంటూ ఇక్కడ వూరికె వచ్చి కూర్చుంటే వాళ్ళ కేమితోస్తుంది.

"వాళ్లు ఊరికేఉండకుండా మేమర్లను పెట్టి వాళ్ళ కిష్టమైన చదువో, సంగీతమో చెప్పించి ప్రైవేటు పరీక్షలకు పంపవచ్చును. వారికి తగిన సంబంధాలు వచ్చినప్పుడు వివాహాలు చేయవచ్చును. ఈ ఆస్తి ఎవరి స్వార్జితమో వారిపేర ఈ కన్యాశ్రమం పెట్టవచ్చును."

జానకి ఉదారాశయాలకు సత్సంకల్పానికి నేను ముగ్ధుడనైపోయినాను. జానకీ! నీ తలంపు చాలా ఉత్తమంగా ఉన్నది. ఇది కన్నెలకు మహోపకారంగా ఉంటుంది. నీకు సత్కాలక్షేపంగాను మనశ్శాంతికరంగాను ఉంటుంది అన్నాను నేను.

అయితే బావా నాదొక్క ప్రార్థన.

ఏమిటమ్మా?

'ఇదొక మహాప్రయత్నం. నేనుపడిన కష్టాన్నిబట్టి కన్నెలకిట్టి సహాయం చేస్తే బాగా ఉంటుందనుకుంటున్నానే గాని దీనిని నిర్వహించడం సామాన్యమైన పని గాదు. నీవు మా చెల్లెలు సంపూర్ణంగా సహకరించాలె' అన్నది జానకి. వెంటనే మాలతి అందుకొని 'అక్కా! ఈ మహాత్కార్యంలో నీవేమి చేయమంటే అది చేయడానికి నేను సిద్ధం' అన్నది. 'మీరు భగినులు ఇంత గొప్ప పని చేస్తూఉంటే నే నేనా వెనుదీసేది. నేను మీతోబాటు సేవకు సిద్ధమే' అన్నాను. జానకి చాలా సంతోషించి 'అయితే మీరిక్కడ ఉండిపోండి' అన్నది.

'నిజంగా జానకికి ఎంతమంచి ఊహ తట్టిందిరా. డబ్బు వేలాది మందికి ఉంటుంది. దాని వినియోగం వేయింటి కొక్కరికైనా తెలియదు అన్నాడు' రాజు. మూడు నెలల్లో బ్రహ్మానంద కన్యాశ్రమం వెలిసింది. రాజా నిజంగా మనము ఒక సత్కార్యానికి పూనుకోవాలేగాని భగవంతుడు వేయిచేతులతో చేయూతనిచ్చి వేయికండ్లతో కాపాడి వేయివిధాల వృద్ధిలోకి తెస్తాడు. కన్నెలను చేర్చడం కష్టమనుకున్నాం. బిలబిలలాడుతు అనేకమంది కన్నెలు వచ్చి ఆశ్రమంలో చేరారు. వీరిని పెండ్లాడేందుకు వరులు ముందుకు వస్తారా అనుకున్నాను. ఎందరో యువకులు పెండ్లాడడానికి వస్తున్నారు. యువకులలో త్యాగశీలత లోపించలేదు. ఉత్సాహం కొఱవడలేదు. సాంఘిక దురాచార నిర్మూలనాసక్తి లేకపోలేదు. వరకట్నాలు స్వీకరించడంలోని నైచ్యాన్ని గుర్తించకపోలేదు. పరిసరముల ప్రభావం, తలిదండ్రుల ఒత్తిడి, స్వాతంత్ర్యవిహీనత, కట్నం కానికలపైగల చిన్నతనపు సరదా, ఎంత ఎక్కువ కట్నం పుచ్చుకుంటె అంత గొప్పవాళ్ళమను భ్రాంతి వాళ్ళను తప్పుదారి పట్టిస్తున్నది. అయినప్పటికి ఎంతమందో యువకులు కన్యాశ్రమం కన్నెలను పెండ్లాడటానికి ఉత్సాహంతో వస్తున్నారు. ఎంతమందో కన్నెల తండ్రులు 'మా అమ్మాయిలను మీ ఆశ్రమానికి పంపుతాం. పెండ్లి చెయండి లేదా వరులను కుదిర్చి మాకు పంపండి. యథాశక్తిగా సాలంకృత కన్యాదానంచేసి కృతార్థుల మౌతా'మని వ్రాస్తున్నారు. ఈ కన్యాశ్రమంవల్ల, చదువు చక్కదనం, సౌశీల్యము, ఆభిజాత్యముగల పేదకన్నెలు ఏ కొందరైనా తగిన భర్తలను బడసి సుఖింపగలిగితే తన జన్మ సార్థకమైనట్లే అనుకుంటున్నది జానకి. నిజంగా ఆమె జన్మ సార్థకమవుతున్నది. ఆ పిల్లలెంత మంచి వాళ్లు! చక్కగా చెప్పినట్లు నడుచుకుంటున్నారు. చదువుకుంటున్నారు. వాళ్ళను చూస్తే ముచ్చట వేస్తూంటుంది. జానకిని అమ్మ అంటారు. మాలతిని పిన్ని అంటారు. నన్ను బాబాయి అంటారు. మాదో విచిత్రకుటుంబం' అన్నాడు రమణారావు.

మీ కుటుంబం గాథ వింటూ ఉంటె నిజంగా విచిత్రంగానే ఉన్నది. మీ రేదో దేవతామనుష్యుల్లాగున్నారు. అయితే యిప్పటి

గురువు: అమ్మాయి శకుంతలా! నీ వద్ద దేవుడు ప్రత్యక్షమై నీకేమి వరము కావాలి అని అడిగితే నీ వేమి కోరుకుంటావు.

శకుంతల: నాకు ఎక్కువ డబ్బు వచ్చేటట్లు వరము అడుగుతాను.

గురువు: ఛీ! నేనైతే ఎక్కువ విద్య కావాలి అని అడిగేవాడిని.

శకుంతల: సార్! ఎవరెవరికి ఏవి శూన్యమో అవి కోరుకుంటారు.

-పి. రాజగోపాల్ రావు (అనంతపూర్)

తెన్ని కన్యాదానాలు చేశావన్నాడు రాజు నవ్వుతూ.

ఇప్పటికి ఇరవై సాలు గైనాయి. ఇంకో క్కటి జరిగితే మా కల్యాణ మండపానికి రజతోత్సవమే చేయవచ్చు నన్నాడు రమణా రావు ఉత్సాహంగా.

అయితే మీ కన్యాశ్రమంలో చా కోక

కన్యాశ్రమం

కన్ని నిప్పించు. ఆ రజతోత్సవ కల్యాణ గౌరవం నాకు దక్కుతుం దన్నా రాజు.

నిజమా హాస్యమా! అబ్బో మీవాళ్లు ఒప్పుకుంటారూ అన్నాడు రమణ.



మీవాళ్లు ఒప్పుకున్నారూ. అన్నాడు రాజు నవ్వుతూ.

"నీకు మేనగోడ లున్నదిగా. నీవు ఫారిన్ నుంచి రాగానే ముడి పెట్టెయ్యాలని మీ అక్కయ్య బావ ఎదురు చూస్తున్నారుగా" అన్నాడు రమణ.

చూస్తున్నమాట నిజమే గాని అక్క కూతుర్ని చేసుకోవాలెవని నా కెప్పుడూ లేదు. అది తప్పనికూడా నా అభిప్రాయం కనుక నీ కిష్టమైతే మంచి కన్నెను చూడు.

'నాకిష్టం లేకపోవడ మేమిటి? మీవంటి వగలు దొరికితే మూడు ముళ్ళు వేయించడానికేగా ముడివేసుక కూర్చున్నా' మన్నాడు రమణారావు.

'సరే! రైటు. ఇంతకు నీ చదివినచదువంతా ఏమి చేశావు? కన్యాశ్రమ నిర్వహణమేనా వేరే వృత్తి ఉన్నదా?'

'లేకేమి. మా ఇంటి పక్క ఉన్న పర్ణకుటీరమే మా వైద్యశాల. పేదవాళ్ల డాక్టరు అని పేరు పడ్డది. వాళ్ళే వస్తూ ఉంటారు. పాపము డబ్బు యివ్వకపోతే మంచి మందు ఇవ్వమని వాళ్ళకు భయం కాన యథాశక్తిగా ఇస్తూ ఉంటారు. కుటుంబం సుఖంగా నే గడచిపోతున్నది' అన్నాడు రమణ.

'సరే! నేను చెప్పిన విషయం ఆలోచించు' అన్నాడు రాజు.

'ఓ తప్పకుండా ఆలోచిస్తాం. నీవంటి సంపన్నకుటుంబీకుడు ఉన్నత విద్యావంతుడు అయిన యువకుడు కన్యాశ్రమం బాలికను వివాహ మాడతానంటే అంతకంటే సంతోషకరమైన విషయ మున్నదా' అన్నాడు రమణారావు రాజు వీపు తట్టుతూ ఉత్సాహంతో.

* * *

స్టేషనులో లైట్లన్నీ ఒక్కమాటు గుప్పున వెలిగాయి. సమీప రైలుకట్ట పరిసరంగూడా తెల్లని విద్యుత్కాంతులతో పట్టపగలులాగా అయిపోయింది. తోడనే జనతా ఎక్స్ప్రెస్ బోయ్మని ఘూకరించుకుంటూ స్టేషనులోకి వస్తున్నది. ఇదేమిట్రోయ్ ఎనిమిదైనట్టున్న దంటూ మిత్రు లిద్దరూ చివ్వుని లేచి ఇంటి దోవ పట్టారు.

మరునాడు రాజు అభిప్రాయం జానకికి తెలియజేయబడింది. జానకి చాలా సంతోషించింది. హైమవతి చక్కని చుక్క. ఇంటరు ప్యాసైంది. మంచి యోగ్యురాలు. మంచి కుటుంబానికి చెందినది. వధూవరులు ఒకరి నొకరు చూచుకొని సమ్మతించారు. సమ్మతించినదే తడవు వివాహం ఏర్పాట్లు జరిగిపోయినాయి.

మంగళతూర్యారవములు వెలంగుచుండగా కన్యాశ్రమం కల్యాణమండపంలో హైమవతీ రాజేశ్వరుల వివాహం వైభవంగా జరిగిపోయింది. తన వివాహ సందర్భంలో కన్యాశ్రమానికి పదియున్నూటపదార్లు విరాళ మిచ్చాడు రాజు. ★



జోహార్ ఫిలిమ్స్‌వారి 'బేవకూఫ్' చిత్రంలో నాయిక మాలాసిన్హా సరాగం.

వార్తాభరణం

బొంబాయి

బొంబాయి కర్దార్ స్టూడియోస్‌లో ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి 'ససురాల్' శరవేగంతో సాగి మూడువంతులు పూర్తి అయింది. రాజేంద్ర కుమార్, సరోజాదేవి, మహమూద్, సుభాషిణీ ఖోటే, జయశ్రీ ఘన్‌కర్, లలితాపవర్, అన్వర్, ధుమాల్, వాస్తి ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల కేరళలో ఈ బృందం ఆరుపాటలు చిత్రీకరించారు.

* * *

తథాగతుని కథామణి హారంలో తరళంగా తళతళలాడే అంగుళిమాలుని కథ "అంగుళిమాల" పూర్తి అయింది. భరత్‌భూషణ్, నిమ్మి, చంద్రశేఖర్ ఈ చిత్రంలో నటించారు. తాయ్ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్‌వారు దీనిని వర్ణచిత్రంగా నిర్మించారు. విజయభట్ దర్శకుడు, సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్.

* * *

నసీర్ హుసేన్ నిర్మిస్తున్న "జబ్ ప్యార్ కిసీసే హోతా హై" హుటాహుటిని పూర్తి అవుతున్నది. దేవ్ ఆనంద్, ఆశా పరేఖ్, రాజేంద్రనాథ్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. శంకర్ జైకిషన్ సంగీతం సమకూరుస్తున్నారు.

* * *

తొలి భారతీయ సినిమాస్కోప్ వర్ణచిత్రం 'ప్యార్ కీ ప్యాస్' జనవరిలో విడుదల అవుతుంది. హనీఇరానీ, నిషీ, శ్రీకాంత్ నటించిన ఈ చిత్రం మహేశ్ కౌల్ దర్శకత్వంలో రంగులు దిద్దుకుంటున్నది. సంగీతం వసంత్ దేశాయ్.

'బందినీ'తో సంగీత ప్రియుల హృదయ బంధనానికి నడుం బిగించిన స్వర్మన్ ఎస్. డి. బర్మన్ 'ఖామోషీ' అనే మరో చిత్రంలో తన ప్రతిభ ప్రదర్శించనున్నారు. ఈ రెండు చిత్రాలకూ బిమల్‌రాయ్ దర్శకుడు.

* * *

విజయ (వాడ) తార వహీదా రెహమాన్, కిశోర్ కుమార్‌లు నాయికా నాయకులుగా సత్యేన్‌బోస్ నిర్మించిన 'గర్ల్‌ఫ్రెండ్' త్వరలో విడుదల కానున్నది.

* * *

వసంత్ జోగేల్‌కర్ చిత్రం 'అంచల్' చిత్రంలో నటి కుమారి నందా నచ్చినపాత్ర ధరిస్తున్నది. మెరుపుతీగవంటి చలాకీపిల్లగా నర్తకిగా నటించాలన్న నందాకోర్కె ఈ చిత్రంలో తీరింది. సుభాష్‌కుమార్, అశోక్‌కుమార్, నిరూపారాయ్, ఓంప్రకాశ్, చిత్రా, ధుమాల్, లలితాపవర్ కూడా ఇందులో నటిస్తున్నారు. సంగీతం సి. రామచంద్ర. ★



మంజీరా ఫిలింస్‌వారి 'చివరకు మిగిలేది'లో సావిత్రి.

చివరకు రగిలేది చివరకు మిగిలేది

19,20 శతాబ్దాలలో భౌతిక, రసాయనికాది శాస్త్రాలలో ఏ విధంగా విప్లవాత్మకమైన పరిణామాలు వచ్చాయో, మనస్తత్వశాస్త్రంలో కూడా అలాంటి పరిణామాలే వచ్చాయి. మానవుడు శారీరకంగానే కాక, మానసికంగా కూడా కొన్ని కారణాలవల్ల వ్యాధిగ్రస్తుడు కావచ్చు. మానసిక వ్యాధులకు శారీరకమైన చికిత్సవల్ల ప్రయోజనం ఉండదనీ, వీటిని కుదర్చడానికి ప్రత్యేక విధానం అవసరమనీ ఫ్రాయిడ్ మొదలైన మనస్తత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ చికిత్సా విధానాన్ని కనుగొని, ప్రయోగించటంలో కొత్త సమస్యలు వారికి ఎదురయ్యాయి. అనేక సందర్భాలలో రోగులు చికిత్సానంతరం డాక్టరును గాఢంగా ప్రేమించటం జరిగింది. కేవలం వృత్తిధర్మాన్ని అనుసరించి వ్యాధిని కుదర్చడమే లక్ష్యంగా పెట్టుకున్న డాక్టరుకు ఈ నూతన పరిణామం కొరకరాని సమస్యగా తయారైంది. డాక్టరులోని మానవత్వానికి, వృత్తిధర్మానికి మధ్య సంఘర్షణ ఏర్పడింది. ఇలాంటి అనుభవాలు కలిగే, ఫ్రాయిడ్ తన చికిత్సా విధానాలను క్రమేణా సంస్కరించుకోటం జరిగింది.

శాస్త్రగతమైన ఈవిషయాలను దృష్టిలో ఉంచుకొని మంజీరా ఫిలిమ్సువారు "చివరకు మిగిలేది" అనే కొత్తతరహా చిత్రం నిర్మించారు. చిత్రం కొలూకు రమేష్ ఇటీవల ప్రకాశ్ స్టూడియోలో కొందరు మిత్రులకు చూపారు. 'దీప్ జలేజాయ్' అనే బెంగాలీ చిత్రం దీనికి ఆధారం. మానసిక వ్యాధుల చికిత్సాలయాన్ని నిర్వహిస్తున్న ఒక డాక్టరు తనవద్ద పనిచేస్తున్న ఒక నర్సును విదేశాలకు పంపి ఆధునిక చికిత్సా పద్ధతులలో శిక్షణ గరిపిస్తాడు. తిరిగి వచ్చిన తరువాత ఆ నర్సును ఒక రోగి సేవకోసం నియమిస్తాడు. ఆమె చేసిన చికిత్స వల్ల, సేవవల్ల క్రమేణా రోగికి స్వాస్థ్యం చిక్కుతుంది. ఈ లోగా ఆమెను అతను, అతణ్ణి ఆమె, గాఢంగా ప్రేమించుకుంటారు. ఈ విషయాన్ని పసిగట్టిన డాక్టరు ఆమెకు వృత్తిధర్మాన్ని గూర్చి హెచ్చరిస్తాడు. రోగిపై ఆమె చూపిన ఆదరాభిమానాలు చికిత్సా విధానాన్ని అనుసరించి చేసిన అభినయం మాత్రమేనని జ్ఞాపకం చేస్తాడు. చాటుగా ఉండి ఈ మాటలు విన్న రోగి, ఆమె తనను నిజంగా ప్రేమించటంలేదనే భావంతో ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత, వేరొకరిని వివాహం చేసుకొంటాడు. ఆమెలో తుఫాను చెలరేగుతుంది. అయినా దాని నంతటిని దిగమ్రింగి, యథాప్రకారం పని చూసుకుంటూ ఉంటుంది. ఇలా ఉండగా, ప్రియురాలిచేత తిరస్కరింపబడి మనస్సు పాడుచేసుకొన్న వేరొక రోగి ఆస్పత్రిలో చేరతాడు. డాక్టరు మళ్ళీ ఆ నర్సునే ఈ రోగికి కూడా చికిత్స చేయమంటాడు. మొదట ఆమె అంగీకరించదు. రోగి పరిస్థితి విషమించేట్టుగా ఉన్నప్పుడు ఒప్పుకుంటుంది. ఆమె సేవ ఫలితంగా రోగి క్రమేణా కోలుకుంటాడు. పూర్తిగా నయమయ్యేసరికి అతడు తనను విడిచి ఉండలేనంత దగ్గరకు వచ్చాడని ఆమె తెలుసుకుంటుంది. మొదటి అనుభవంతో ఆమె హృదయానికి తగిలిన గాయాన్ని ఈ నూతన పరిణామం మళ్లీ రేపుతుంది. ఈ మారు తనలో వచ్చిన సంక్షోభాన్ని ఆమె తట్టుకోలేకపోతుంది. చివరకు మిగిలిందేమిటి?

వెలుగునీడల జీవితంలో చివరకు మిగిలేది వెలుగని కొందరూ చీకటని కొందరూ వాదించుకుంటే అదీ యిదీ కాదని ఏదో సంస్కృతంలో అనేస్తుంది వేదాంతం. 'అసత్'నుంచి 'సత్'లోకి జరిగే ప్రస్థానమే జీవితం అంటారు తాత్వికులు.

కాని మనస్తాత్వికులు అదీ అనరు ఇదీ అనరు. అనకుండా అన్వేషిస్తారు. ఆ అన్వేషణలో 'చివరకు మిగిలేది' ఏదీ అనేదే వారి పరిశోధన.

'చివరకు మిగిలేది' అనగానే మిగిలేది ఏదో ఉందనుకున్నా, 'లేది' అనే చివరి మాటకు కొమ్ము ఇచ్చి లేదు అని సమాధానం చెప్పుకున్నా తొందరపాటూ, పొరబాటూ అవుతుంది' అని ఈ చిత్ర నిర్మాతలు మొదట్నుంచీ చెబుతున్నారు.

కళ కుమార్, ఛాయ ఎం. కె. రాజా, సంగీతం అశ్వత్థామ, మాటలు మల్లాది, పిచ్చేశ్వరరావు, పాటలు మల్లాది రామకృష్ణశాస్త్రి నిర్వహించిన మంజీరా వారి తొలి చిత్రం నవంబరు 19వ తేదీ విడుదల కానున్నది. ★



సాహానీస్ (మద్రాసు) లో ప్రదర్శితమౌతున్న సోవెక్స్‌పోర్ట్ ఫిలిమ్స్ "ది రింగ్ మాస్టర్"లో ఒక దృశ్యం.

'ది రింగ్ మాస్టర్'

'ది రింగ్ మాస్టర్' అనే పేరిట అద్భుతమైన రష్యన్ సర్కస్‌ను సోవెక్స్‌పోర్ట్ ఫిలిమ్స్‌వారు చిత్రీకరించారు. ఈ చిత్రం ఇటీవల మద్రాస్ సాహానీస్ థియేటర్‌లో పత్రికా రచయితలకు ప్రదర్శించారు.

'అన్‌ది సర్కస్ ఎరీనా' అనే పేటి సర్కస్ చిత్రం ప్రపంచమంతా మన్ననలందుకుంది. ఆ ఖ్యాతి రష్యన్ చలనచిత్రకారులకే దక్కింది. వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాల్లో పోటాపోటీని పురోగమిస్తున్న రష్యన్‌లు చలనచిత్రకళారంగంలో కూడా చాలా ముందుకు పోతున్నారని తెలియచెప్పే అనేక చిత్రాలలో 'ది రింగ్ మాస్టర్' ఒకటి.

శక్తీ విమానంమీద విహరిస్తూ చేసిన సర్కస్ ఫీట్లు - క్రూరమృగాలతో ఇదివరకెన్నడూ చేయని గమ్మత్తులూ, తీగలపై నడకలూ పడకలూ, ఇన్నిరకాలుగా గరిమనాభి సరితప్పకుండా ఉండేందుకై ఈ చిత్రంలో శారీరకంగా కళాకారులు చేసిన తపస్సు చూడతగినవి. ఆనందించతగినవి.

* * *

కవిస్వప్న జగత్తు 'కవితాచిత్ర' చిత్రం

కవితాచిత్ర అనే సంస్థపేరిట కవిఆత్రేయ ఒక సాంఘిక చిత్రం నిర్మిస్తున్నారు. నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, కృష్ణకుమారి గిరిజ, సూర్యకాంతం మున్నగువారు ఈ చిత్రంలో పాత్రధారులు. పహూకార వ్యవసాయం వంటి సమష్టికృషి రాజకీయ రంగంలో లాగునే చలనచిత్రలోకంలో కూడా శ్రీ ఆత్రేయ తలపెట్టారు. ఇంకా నామకరణం చేయని ఈ చిత్రంలో పాటలు తనతో పాటు శ్రీశ్రీ, కొసరాజు, నార్ల చిరంజీవి మున్నగు వారిచేతకూడా ఆత్రేయ వ్రాయిస్తున్నారు. ఈకవులంతా ఎవరి పంథాలో వారు ఊహాబలంతో ఉపనిషద్వ్యధుల కాకపోతే ఈ చిత్రంలో ఒక కవి స్వప్న జగత్తును సృష్టిస్తారని ఆశించవచ్చు.

శ్రీశ్రీ, నార్ల చిరంజీవి వ్రాసిన రెండు పాటలకు ఇటీవలనే సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు బాణీలు కట్టారు. ఘంటసాల వెంకటేశ్వరరావు హరికథ పాట ఒకటి రికార్డుచేశారు.



ప్రగతి ఆర్ట్ పిక్చర్స్‌వారి 'మాబాబు'లో హనీఇరానీ.



యువదర్శకుడి నవపంథాలు

"వ్యాపార దృష్టిలేని కళాసేవ నేల విడిచిన సాము. ఆదర్శంకోసం వ్యవహార జగత్తులో భౌతికమైన లాభాలు వదులుకోవాలనడం అనుభవంలేనివారు వల్లించే పట్టుడు ముక్కలు. ఆదర్శంగా ఉండే చిత్రం నిర్మించాలంటే డబ్బులమీద ఆశ వదులుకోవాలని నేననుకోను. అలా వదులుకోవడం కన్న హాయిగా ఇంట్లో కూర్చుని ఆదర్శాలంటూ గానం చేయడం శ్రేయస్కరం."

అక్షరాలా తన నిశ్చితాభిప్రాయం పై విధంగా ప్రకటించారు యువ దర్శకుడు శ్రీ రామినీడు.

"మన చలనచిత్ర కథా విధానంలో కొత్త పుంతలు తొక్కాలని నేను ఎన్నాళ్ళుగానో కలలు కన్నాను. 'మా యింటి మహాలక్ష్మి' నిర్మాణంలో అవి కొంతవరకు సాధించాను. మన చలనచిత్ర కథల రూప స్వభావాలనుంచి పూర్తిగా దూరమై సరికొత్త పంథాల చిత్రాలు తీయాలని నా సంకల్పం. ప్రస్తుతం తీస్తున్న నవశక్తివారి రెండవచిత్రం చాలా విలక్షణమైనది. అచ్చ తెలుగుతనం గుబాళించే ఈ చిత్రంమీద నా కెన్నో ఆశలున్నాయి" అన్నారు.

తీసిన తొలి చిత్రంతోనే ఉత్తమ దర్శకుడుగా పేరు గడించుకున్న రామినీడు ఉన్నత ఆదర్శాలు కలవాడు. అవి సాధించాలనే పట్టుదల కలవాడు. తొలి చిత్రంలో హరనాథ్ రాజువంటి నటులను, ఎమ్. కె. రాజు వంటి ఛాయా దర్శకులను తనతోబాటు తెరకు పరిచయం చేసుకున్న ఈయన ప్రస్తుతం 'చివరకు మిగిలేది' అనే చిత్రంలో డా॥ ప్రభాకర్ రెడ్డి, సరళ రాజు, అనే నూతన నటులను, కుమార్ అనే కళాదర్శకుణ్ణి, కుమారి ముక్కామల సునంద అనే నేపథ్య గాయనినీ పరిచయం చేస్తున్నారు.

'చివరకు మిగిలేది' అందరికోసం తీసింది కాదు. ముఖ్యంగా న్యాయవాదులకూ, వైద్యులకూ, విద్యార్థులకూ ఈ చిత్రం మేము ఉద్దేశించాం. ఈ ముగ్గురికీ ఈ చిత్రం బాగా తెలుస్తుంది. దర్శనీయాంశం కూడా అవుతుంది. కావాలని మన ప్రేక్షకుల మీదికి ఇదొక ప్రయోగంగా మేము పంపుతున్నాము. ఫలితాలు చూడాలి అని కూడా శ్రీ రామినీడు అన్నారు.

ఢిల్లీలో అఖిలభారత భాషలలో జరిగిన నాటక పోటీలలో ఉత్తమ బాల నటుడుగా కె. వి. హనుమంతరావు, డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారి దగ్గర నుండి బహుమతినందుకుంటున్నారు. వెనుకనున్నవారు ఢిల్లీ నాట్య సంఘ గౌరవ కార్యదర్శి శ్రీ బి. ఆర్. నిరూలా.



సారథీవారి 'కుంకుమరేఖ'లో సరికొత్త సరాగం; బాలయ్య, సావిత్రి.

చింతామణి

మద్రాసు రసికజన సమక్షంలో ప్రదర్శనం

రంగస్థలనాటకచింతామణి, కాళ్లకూరి నారాయణరావు రచిత 'చింతామణి' నాటకం అక్టోబరు 29. సాయంకాలం త్యాగరాయనగర్‌లోని శ్రీకృష్ణగానసభ హాలులో ప్రదర్శించారు. మేటి నటీనటులు, నగరప్రముఖులు, పత్రికారచయితలు పలువురు ఈ నాటకం తిలకించారు.

ఆంధ్రుల రంగస్థలవైభవం శిథిలమై పోయిందని నిట్టూర్చేవారికి ఈ నాటకం క్రొత్తఆశలు కలిగించింది. పాత్రధారు లందరూ కలసికట్టుగా కడు సమర్థంగా నటించడం అరుదు. అలా అరుదైన నాటకాలలో ఇది ఒకటి.

ఈ నాటకంలో కల్గా విశేషం తెలుగు నాట దశాబ్దాలుగా పేరొందిన హాస్యనటశేఖరులు శ్రీ గండికోట జోగినాథం సుబ్బిసెట్టి పాత్ర ధరించడం. సెట్టిగారి పట్టులన్నీ గట్టిగా పట్టుకుని కనపట్టుగా ప్రదర్శించడంలో శ్రీ జోగినాథం ప్రతిభకు అందరూ జేజేలు మరోసారి చెప్పారు.

చింతామణిగా ఆదోని లక్ష్మి, శ్రీహరి మాతగా నల్ల రామమూర్తి, భవానీ శంకరుడుగా రఘురామయ్య కడు సమర్థంగా నటించి ప్రశంస లందుకున్నారు. బిల్వమంగళుడుగా మాధవపెద్ది సత్యం క్లయిమాక్సు ఘట్టాలలో అద్వితీయంగా నటించారు.

నాటకం మధ్యలో అభ్యాగతులు శ్రీ తెలంగి వెంకట్రామయ్య కళాకారులను పుష్పమాలా లంకృతులను చేశారు.

పెద్దతరంవారు తరలిపోయినా రంగస్థల ప్రాభవం నిలబెట్టే చిన్నతరంవారు తయారవుతున్నారనే విషయాన్ని ఈ నాటకం ఋజువు చేసింది.



నూతన నేపథ్యగాయని ముత్యాల సునంద.

గిరీశం లెక్చర్లు

సినిమాకు నీతిచంద్రిక, కొత్త స్టార్లు పాత పేర్లు, ఎక్సుయిజు సైజూ

హాతిరిమా! మీ నికార్సైన అభిప్రాయాలు బజార్న పడా! ఎంతమాట సెలవిచ్చారు సార్, కాస్త ఆగండి సినీ లోకరీతిమీద జారీఅయినట్టి నీతిచంద్రిక ఇంటరెస్టింగానే ఉందిగాని అచ్చుతప్పు లున్నాయి గదూ? అదే...ఒకొక్క స్టారు నాలుగు పిక్చర్లకన్న నటించకూడదని పడింది- 26 బదులు. హా నిజమే! ఆరుపిక్చర్లలో వేస్తే ఇండస్ట్రీ బతికినట్టేనా అంట. స్టార్లకి కాన్సంట్రేషను జాస్తీఅయిపోదూ! ఇపుడే కథలు అంతమాత్రంగా ఉంటున్నాయి. డైలాగులు వీళ్ళనిముద్దుకోలేక పిగిలిపోతున్నాయి. స్టార్లు ఆక్టే ఆలోచించకుండానే ఎన్నో సంస్కారణలు చేస్తున్నారు. రేపొద్దున్న తక్కువ పిక్చర్లలో వేస్తే ఇంకా దుంప తెంచెయ్యరూ. కథ గురించి నిజంగా ఆలోచించెయ్యరూ? వేషం రీలు కెన్ని షెడ్యూలులో ఉందో చూసికుందికి మాత్రమే తీరికున్నవాళ్లు రేప్రొద్దుట్నుంచీ అడుగడుగునా మంచేవిటి చెడేవిటి తలేఃటి తోకేవిటి కథేవిటి కమామిషేవిటని తగులుకోరూ. హామ్మో! కొంపలు మునిగిపోతాయి. అలాగే ఇంకో వికిలిరాత కూడా ఉంది. స్టారు తను కోవలసిన వాళ్ల చేతే మేకప్పు వేయించుకుంటామని పట్టుబట్టకూడదుట. ఇంకో నయం. కొరక్టరికి తగ్గట్టే వేషం వేయించుకు తీరాలన్నారుగాదు. ఏమో ఏంచెప్పగలం రేపొద్దున్న లేవగానే, "-అంతేగాదు పాత్రకి తగి ఉంటేనే వేషం వెయ్యాలి" అని శాసించినా శాసిస్తారు వాళ్ళసామ్యంపారు.

ప్రొడ్యూసర్ల గురించి మటుకు మీరు కొంచెం తక్కువ చెప్పారు. తగినంత కారణం లేందే డబుల్ వర్షను తీయకూడదని... సింగిలు వర్షను చిత్రాలన్నిటికీ తగినంత కారణాలుంటున్నాయని ఎంత గడుసుగా ఒప్పుకున్నారూ. చూశారూ, రచన అంటే అలా వుండాలి. ఒక్క వాక్యం చాలు గంగిగోవు పాలు అన్నట్టుగా మెచ్చుకోవల్సించ్చొట నేను కుండబద్దలు కొట్టినట్టు మెచ్చేసుకుంటాను. అది నా దుర్గుణం. ఏంచేస్తాం. పేచీ అల్లా ఇదో ఈ స్టార్లదగ్గరే.

మరేంలేదు. ఒహపక్కనించి కొత్తవాళ్లు రావాలోయ్ అంటూ మరోహపక్క ఉన్నవాళ్ల కిలాటవి మారిపోస్తే యలాగా అంటూ. ఇవి మారిపొయ్యడమూ మరోపక్క మారిపోయాల్సిన నాగరాంశాలగురించి అసలు మాటేనా ఎత్తకపోడవ్వూను. దారుణం గాదూ!

ఏదీ! కొందరు హీరోలూ హీరోయినూ అయికమత్యానికి ఆవాహం పెట్టేసి, వేళకి షూటింగు కొచ్చేయడం తప్పని దుయ్యబట్టేరేం? చక్కగా పదకొండింటి కొచ్చి అక్కలేప్తోందని వస్తుండున్నరకి చెక్కేసేవాళ్ళ అడుగుజాడల్లో వీళ్ళంతా నడ్చేరేవిటని నిలీసి అడగరేం? లా పొక్కింతయూ లేదు అంటూ, చిక్కిపోతున్న వాళ్ళని పట్టుకు చీవాట్లెయ్యరేం?...

* * *

యాకింగుకేం లెండి పేరుగురించిగదా అనేవాళ్ల కసరీ శాస్త్రీలగురించి వట్టంపేల? డబ్బింగు సినిమావాళ్ళ పద్ధతులు అందరూ ఎందుకుపట్టుకు వేళ్ళాడరు? అవా తెలీ కడుగుతారెండి. డబ్బింగువాళ్ళు అరవ సినిమా కథ, మాటలూ రాసినవాడి పేరుని ఎంతచక్కగా తెలిగిస్తున్నారు తెలుగులోకి? అసలు వాడిగుట్టు మనకి తెలీనిస్తున్నారా? అలాగే అరవపిక్చరుకి పాటలు చేసిన మూజిక డైరక్టరుపేరుని, తెలుగులో రీరికార్డింగు చేసినవాడి పేరులోకి ఎంతషోగ్గా తర్జుమా చేస్తున్నారూ? అక్కడితో ఆగిపోతారేవి అని. అందులో శివాజీ గణేశనూ పద్మినీ నటిస్తే పట్టిసీటీలో రామారావూ అంజలీదేవి ఆ నటాని ట్రాన్స్లేట్ చేసి అఘోరించవచ్చుగా? తిన్నగా తెలుగులో తీసేవాళ్లు కూడా అంజలి రామారావుల పేరుగురించేగా దెంగెట్టుకున్నదీ. వాళ్ల ప్రజ్ఞని యలాగా వాడుకోదల్చుకో లేదుగా? అంచేతిలా చేసే చక్కహో ఘం-వాగీ డబ్బింగు సినిమా అయినట్టూ మూడోవాడికి తెలీదు. ఇటు తెలుగుపేర్లూ ఉంటాయి.

ఇదేస్కీము తెలూపిక్చర్లలో కూడా వాడుకోవచ్చు. కాల్ షీట్ ఇవ్వని, ఇచ్చినా అవీశంగావచ్చి ఆక్రెస్ట్రా లేకుండా ఏడిపించేవాళ్లని పేరుకోసం బుక్ చేసుకుని వాళ్లకిచ్చే బ్లాకూ వైటూ కూడా పారేసి, ఆ వేషాలకే ఎవరో ఒకరో పారేసి కొత్తవాళ్లని బుక్ చేసుకోవచ్చు. పెద్దవాళ్ల పేర్లుంటాయి. కొత్తవాళ్ల మొహాలుంటాయి. ఉభయతారకం. స్టార్లు దెంగెట్టుకుంటారని దెంగక్కర్లే. ఈ మధ్యనో తారన్నట్టు— కేవం ఎలా అఘోరించినా పట్టింపులే దావిడకి.



ప్రగతిఆర్ట్సువారి 'మాబాబు'లో నాగేశ్వరరావు, రమణారెడ్డి, ఎం. ఎన్. రాజం.



సారథీవారి 'కుంకుమరేఖ'లో బాలయ్య, డెయిసీఇరానీ, సావిత్రి.

ఈ కాపరు పనికొంత ఇప్పుడు లాంగ షాట్ లలోఎలాగూ జరుగుతోంది. సౌండుతో ట్రాక్టర ద్వారా. ఇక మిడ్ లాంగ్ క్లోజప్లు రావడం తరువాయి.

అలాగే తీరికలేని రైటర్ల సంగతిని. అండర్ గ్రవుండులో ఉండి రాసే తీరికా ఓపికా లేని గొప్ప రైటర్లందరికీ డబ్బిచ్చేసి పేరు కొనుక్కుని, తరవాత వర్థమానులకి పద్దో పరకో పారేసి రాయించుకోడం- వాళ్ల పేరూ వీళ్ల రాతాను. కొత్తగా ఉంటుంది ఒక పేనా లీ శెంటిల్ మన్ అన్నట్టు.

ఆ మాటకొస్తే ఇదీ కొత్తగాదనుకోండి. జరుగుతున్న కథేగదా.

మ్యూజికు విషయంలోమాత్రం ఈ పద్ధతి తీవర్సులో వాడాలి. ఒకొక్క తెలుగు పిక్చరులో ఏదాగా హిందీ హిట్ సాంగులు గుప్పిస్తున్న ప్రొడ్యూసర్లు ఆ రికార్డింగు పనికి కుదుర్చుకుంటున్న మ్యూజికు డైరెక్టరికి ఇంకో పదివేలుపారేసి, పేరుసంగతి మర్చిపోమ్మనాలి. ఆపైన తమ పిక్చరుకి మ్యూజికు డైరెక్టర్లు శంకర్-జైకిషన్, బర్మన్, రామచంద్ర అని పబ్లిసిటీ ఇస్తే బాక్సాఫీసు ద్గరా ఇంకా బావుంటుంది. చిత్రగుప్త, రవి వగైరాల పాటలు పుచ్చుకున్నప్పుడు మాత్రం శంకర్ జైకిషన్, బర్మన్ అనే వేసెయ్యడం మంచిది.

ఇదీ బుద్ధిమంతుల పద్ధతి.

* * *

ఎక్స్ట్రాయిజాసుంకం పేరిట పోలు వాళ్లు ఆటకి రెండేసి రూపాయలు అచ్చుకోవాలని గుడిసెవాలవాళ్లు, కాదు మీకేనని పోలీ వాళ్లూ అంటున్నారు. ప్రొడ్యూసరింకో

ఏవీ అనకుండానే ఈ రెండువర్గాలవారూ ఇలా వాదించుకోడం చూసి పెద్దవారలు కొంచెం ఖంగారుపడుతున్నారు - ఇది ఇటు తిరగదుగదా అని. మరేం ఫర్వాలేదు. తెర వేలుపులజోలికి ఎవడూ పోలేడు. మహా అయితే చిన్నపటులు భరిస్తారు దానికం.

" అయినా కాపోయినా ఇదే వంత పెద్ద మొత్తం గనకా అధవ రెండు రూపాయలు. సముద్రంలో నీటి బొట్టంతా " అన్నాడు ఒక వర్గపాయన రెండోవర్గం వాళ్లకేసి కోరగా చూసి.

" అదేంమాట, లిటిల్ డ్రాప్స్ జాయిన్ టుగెదర్ టు మేక్ నోషన్ - చిన్న చిన్న నీటి బొట్లు కలిస్తేనే సముద్రాలు తయారవుతాయి " అన్నాడు నీటిబొట్ల విలువ తెలిసిన ధన సముద్రుడు.

మొత్తానికి మనం వీటిగురించి ఆట్టే చర్చించడం క్షేమకరంగాదు. వాళ్లూ వీళ్లూ కలిసి మున్నెత్తికి తోసీగలు.

ఎస్. పార్థసారథి.



మంజీరావారి 'చివరకు మిగిలేది'లో సావిత్రి, హరనాథ్.

మరి కోటాను ఎందుకు ప్రకటించవలసి వచ్చిందో తెలియదు. ఈ పండుగనాడు మిఠాయి తినాలని గర్భదరిద్రుడికి సైతం కోరిక కలుగుతుంది. శ్రీ నెహ్రూ సామ్యవాద ప్రభుత్వం చక్కెరను చేదుగా తయారు చేసింది. చక్కెర భోగవస్తువని ప్రణాళికా సంఘం నిర్వచనం. అంటే భాగ్యవంతులు మాత్రమే దానిని వాడుకోవాలన్నమాట.







న్యూఢిల్లీ లేఖ

(7 వ పేజీ తరువాయి)

చక్కెర పరిశ్రమకు పార్లమెంటులో పలుకుబడిగల లాబీఉన్నది. పార్టీ నిధులకు ఈ పరిశ్రమ ఇస్తున్న విరాళాలనుగూర్చి న్యాయమూర్తి వివియన్‌బోస్‌వంటి వారిచే దర్యాప్తు చేయించాలి.

* * *

ప్రభుత్వరంగంలో డీసెల్ రైలుఇంజన్ల కర్మాగారం నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 181 డీసెల్ ఇంజన్లు పనిచేస్తున్నాయి. వీటిలో 78 మాత్రమే సరియైనస్థితిలో ఉన్నాయి. తృతీయ ప్రణాళిక కాలంలో 450 ఇంజన్లు నిర్మించాలని లక్ష్యం. పెద్దఎత్తున సరుకురవాణాకోసం, ముఖ్యంగా బొగ్గును తరలించేందుకు అసన్సోల్ - రూర్కెలా, బర్కాఖానా- డాల్టన్ గంజ్ - గయ - మొగల్ సరాయ్ సెక్షన్లలో డీసెల్ ఇంజన్లు ప్రవేశపెట్టబడినవి. ఈ సెక్షన్లలో స్టీమ్ ఇంజన్లతో పనిజరుగదు. ముందు ముందు విద్యుచ్ఛక్తి తగినంత లభించినప్పుడు, విద్యుచ్ఛక్తితో నడిచే ఇంజన్లను ప్రవేశపెట్టడానికి నాందిగా, ఇప్పుడు డీసెల్ ఇంజన్లు ఏర్పాటుచేసినట్లు వివరిస్తున్నారు.

బొగ్గురవాణా శీఘ్రంగా జరిగేందుకు, మొగల్‌సరాయ్‌నుంచి లక్నో మీదుగా సహారాన్పూరువరకు డీసెల్ ఇంజన్లుగల రైళ్ళు నడపాలని యోచిస్తున్నారు. అప్పుడే ఈ సెక్షన్‌లో ప్రవేశపెట్టేనిమిత్తం 40 ఇంజన్లకు టెండర్లు కోరటంకూడా జరిగింది.

* * *

సంపద మదింపుసంఘంపై కొన్ని వ్యాఖ్యలు చేయవలసిఉంది. దేశంలోని విదేశీ సంస్థల ఆస్తిపాస్తులనుగూర్చి 1947 నుంచి రిజర్వు బ్యాంకు ఒకనివేదిక తయారుచేయవలసివస్తోంది. 1947ఆగస్టు 15-వ తేదీన, ఆతరువాత 18సంవత్సరాలలోను దేశీయసంస్థల ఆస్తిపాస్తులనుగూర్చి కూడా ఒకనివేదిక తయారు చేయవలసిందని వారినే ఆదేశిస్తే పనిసులువు అయ్యేది.

ఆ ఆస్తిపాస్తులతోబాటు, మరికొన్ని విషయాలనుగూర్చి కూడా దర్యాప్తుచేయించటం అవసరం. ఉదాహరణకు 1947 ఆగస్టు 15 వ తేదీనటికి, ఇప్పుడు సగటున మనిషి. ముఖ్యంగా ఉద్యోగులు—ఎంత ఉత్పత్తి చేశారు; చేస్తున్నారు అనే విషయం విచారించాలి. అల్లాగే మొదటి రెండు ప్రణాళికలకాలంలోను ఎన్ని కార్మిక శాసనాలు తయారైనవి, ఎవరికోసం ఇవి తయారైనవి, వీటిలో ఎన్ని అమలుఅయినవి ఫలితాలు ఏవిధంగా ఉన్నవి కూడా దర్యాప్తు జరిపించటం అవసరం. ★

చిన్నారి పాపాయి

పి వి. రామనర్సయ్య

మా ఇంటి పాపాయి మా కంటి చెలువ
మా చంటి పాపాయి మా ఇంటి వెలుగు
పాపాయి చూపులో అందాలు కలవు
అందాల ముఖములో చందురుడు కలడు.

చల్ల చల్లగ వీచు పిల్లగాడుపులలో
మమతలూరగ పిలుచు మాతృహృదయంలో
మైమరచి పాపాయి మురసినవ్వంగా
చిన్నారినోటిలో వెన్నెలలు పొంగ
పాపాయి కదిలితే కదలు లోకాలు
పాపాయి పలికితే ఒలుకు ముత్యాలు
ఊయాల జంపాల నూగగా బాబు
కలిసి నాట్యం చేసె కాలుమువ్వల్లు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

గళ్ళ నుడికట్టు-26


ఆధారాలు

అడ్డము

1. విచారంలో వేడి.
3. మాయఘోష.
5. తీరా హత్యచేయవచ్చిన దుష్టుడెందుకో పారుకొన్నట్టు చల్లగా? ఆయుధం కనబడలేదా?
7. కౌశల్యమిస్తే కాకి కోమలి కోశమవుతుంది?
8. అనుమానమంటూ కలిగితే మళ్ళీ అందులో హద్దులూ కొలతలూ ఉంటాయా?
9. బహువచన మ్మొక్క కలుపుకుంటేసరి తీరి కూచుని తిని మరీ లెక్కెట్టొచ్చు నీటిని.
11. పిల్లలమర్రి పినవీరభద్రుడి రాణి!
12. దీనికింద నీళ్లు చల్లగా పరిగడతాయంటారు.
14. మరి పులుగు రెండు కెగిరిపోయినట్టు! పగవాళ్లను చూశాయా?
15. బోయవాడు పాలం ముడిచి దాగి ఉన్నాడు.
17. తనంతతా తలచి వచ్చి చులుకన కాగలది.
18. అనాగతంలో కాగలదే కాదు; జరిగినదీ ఉంది.
19. ఛందస్సులో కనబడే ఋషులు.
20. మగవాడు శ్రద్ధగా చూసేది, అందుబాటులో ఉన్న ఈమెను కాదు; ఎంతసేపూ——.
21. భక్తి చూపిన చిన్న జంతువులో ప్రథమా విభక్తి ముందుకొచ్చింది.
23. రకి వ్యాకరణప్పేరు.
25. నా అనేవా రుంటే రెండు రెక్కే.
26. ఈ గుర్రం ఎగురుతుంది.
27. అనికమూ ఉండదుకాని, ఉన్నంతసేపూ చీకటే.
29. రూపురేఖా విలాసాల తీరే ఇది.
30. ఋతుమూలపే; మరోటి.
31. కూర్చే మా కందం ఆది కొట్ల ఫ్యంపే, కాదు మారే మా కందం అనే పెట్టు.
32. కొలతలకు 'నిండుతనం' చేకూర్చేది.
33. నరుడికీ, వానరుడికీ కూడా సోదరుడు.

నిలువు

2. ఈ రోగం.
4. దుర్ముఖుడి మారుపేరు.
6. నవ కవితామహారాష్ట్రానికి పీష్వా అన్న బిరుదును స్రుతికలిపే పేరుగల తెలుగుకవి.
7. మృగరాజుకే నరి అనడానికి మంచి ఉపమించడం కష్టం.
10. చక్కని మాటవరసన్న మాట.
11. బపాలు గనులు కావు.
13. పగలు, రాత్రులు.
15. ధర్మంకోసం ఘోష పెట్టేవారికి కూడా ధర్మాన్ని నిజంగానే ము. చ. తప్పక పాలించేవాడు ఇలాగే కనిపిస్తాడు.
16. 15 అడ్డంలో దాడి పెట్టు.
20. మామిడిచెట్టుపూత, కోకిలమ్మ కూత చెప్పేది ఏమని?
22. కలిపి పూలమాలవంటి పద్యం.
24. బ్రహ్మచారి, కొండకాయ రారాని స్థితి.
28. ఇందులో నూరున్నాయి.
30. ఇంకేముంది, విన్నన్న చెప్పిందే.



గళ్ళనుడికట్టు-23

ఆధారాల పోటీ ఫలితం

శ్రీమతి తాడూరి శేషగిరమ్మ (రాజమండ్రి) పంపిన ఆధారాలు ఉత్తమమైనవిగా నిర్ణయించి ఆమెకు బహుమతిగా రు 5 లు పంపుతున్నాము.

శ్రీమతి శేషగిరమ్మ పంపిన ఆధారాలు ఇవి:

8 అడ్డం: "పోతిమి; కరము—పోక పోతే చీకటి."

(మేము ఇచ్చినది—కృష్ణ (శాస్త్రి) పత్రంలో కృష్ణ వస్తువు కనబడేదే కాని కనబడనీయనిది). జవాబు—తిమిరము.

18 నిలువు: "అందుకే వారు జనరల్ హాస్పిటల్లో చేరారు". (మేము ఇచ్చినది—వారు జబ్బుపడ్డారు).


జవాబు—రుజ.

—సంపాదకుడు.

25-వ గళ్ళనుడికట్టుకు జవాబులు

■	1 నా	మ	2 ము	■	■	■	3 భా	ర	4 వి	■
5 వా	తి	■	రు	■	6 వే	■	ణ	■	7 సు	8 తి
చ	■	■	9 గు	10 ప్ర	థ	11 న	ము	■	■	ల
12 ఖి	13 డే	■	■	లు	■	డి	■	■	14 పా	లు
■	15 బా	16 బా	■	ము	■	■	■	17 క్రా	సు	■
■	■	ష్ప	■	■	■	■	■	టు	■	■
■	18 సా	ము	■	■	■	19 కి	■	20 క	21 ల	■
22 మే	లు	■	■	23 శి	■	సు	■	■	24 త	25 మి
ఖ	■	■	26 ఈ	శు	27 న	క	28 ము	■	■	ధు
29 ల	30 వం	■	ర	■	వ	■		■	31 జ	నం
■	32 గం	థ	ము	■	■	■	33 క్రో	రు	టు	■

బహుమతి పొందిన కార్టూన్



చిత్రకారుడు – కలువకొలను సదానంద (పాకాల)

పొట్టి కథలు

పెళ్లి పెద్ద

పిల్లను చూసుకోవడానికి ఒక పెళ్లి పెద్ద మధ్యవర్తిగా వచ్చాడు. పిల్లను చూసి "అమ్మాయి బాగానే ఉందండి. అబ్బాయిని త్వరలో పంపుతాను" అని, "ఏమండీ అమ్మాయికి, కుట్లు, చదువు, వంట, సంగీతముగాని ఏమైనా వచ్చునాండి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్నిటికి సావధానంగా జవాబులు చెప్పుకు వచ్చాడు పిల్లతండ్రి. ఇక పిల్ల తండ్రి మొదలుపెట్టాడు అడగడం: "ఏమండీ మనలో మన మాట, అబ్బాయికి ఏమైనా దురలవాట్లున్నవా" అని అడిగినాడు.

పె. పె. "అబ్బే ఏమి లేవండి. ఏదో సిగరెట్లు తప్ప" అన్నాడు.

పి. తం. "ఓ దానికేమిలెండి. ఫరవాలేదు" అన్నాడు.

పె. పె. "అదిమాత్రం, అస్తమానూ కాల్చడు. ఏదో కిళ్లీ వేసుకోనప్పుడే" అన్నాడు.

"తాంబూలం తరతరాల నుంచి వస్తుందా" అన్నాడు పి. తం.

పె. పె. "ఆకిళ్లీ మాత్రం అస్తమానం వేసుకోడండి. ఏదో, తాగితే నోరు వాసన వేయకుండా ఉండడానికే" అన్నాడు.

పి. తం. "ఆ? తాగుడు వుందా?"

"అబ్బే అస్తమానం తాగుతాడనుకొన్నారా? ఏదో పేకాటలో డబ్బువస్తేనే" అన్నాడు పె. పె.

పి. తం. "ఇకనే పేకాట ఉన్నదాండి?"

పె. పె. "అదిమటుకు జేబులు కొట్టడంలో డబ్బు దొరికితేనే కదండీ?" అన్నాడు.

పి. తం. "మంచిది ఇంకా ఏమైనా ఉన్నాయండీ అబ్బాయికి" అని అడిగాడు.

పె. పె. "ఆ జేబులుమటుకు అస్తమానూ కొట్టడనుకున్నారా? జైలునుంచి విడుదల అయ్యాకా గాని, అస్తమానూ చేయడండీ" అని, గుట్లు అన్నీ బయట పెట్టాడు ఆ తెలివితక్కువ పెళ్లి పెద్ద.

పి.తం. "బాబు మీ సంబంధమునకు ఒక నమస్కారము. మీకో నమస్కారము. దయచేసి బయటకు వెళ్ళండి నీలాంటి తెలివితక్కువ వాడిని పంపినన్నాళ్లు వాడికి పెళ్లి అవదు అన్నానని పెళ్లి చెప్పు" అన్నాడు కోపంతో పిల్లతండ్రి.

—పి. నాగజ్యోతి (కాకినాడ)

* * *

భర్త: అదేమిటే! నేను వంట చేస్తుండగా, వాడినెందుకు వంట సామాన్లు ముట్టుకొమ్మంటావ్?

భార్య: మహా చెప్పొచ్చారులెండి, మీరు. ఇప్పుడు నాకు వంటచేసిపెడుతున్నారు. వాడి పెళ్లయ్యాం తరువాత వాడు చెయ్యొద్దూ? ఇప్పట్నుంచే వంట శిక్షణ ఇస్తున్నా!

– [illegible] రాజేశ్వరరావు ([illegible])

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd., by S. Radha Krishna at TheAndhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1, Editor S. Sambhu Prasad



డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్ర :- మెసర్సు పరమేశ్వరీ ఫిలింస్ (ప్రైవేట్) లిమిటెడ్

నైజాం :- మెసర్సు విజయ రిలీజ్.